ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 166 పేజీలు: 10+4 వెల: 6.50

కాపునేత ముద్రగడకు కన్నీటి వీడ్కోలు 2లో

సెమికాన్ 2.0కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ 5లో

## కృష్ణాడెల్టాకు 'పట్టిసీమ' సిరులు

### 2015 నుంచి 450 టిఎంసిల నీరు తరలింపు

### వంశధార నుంచి పెన్నా వరకు రివర్ లింకేజ్ లక్ష్యం

### ప్రతి ఎకరాకు సాగునీరు ప్రభుత్వ లక్ష్యం

### ఎన్టీఆర్ జిల్లా పవిత్ర సంగమం వద్ద సిఎం జలహారతి

### కెఎల్ రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నివాళులు



బుధవారం గోదావరి, కృష్ణానదుల పవిత్ర సంగమం వద్ద జలహారతి పడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ. జూలై 15, ప్రభాతవార్త ప్రతినిధి:** పట్టిసీమ ప్రాజెక్టు వల్లే కృష్ణా డెల్టాలో రైతులు సిరులు పండించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2015 నుంచి ఇప్పటి వరకూ పట్టి సీమ ప్రాజెక్టు నుంచి 450 టిఎంసిల గోదావరి వరద జలాలను తరలించినట్టు వెల్లడించారు. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టి సీమ డెల్టాతో పాటు రాష్ట్రంలో విలువైన సంపద సృష్టికి కారణమైందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నం వద్ద కృష్ణాగోదావరి నదుల పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు ముఖ్యమంత్రి జల హారతి ఇచ్చారు. సంప్రదాయ పంచె కట్టులో వచ్చిన ముఖ్యమంత్రి కృష్ణా గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు సమర్పించారు. సంప్రదాయక క్రతువులు నిర్వహించారు. అనంతరం ప్రముఖ ఇంజనీరు కెఎల్ రావు 124వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సాగునీటి రంగానికి సేవలు అందించిన కెఎల్ రావు గారి 124 జయంతిని పురస్కరించుకుని >>2

## ఫార్మా సిటీలో భారీ అగ్ని ప్రమాదం

### తృటిలో తప్పిన పెను విషాదం

### 11 మంది ఉద్యోగులు సురక్షితం

**అనకాపల్లి(పరవాడ), జూలై 15, ప్రభాతవార్త:** అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని శ్రీ సాయి చందన ఎపిఐ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రొడక్షన్ బ్లాక్-2లోని రియాక్టర్ వద్ద మిథనాల్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగినా, సిబ్బంది అప్రమత్తతతో పాటు అగ్నిమాపక శాఖ సకాలంలో స్పందించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-2 మొదటి అంతస్తులో ఉన్న రియాక్టర్ వద్ద అకస్మాత్తుగా పొగలు రావడంతో షిఫ్ట్ ఇన్‌చార్జ్‌తో పాటు విధుల్లో ఉన్న సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనంతరం రియాక్టర్‌లో ఉన్న మిథనాల్ కారణంగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైర్ టెండర్లు, ఫోమ్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. తెల్లవారుజామున 2 గంటలకే మంటలు అదుపులోకి రాగా, ఉదయం 3.30గంటలకు పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాద సమయంలో ఒక ప్రొడక్షన్ ఇన్‌చార్జ్, ముగ్గురు కెమిస్టులు, ఏడుగురు హెల్పర్లు సహా మొత్తం 11 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడం, ప్రాణనష్టం జరగకపోవడంతో జిల్లాయంత్రాంగం, పరిశ్రమ యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నాయి. ఘటనాస్థలాన్ని తహసీల్దార్ రత్నం, సీఐ ఎల్. భాస్కరరావు తదితర అధికారులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరించారు. పరిశ్రమలో ఉద్యోగులకు ముందస్తుగా భద్రతా శిక్షణ ఇవ్వడం, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించడం వల్లే ఈ ప్రమాదం పెద్ద విషాదంగా మారలేదని అధికారులు పేర్కొన్నారు.

## దాల్మియాతో మరింత వృద్ధి

### చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ 2వ ప్లాంటుకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

### రూ. 3100 కోట్ల పెట్టుబడులు

### 80 శాతం పైగా పునరుత్పాదక విద్యుత్ వినియోగం



బుధవారం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ 2వ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారా లోకేష్. చిత్రంలో మంత్రి సవిత తదితరులు

**జమ్మలమడుగు, జులై 15, ప్రభాతవార్త:** కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ 2వ ప్లాంట్ విస్తరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ సుస్థిర పారిశ్రామికీకరణ ద్వారా ప్రపంచ స్థాయి, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి దాల్మియా భారత్ బలమైన భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై సంస్థ మరోసారి విశ్వాసం ఉంచి భారీ పెట్టుబడి పెట్టడం సంతోషకరమని చెప్పారు. ఈ భాగస్వామ్యంతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక సమాజాలు బలోపేతం కావడం, రాష్ట్ర పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి చెందడం, పర్యావరణహిత సాంకేతికత ఆధారిత వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే అత్యంత పెట్టుబడులకు అనుకూలమైన, ప్రగతిశీల రాష్ట్రంగా ఎదిగిందని చెప్పారు. పారదర్శక పాలన, స్థిరమైన విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపార నిర్వహణకు అనుకూల వాతావరణం రాష్ట్రంలో మరో భారీ పెట్టుబడికి తమను ప్రోత్సహించాయని తెలిపారు. ఈ కొత్త తయారీ కేంద్రం తక్కువ కార్బన్ ఉద్గారాలతో కూడిన భవిష్యత్ సిమెంట్ తయారీపై తమ దీర్ఘకాలిక దృష్టికి ప్రతీకగా నిలుస్తుందని పునీత్ దాల్మియా పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ముందుగా దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూంను మంత్రి సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, ఏవీని వీక్షించారు. కార్మికులను పలకరించి వారితో >>2

## నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో నాలుగురోజులపాటు వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే మూడు రోజులు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. వాయువ్య బంగాళాఖాతం మరియు దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో మరింత బలపడి ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ మీదుగా కదిలే అవకాశం ఉందని చెప్పింది. రుతుపవన ద్రోణి కూడా ఆగ్నేయ దిశగా విస్తరించి ఉండడం వల్ల వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న మూడు రోజులు ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రదేశ్ మరియు యానం ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, లేదా జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ రాయలసీమ ప్రాంతాల్లోకూడా వర్షాలు పడే అవకాశాలు >>2



బుధవారం డిశ్చార్జికి ముందు పవన్‌కు వైద్యసలహాలు ఇస్తున్న డాక్టర్

## ముంబయి ఆస్పత్రినుంచి డి.సిఎం పవన్ డిశ్చార్జ్

### హైదరాబాద్ నివాసానికి చేరుకున్న పవన్

**విజయవాడ.జులై 15.ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి నుంచి బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆయన భుజానికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతం కావడంతో వైద్యులు ఆయనను డిశ్చార్జ్ చేశారు. గత కొంతకాలంగా రెండు భుజాలకు సంబంధించిన రొటేటర్ కఫ్ సమస్యలతో బాధపడుతున్న పవన్ కల్యాణ్, చికిత్స నిమిత్తం ఈ నెల 10న ఆసుపత్రిలో చేరారు. ఆయన కుడి భుజానికి వైద్యులు సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు. సర్జరీ అనంతరం గత నాలుగు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆయన, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నారు. పవన్ కల్యాణ్ పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరికొన్ని రోజుల పాటు సంపూర్ణ విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కాగా, పవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా వెళ్లి ఆయనను పరామర్శించారు. పవన్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న సిఎం, ఆయన త్వరగా కోలుకొని విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ >>2

## విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

### రోజుకు 280 మి.యూనిట్ల కరెంటు వినియోగం

### వరుసగా రెండో యేడాది ట్రూడౌన్ అమలు: మంత్రి గొట్టిపాటి రవికుమార్



**విజయవాడ, జులై15, ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ట్రూఅప్ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, ట్రూడౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో యేడాదిలోకి అడుగుపెట్టామని, ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లకు తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వల్ప కాలంలోనే గాడిలోపెట్టారని మంత్రి అన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. వరుసగా రెండో యేడాది కూడా విద్యుత్ ఛార్జీలను తగ్గించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 940.07 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టబోతోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్)కి వినతి >>2



బుధవారం కెఎల్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

## వచ్చే మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు

### - సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, జులై15, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే 3 యేళ్లలో ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసే 36 సాగునీటి ప్రాజెక్టుల వివరాలు సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. కేంద్ర దివంగత మంత్రి, కెఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి చంద్రబాబు నివాళులర్పించారు. తరువాత ఆయన మాట్లాడుతూ కెఎల్‌రావు స్ఫూర్తితో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. వీటిలో తుంగభద్ర కొత్త గేట్లు గత నెల ప్రారంభోత్సవం పూర్తి అయినట్లు వివరించారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్లు ఏర్పాటుకు ఈనెల 13న శంకుస్థాపన పూర్తి చేసామన్నారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణ ఈనెల 31న శంకుస్థాపనజరుగుతుంది. పోలవరంఎడమ ప్రధాన కాలువ 14 ఆగస్టున పారంభోత్సవం, పెరూరు బ్రాంచ్ కెనాల్ ప్యాకేజీ 36ఏ ఆగస్టు4న శంకుస్థాపన.

## వారసత్వ సాగు భూమిపై కుటుంబ సభ్యులకే తొలివాక్కు

### సుప్రీం కోర్టు సంచలన తీర్పు



**విజయవాడ.జులై15, ప్రభాతవార్త పతినిధి:** హిందూ వారసత్వ చట్టం ప్రకారం, కుటుంబ సభ్యులకు వచ్చిన ఉమ్మడి వ్యవసాయ భూమిని తోబుట్టువులు ఎవరైనా బయటి వారికి విక్రయించాలనుకుంటే, దానిని ఆపే హక్కు మిగిలిన కుటుంబ సభ్యులకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ ఆస్తుల పంపకాలకు సంబంధించి ఒక కీలకమైన చట్టపరమైన వివాదానికి సుప్రీంకోర్టు తెరదించింది. హిందూ వారసత్వ చట్టం 1956 (సెక్షన్ 22) ప్రకారం, ఉమ్మడి ఆస్తిగా వచ్చిన వ్యవసాయ భూమిని విక్రయించేటప్పుడు మొదటి తరగతి వారసులకే ప్రాధాన్యత ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. వ్యవసాయ భూములకు ఈ నిబంధన వర్తించదంటూ దాఖలైన అప్పీల్‌ను న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ నాంగ్మీకపం కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మహీందర్ వర్సెస్ పూరన్ సింగ్ కేసులో ఈ తీర్పును వెలువరించింది. అంతకుముందు పంజాబ్ ,హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తూ, ఈ వివాదానికి ముగింపు పలికింది. కర్నాల్ జిల్లాలోని కైమ్లా గ్రామానికి చెందిన నాన్హు అనే వ్యక్తి పిల్లల మధ్య ఈ భూవివాదం మొదలైంది. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిని ఏడుగురు తోబుట్టువులు కలిసి ఒక బయటి వ్యక్తికి అమ్మేయడానికి సిద్ధపడ్డారు. అయితే, మిగిలిన ఒకే ఒక్క వారసుడైన పూరన్ సింగ్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. చట్టం ప్రకారం ఆ భూమిని కొనుగోలు చేసే మొదటి హక్కు (ముందస్తు కొనుగోలుహక్కు) తనకే ఉంటుం >>2

## 7 గంటలు హోరాహోరీ

### ఇరాన్‌పై సెంట్‌కామ్ దాడులు

### పోరు మరింత ఉధృతం

### సిచ్యుయేషన్ రూమ్‌లో సీనియర్లతో ట్రంప్ భేటీ



**వాషింగ్టన్,జులై 15:** శాంతిచర్చలు విఫలమైన నేపథ్యంలో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధకాండ వేగవంతం అవుతోంది. ఖమేనీ అంత్యక్రియల తర్వాత ఇరాన్ వైఖరిలో మార్పులు కనిపిస్తున్నాయి. శత్రువులపై కాలు దువ్వుతున్నట్లుగా కనిపిస్తోంది. శాంతి ఒప్పందం పేరుతో చర్చలు జరుపుతున్నా దాడులకు మాత్రం ఏ మాత్రం వెనకాడడం లేదు. ఇరు పక్షాలు కూడా పరస్పర దాడులకు దిగుతున్నాయి. దీంతో మధ్యప్రాచ్యం మరోసారి అట్టుడుకుతోంది. గత రాత్రి ఇరాన్‌లోని ప్రధాన లక్ష్యాలపై అమెరికా ఏడు గంటల పాటు భీకర దాడులు చేసింది. ఇప్పుడు మరోసారి అత్యంత భీకర స్థాయిలో దాడులు చేసేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని అత్యంత భద్రత కలిగిన సిచ్యుయేషన్ రూమ్‌లో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇరాన్‌కు భారీ నష్టం కలిగించి, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు అణు కార్యక్రమాన్ని నిలిపి >>2

16-7pg2exHMNWJQE:16-7pg2exHMNWJQE.qxd 7/15/2026 11:56 PM Page 1





బుధవారం దాల్మియా సిమెంట్ పరిశ్రమ 2వ ప్లాంట్ విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి లోకేష్

# దాల్మియాతో మరింత వృద్ధి

>> కలిసి సెల్ఫీ దిగారు. పునీత్ దాల్మియాతో కలిసి దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్-2 విస్తరణ పనులకు మంత్రి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**రూ.3100 కోట్లు పెట్టుబడి పెట్టనున్న దాల్మియా భారత్ సిమెంట్**

దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్-2 విస్తరణను రూ.3100 కోట్ల వ్యయంతో చేపట్టనుంది. మైలవరం మండలంలోని చిన్నకొమెర్లలో ప్లాంటులో దాల్మియా సిమెంట్ ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. కొత్త ప్లాంట్ విస్తరణతో క్లింకర్ సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ప్లాంట్ విస్తరణతో కొత్తగా వెయ్యి మందికి ఉద్యోగాల కల్పన జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టీజీ భరత్, బీసీ సంక్షేమశాఖామంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సి.హెచ్.భూపేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్ పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ పరేఖ్, ప్రాజెక్టు హెడ్ అనుపమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా న్యూజెర్సీలో రోడ్డు ప్రమాదం

## పల్నాడు జిల్లా వినుకొండ మండల విద్యార్థిని మృతి



మక్కెన ప్రసన్న (ఫైల్)

**వినుకొండ (పల్నాడు జిల్లా), జులై 15, ప్రభాతవార్త:** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన యువతి మక్కెన ప్రసన్న(27) న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెంది. సాధారణ రైతు కుటుంబానికి చెందిన మక్కెన వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు సంతానం.వారిలో పెద్ద కుమార్తె ప్రసన్న 2022లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లింది. అక్కడ ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది.మంగళవారం ప్రసన్న తన ముగ్గురు స్నేహితులతో కలిసి అద్దె కారులో ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందగా,ఆమె స్నేహితులకు గాయాలయ్యాయి.

పెద్ద కుమార్తె మరణ వార్త విన్న వెంకటేశ్వర్లు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.ఈ వార్తతో ఉమ్మడివరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఈ విషయం తెలుసుకున్న ఎపి ప్రభుత్వ చీఫ్ విప్,వినుకొండ ఎమ్మెల్యే జీవి.ఆంజనేయులు మృతురాలి తండ్రికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కుటుంబ సభ్యులు కూడా తమ కుమార్తె మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఇంజినీరింగ్ ప్రవేశాలకు అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఎప్‌సెట్ ఫలితాలు వెల్లడి కావడంతో తొలి విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. జులై 20 నుంచి 29 వరకు మొత్తం పది రోజుల పాటు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు ప్రక్రియ కొనసాగనుంది.తొలి విడతలో జులై 20 29 వరకు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపుఅప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జులై 22 నుంచి 31 వరకు, వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం జులై 25 నుంచి 31 వరకు, వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు వెసులుబాటు ఆగస్టు 1న, ఆగస్టు 6న తొలి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి, ఆగస్టు 7 నుంచి 13 వరకు కాలేజీలో సెల్ఫ్ జాయినింగ్, రిపోర్టింగ్ చేయాలి ఆగస్టు 10 నుంచి ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభం అవుతాయి.

# స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లకు రెండేళ్ల కాలవ్యవధి

## న్యాయశాఖామంత్రికి విజ్ఞప్తి

**విజయవాడ, జులై 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ (సెకండ్‌క్లాస్) నియామకాలను రెండేళ్ల కాలవ్యవధితో చేపట్టాలని పలువురు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లు రాష్ట్రన్యాయశాఖా మంత్రి ఎన్‌యండి.ఫరూఖ్‌ను కోరారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిని కలిసిన మెజిస్ట్రేట్‌లు ప్రస్తుతం ఒక ఏడాది వ్యవధితో జరుగుతున్న నియామకాలను రెండేళ్ళ వ్యవధికి పొడిగించాలని కోరారు. కేసుల నిర్వహణలో జాప్యాన్ని నివారించేందుకు తమ పదవీకాలాన్ని పెంచాలని విజ్ఞప్తి చేసారు. వీరి వినతికి స్పందించిన మంత్రి మాట్లాడుతూ మెజిస్ట్రేట్‌ల నియమిత కాలాన్ని రెండేళ్ళకు పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో అసెంబ్లీలో బిల్లు నెంబర్ 18/2025ని తీర్మానించి రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వ్‌చేసినట్లు వివరించారు. త్వరలో ఈబిల్లు అమలయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి :**

న్యాయవాదులు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్యభీమా వసతి కల్పించాలని, అర్హులైన జూనియర్ న్యాయవాదులకు వారు నమోదు చేసుకున్న తేదీ నుండి ఐదుసంవత్సరాల కాలానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించాలని, న్యాయవాదులపై దాడులు నివారించేందుకు న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని, న్యాయవాదులకు నివేశనస్థలాలు కేటాయించాలని, మంత్రి ఫరూక్‌ను న్యాయవాదులసంఘం ఐఎల్‌ఏ ప్రతినిధులు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# కృష్ణాడెల్టాకు 'పట్టిసీమ' సిరులు

>>ఇంజనీరుగా స్ఫూర్తిని ప్రతీ గ్రామానికీ తీసుకెళ్లేలా ఆయన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పట్టి సీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయి. యేడాదిలో పట్టి సీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీది. 80 టిఎంసిలతో కృష్ణా డెల్టాలోని 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం. నాకు ఎక్కడ పేరు వస్తుందో అని నాడు పట్టి సీమ నిర్మిస్తుంటే కొందరు విమర్శించారు. పట్టి సీమ, ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకుని ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేస్తే కృష్ణా డెల్టా ఏమయ్యేదో. విమర్శలు పట్టించుకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు చేసి పట్టి సీమ పూర్తి చేశాం. గోదావరి నుంచి కృష్ణా నదికి 450 టిఎంసిల వరద జలాలను తీసుకువచ్చాం. పట్టి సీమకు చేసిన ఖర్చుతో కృష్ణా డెల్టా మొత్తం స్థిరీకరణ జరిగింది. ఎకరాకు రూ.1200 ఖర్చు అవుతోంది. వనరులు వృధా కాకుండా రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. వచ్చే వరద జలాలను సముద్రానికి వదిలేసి ఇతర ప్రాంతాలనుంచి నీటిని తెచ్చుకోవటం తెలివైన పని అనిపించుకోదు. పట్టి సీమ నీటితో కృష్ణా డెల్టాలో రైతులు బంగారం పండిస్తున్నారు. పోలవరం కుడి కాలువ నుంచి నీటి తరలింపు కారణంగానే శ్రీశైలంలో కృష్ణా నీటిని పొదుపు చేసి రాయలసీమకు నీరందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకి సాగునీరు అందించాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 2014- 19 మధ్య రూ.68 వేల కోట్లు సాగునీటి రంగానికి ఖర్చు చేశామన్నారు.

**ప్రాజెక్టులపై గత పాలకుల నిరక్ష్యం..**

2024 నుంచి రెండేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు పెట్టాం. గత పాలకులు అన్నమయ్య డ్యామ్ కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకు పోయినా మాట్లాడలేదు. ప్రాజెక్టుల మరమ్మతులకు పైసా ఇవ్వలేదు, గ్రీజు కూడా పూయలేదు. తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లను ఏర్పాటు చేయించాం. నిన్న ధవళేశ్వరం బ్యారేజికి కూడా రూ.152 కోట్లుతో కొత్త గేట్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించాం. 2014-19లో పోలవరం ప్రాజెక్టులో 72 శాతం పనులు పూర్తి చేశాం. గడచిన రెండేళ్లలో ప్రాజెక్టును 89 శాతం మేర పూర్తి చేశాం. కానీ 2019-24 మధ్య కనీసం 2 శాతం కూడా పనులు చేయలేదు. పూర్తి నిరక్ష్యంతో డయాఫ్రామ్ వాల్ కూడా కొట్టుకు పోయేలా చేశారు. అతి ముఖ్యమైన ప్రాజెక్టుల పట్ల నిరక్ష్యం చేయటం దేశ ద్రోహం, రాష్ట్ర ద్రోహం. ప్రాజెక్టులను గాలికి వదిలేసిన గత పాలకులు రాష్ట్ర రైతులకు ద్రోహం చేశారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారు. ప్రతిపక్షంలోని కొందరు రైతుల్ని రెచ్చగొట్టి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేసి ప్రారంభించాం. కాటన్ బ్యారేజికి కూడా కొత్త గేట్ల పనులు ప్రారంభించాం. వచ్చేయేడాదికి ఈ పనులు పూర్తి అవుతాయి. గుంటూరు ఛానల్ ఆధునీకరణ పనులకు కూడా ఈ నెలలోనే శంకుస్థాపన చేసి రెండేళ్లలో పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పూర్తి అయ్యింది. ఆగస్టు 14 తేదీన గోదావరి జలాలకు అనకాపల్లి వద్ద స్వాగతం పలుకుతాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ను 2026 సెప్టెంబరు 1 తేదీన జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టులో రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్ లో ఉన్నా గత పాలకులు ప్రాజెక్టు ప్రారంభించామని నాటకాలు ఆడారు. సొరంగంలో టన్నెల్ బోరింగ్ యంత్రం ఇరుక్కు పోయి ఉన్నా జాతికి అంకితం అన్నారు. గత పాలకులు చేసిన మోసాన్ని కూడా ప్రజలకు చెబుతాం. రాష్ట్రంలో కురిసే ప్రతీ వర్షపు చుక్కనూ భూగర్భ జలంగా మార్చుకోవాల్సి ఉంది. జలధార కింద ఈ పనులు పెద్ద ఎత్తున చేపట్టాం. రాష్ట్ర భవిష్యత్తుకు విరోధంగా పనిచేసే వారి పట్ల మనం అంతా అప్రమత్తంగా ఉండాలి"అని ముఖ్యమంత్రి అన్నారు.

**సాగునీటి రంగంలో కేఎల్ రావుది ఎనలేని కృషి.**

శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్ ల నిర్మాణంలో కెఎల్ రావు కీలక పాత్ర పోషించారు. ఐక్యరాజ్య సమితి తరపున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారు. విజయవాడలో జన్మించి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేంద్ర మంత్రిగా పనిచేశారు. నీటిపారుదల రంగం, జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారు. శివ రామకృష్ణయ్య, కేఎల్ రావుల తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా నాకు ఎంతో స్ఫూర్తి. జలధార కార్యక్రమంతో భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా చర్యలు చేపట్టాం. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ సహా ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

# అమరావతిలోని అసైన్డ్ భూముల విషయంలో చంద్రబాబు, నారాయణకు హైకోర్టులో ఊరట

**విజయవాడ. జులై 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధానిలోని అసైన్డ్ భూముల విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇరువురిపై సీఐడీ నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. అసైన్డ్ భూముల్లో అవకతవకలు జరిగాయంటూ 2021 ఫిబ్రవరి 24న వైసీపీనేత ఆళ్ల రామ కృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎపి అసైన్డ్ భూముల బదిలీ నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్ల కింద చంద్రబాబు, నారాయణపై గతంలో సీఐడీ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌కు ఎలాంటి ఆధారాలు లేవంటూ సీఐడీ నమోదుచేసిన కేసును హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ తీర్పుతో చంద్రబాబు, నారాయణ ఊరట పొందారు.

# కృష్ణలంక సిఐ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ

**విజయవాడ.జూలై15.ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణలంక సిఐ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. సస్పెండేడ్ సీఐ నాగరాజుకు జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం నోటీసులు జారీచేసింది. ధర్మాసనం తదుపరి విచారణ ఈనెల 23కి వాయిదా వేసింది. నాగరాజు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసమే జైలు నుంచి తీసుకురావాలని, జైలు నుంచి తీసుకొచ్చి మళ్లీ జైలులోకి పంపేవరకు వీడియో చిత్రీకరించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. తన వాదనలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీఐ నాగరాజు కేవియట్ దాఖలు చేశారు.

# వర్ష సూచన

>> ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రైతులు, ప్రయాణికులు, సాధారణ ప్రజలు వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలు, గాలుల కారణంగా గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది. వ్యవసాయం, రవాణా వ్యవస్థలపై కొంత ప్రభావం పడవచ్చన్నారు. ప్రస్తుతం అల్పపీడనం వల్ల కొంత ఉపశమనం లభించవచ్చని ఆశిస్తున్నారు. ఈ వర్షాలు వ్యవసాయ రంగానికి మేలు చేస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

16-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
విదియ ఉ.8.55
ఆశ్లేష రా.7.57
వర్జ్యం : ఉ.9.38-ఉ.11.06
దు.ఉ.10.02-ఉ.10.54, 2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. ఆస్తి వివాదాలు తీరుతాయి. కొత్త కాంట్రాక్టులు లాభిస్తాయి.

**వృషభం:** స్త్రీలవలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. రాజకీయ వరవడి పెరుగుతుంది. కీళ్ళబాధలు కలుగుతాయి.

**మిథునం:** దూరప్రాంత ప్రయాణాలలో వస్తు భద్రత వల్ల విశేష జాగ్రత్తలు పాటించండి. పోటీపరీక్షలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు. సంతాన విషయంపై ప్రత్యేకమైన శ్రద్ధను కనబరుస్తారు.

**సింహం:** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు. అనుకూలాంశాలు ఉంటాయి. స్పెక్యులేషన్ లాభించదు.

**కన్య :** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. భూ వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**తుల:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యంవద్దు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆ పరిచయాలను మీకు అనుకూలంగా మార్చుకుంటారు.

**ధనుస్సు:** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో రావలసిన నష్టముల నుండి తప్పుకోగలుగుతారు.

**మకరం:** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనలకు, పత్రికలవారితో సంబంధ బాంధవ్యాలు పెంచుకొనుటకు అనుకూలం.

**కుంభం:** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి.

**మీనం:** గృహోపకరణాలకు, సౌందర్య సాధన సామాగ్రికి అధికంగా ఖర్చుచేస్తారు. మనస్సు మారుమూలలోని ఆశ నెరవేరేటట్లు తోస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# కాపు నేత ముద్రగడకు కన్నీటి వీడ్కోలు

## పెరట్లోనే అంత్యక్రియలు

### ముద్రగడ పాడె మోసిన మాజీ సిఎం జగన్

### పార్టీలకు అతీతంగా నేతల నివాళులు

### అధికార లాంఛనాలను తిరస్కరించిన కుటుంబ సభ్యులు

### కడసారి చూపునకు నోచుకోని కుమార్తె క్రాంతి



బుధవారం కిర్లంపూడిలో ముద్రగడ పాడె మోస్తున్న మాజీ సిఎం వైఎస్ జగన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై15,ప్రభాతవార్త :** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పిఎసి సభ్యుడు ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి గురువారం ఆయన స్వగ్రామమైన కాకినాడ జిల్లా కిర్లంపూడిలో అంత్యక్రియలు ముగిశాయి. సుదీర్ఘ ప్రజాప్రస్థానానికి ముగింపు పలుకుతూ ముద్రగడ అనంత లోకాలకు తరలిపోవడంతో కిర్లంపూడి జనసముద్రమైంది. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున తరలివచ్చారు. ముద్రగడ పద్మనాభం చివరి కోరిక మేరకు, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వ అధికారిక లాంఛనాలను సున్నితంగా తిరస్కరించారు. కిర్లంపూడిలోని ఆయన స్వగృహ ఆవరణలోనే (పెరట్లో) హిందూసాంప్రదాయ పద్ధతిలో అత్యంత నిరాడంబరంగా అంత్యక్రియలు నిర్వహించారు. తనకు ఎంతో ఇష్టంగాభావించే ఇంటిఆవరణలోని మామిడి చెట్టు వద్ద పాతిపెట్టారు.

**కన్నీటి పర్యంతమైన కుటుంబం.. ఓదార్చిన జగన్..**

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కిర్లంపూడి విచ్చేసి ముద్రగడ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం తీవ్ర విషాదంలో ఉన్న ముద్రగడ కుమారుడు గిరిబాబు, కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ దగ్గరకు తీసుకుని ఓదార్చారు. "మేమంతా ఉన్నాం.. మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అని ధైర్యం చెప్పారు. కన్నీరుమున్నీరుగా శోకసంద్రంలో వున్న ముద్రగడ కుటుంబంని చూసినవారంతా చలించిపోయారు. ముద్రగడతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసు కుంటూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా ముద్రగడ పాడె మోశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ ముఖ్యనేతలతో కలిసి ఆయన భౌతికకాయాన్ని మోస్తూ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.జగన్, బొత్సలు తమ బంధానికి ప్రతీకగా పాడె మోసారు.అంత్యక్రియల ప్రక్రియ పూర్తయ్యే వరకూ వైఎస్ జగన్ కిర్లంపూడిలోనే ఉండి, కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు.పార్టీలకు అతీతంగా పలువురు రాజకీయ నేతలు నివాళులర్పించారు. రాజకీయాలు పక్కన పెట్టి పలువురు రాజకీయ నాయకులు, సామాజిక రంగ ప్రముఖులు, కాపునేతలు కిర్లంపూడి చేరుకుని ముద్రగడకు నివాళులర్పించారు.

**కడసారి చూపుకు నోచుకోని కుమార్తె చలించిన హృదయం**

మాజీ మంత్రి ముద్రగడ అనారోగ్య సమస్యతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలను బుధవారం కిర్లంపూడిలో గల ఆయన స్వగృహంలో నిర్వహించారు. తండ్రి ముద్రగడను కడసారి చూసేందుకు కుమార్తె క్రాంతి కిర్లంపూడి ముద్రగడ స్వగృహానికి విచ్చేశారు. ఆమెను లోనికి అనుమతించకుండా కార్యకర్తలు నిరోధించారు. ఆమె గుండెలు పిండేలా రోదించి తన తండ్రి కడసారి చూపు చూసేందుకు అనుమతించాలని వేడుకున్నప్పటికీ ఒప్పుకోలేదు. కుటుంబ సభ్యులు కూడా ఆమెను లోనికి అనుమతించేందుకు అంగీకారం లేకపోవడంతోనే ఆమెను లోనికి అనుమతించలేదని పలువురు కార్యకర్తలు పేర్కొంటున్నారు. దీంతో మీడియా లోనే తండ్రిని చూస్తూ కన్నీరుమున్నీరుగా విలపించారు. అలాగే అదికార లాంచనాలు వద్దంటూ కొందరు పోలీసులతో వాగ్వివాదంకి దిగారు.

# ఆస్పత్రినుంచి డి.సిఎం పవన్ డిశ్చార్జ్

>> అయిన వార్త తెలియడంతో జనసేన శ్రేణులు, కూటమి నేతలు మరియు అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముంబయిలోని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి హైదరాబాద్‌లోని నివాసానికి చేరుకున్నారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ భుజానికి ఆపరేషన్ చేశారు. ఆస్పత్రిలో 4 రోజుల చికిత్స తర్వాత పవన్‌ను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన వ్యక్తిగత వైద్య ఖర్చుల విషయంలో తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. భుజం సర్జరీకి సంబంధించిన పూర్తి ఖర్చును ఆయన తన సొంత నిధుల నుంచే భరించారు. ఆపరేషన్‌తో పాటు ప్రయాణ ఖర్చులను కూడా ఆయనే వ్యక్తిగతంగా చూసుకున్నారు.ఇక మంత్రివర్గ సభ్యులకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వ నిధుల నుంచి వైద్య ఖర్చులను రీయింబర్స్‌మెంట్ పొందే సౌకర్యం ఉంటుంది. అయినప్పటికీ, పవన్ కళ్యాణ్ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోలేదు. ప్రజాధనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడకూడదన్న తన సొంత సూత్రానికి కట్టుబడి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఆయన ముక్కుకు శస్త్రచికిత్స చేయించుకున్నప్పుడు కూడా పూర్తి ఖర్చును తన సొంత నిధులతోనే భరించారు. ఇప్పుడు భుజం ఆపరేషన్ విషయంలోనూ అదే విధానాన్ని అనుసరించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఖజానాపై భారం మోపకుండా తన వ్యక్తిగత వైద్య ఖర్చులను తానే భరించడం ద్వారా పవన్ కళ్యాణ్ తన మాటలకే కట్టుబడి ఉంటారని నిరూపించుకుంటున్నారు.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

>> పత్రాలు దాఖలు చేశాయి. అన్ని విధాలుగా పరిశీలించి ఈ తగ్గింపు కింద వినియోగదారుల బిల్లులను ఎంత తగ్గించాలనే దానిపై కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. 2024-25లో డిస్కమ్‌లు రూ.924 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టాయి. ఎన్నికల సమయంలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించబోమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ఐదేళ్లలో ట్రూఅప్, ఇంధన సర్‌ఛార్జ్, విద్యుత్ టారిఫ్ పేరిట వినియోగదారులపై వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ. 32,166 కోట్ల భారాన్ని మోపింది. రాష్ట్రానికి పెద్దఎత్తున వస్తున్న పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖకు సంబంధించి రూ.6 వేల కోట్లు విలువైన వివిధ ప్రాజెక్టు పనులు వేర్వేరు దశల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నిర్ణీత కాలపరిమితిలోగా అవసరం మేరకు అన్ని ప్రాంతాల్లో సబ్ స్టేషన్‌ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కడైనా స్థానికంగా ఇబ్బందులు ఉంటే, అక్కడి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

# కుటుంబ సభ్యులకే తొలివాక్కు

>> దని ఆయన కోర్టును ఆశ్రయించారు. దిగువ కోర్టు మొదట దీనిని తిరస్కరించినప్పటికీ, హైకోర్టు తాజాగా సుప్రీంకోర్టు పూరన్ సింగ్ వాదనను పూర్తిగా సమర్థించాయి.ఈ కేసులో పూరన్ సింగ్ తరఫున హాజరైన ప్రముఖ న్యాయవాది క్రాంతి కుమార్ చిరుమామిళ్ళ రాజ్యాంగం ప్రకారం వ్యవసాయ భూమి వారసత్వంపై చట్టాలు చేసే పూర్తి అధికారం పార్లమెంటుకు ఉందని,హర్యానా రాష్ట్రంలో దీనికి విరుద్ధమైన చట్టం ఏదీ లేనందున కేంద్ర చట్టమే ఇక్కడ చెల్లుతుందని ఆయన వాదించారు. దీనికి మద్దతుగా 2005లో చట్టం నుండి సెక్షన్ 4(2)ని కూడా పార్లమెంటు తొలగించిన విషయాన్ని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా ఉన్న గందరగోళానికి తెరపడింది. ఇకపై హిందూ కుటుంబాలలో సంయుక్తంగా ఉన్న వ్యవసాయ భూమిని ఎవరైనా విక్రయించాలనుకుంటే, ముందుగా తమ తోబుట్టువులకే ఆ వాటాను కొనే అవకాశం ఇవ్వాలి. కోర్టులో కేసు నడుస్తుండగా తొందరపడి బయటి వారికి భూమిని అమ్మేసి చట్టం నుండి తప్పించుకోవాలని చూస్తే కుదరదని ఈ తీర్పు హెచ్చరిస్తోంది.

# 7 గంటలు హోరాహోరీ

>> వేయాలనే అమెరికా డిమాండ్‌ను అంగీకరించేలా ఒత్తిడి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా చర్చలు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సిచ్యుయేషన్ రూమ్ సమావేశానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్, సిఐఎ డైరెక్టర్ జాన్ ర్యాట్‌క్లిఫ్, వైట్‌హౌస్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ సహా పలువురు కీలక అధికారులు హాజరైనట్లు సమాచారం. ఈ సమావేశంలో ఇరాన్‌లోని వ్యూహాత్మక లక్ష్యాలపై తీవ్ర స్థాయి దాడులకు కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో యుద్ధం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యుఎస్ మీడియా ఆక్సియోస్ ప్రస్తుతం అమెరికా లక్ష్యం హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని తీవ్రంగా బలహీనపరిచేలా కీలక లక్ష్యాలపై భారీ దాడులు నిర్వహించడం టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం విఫలమైన తర్వాత ఇరాన్ మళ్లీ దాడులు ప్రారంభించింది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ తాజా క్షిపణి దాడులు జరిపింది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా మంగళవారం మధ్యాహ్నంనుంచి ఇరాన్ నౌకాశ్రయాలపై నౌకాదళ దిగ్బంధం అమలుప్రారంభించింది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత దిగజారిపోయాయి. ఇక సమావేశానికి ముందు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై వరుస దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ రాత్రి తీవ్రంగా దాడి చేస్తాం రేపు ఇంకా తీవ్రంగా దాడి చేస్తాం ఆ తర్వాతి రోజు కూడా అదే కొనసాగుతుంది. వచ్చే వారం పరిస్థితి ఇరాన్‌కు మరింత కఠినంగా మారుతుంది అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలు వంటి కీలక మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు కేంద్రీకృతమవుతాయని తెలిపారు. ఇరాన్ చర్చల బల్లపైకి వచ్చే వరకు ఈ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అమెరికా ప్రతినిధులు ఇప్పటికే ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరిపారని, ఒప్పందం చేసుకోండి లేకపోతే మీదగ్గర ఏమీ మిగలదని హెచ్చరించి నట్లు ట్రంప్ వెల్లడించారు.

ప్రపంచ చమురు, సహజ వాయు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం ఇరాన్ అమెరికా మధ్య పోటీ మరింత తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా మరోసారి పూర్తి స్థాయి యుద్ధం దిశగా వెళ్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ యేడాది ఏప్రిల్‌లో హార్ముజ్‌జలసంధిపై మొదటిసారి దిగ్బంధం అమలు చేసి అనంతరం తాత్కాలిక అణు చర్చల ఒప్పందం తర్వాత జూన్‌లో ఎత్తివేసింది. అయితే చర్చలు నిలిచిపోవడం, జలసంధి ప్రాంతంలో మళ్లీ ఘర్షణలు పెరగడంతో తాజా దిగ్బంధాన్ని మరోసారి అమల్లోకి తీసుకొచ్చింది.

16-7Pg3exHMNWJQERG:16-7Pg3exHMNWJQERG.qxd 7/15/2026 11:57 PM Page 1



# ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక అవసరం

## ● సమ్మిళిత పట్టణాభివృద్ధిపై యుఎన్ హ్యాబిటాట్‌తో ప్రభుత్వ ఒప్పందం: ముఖ్యమంత్రి చంద్రబాబు



**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాంతీయ ఆర్థిక వృద్ధి కోసం వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక, వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర పర్యావరణ వ్యవస్థల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్సు, మున్సిపల్ ఫైనాన్స్ తో పాటు సుస్థిరాభివృది అవసరమని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేలా ఏపీ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితికి చెందిన యూఎన్ హ్యాబిటాట్ మధ్య కీలకమైన అవగాహనా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ ల సమక్షంలో ఈ వ్యూహాత్మక ఒప్పందాన్ని ఏపీ పురపాలక శాఖ యూఎన్ హ్యాబిటాట్ సంస్థలు కుదుర్చుకున్నాయి. ఆమె సింగపూర్ నుంచి వర్చువల్ గా ఈ ఎంఒయూ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్జ్ ఏపీ, రైజ్ ఏపీ, అప్ లిఫ్ట్ ఏపీ విధానాల్లో భాగంగా అమరావతిలో పట్టణ వ్యవహారాలపై ఓ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు పేదరిక నిర్మూలన, పట్టణ పేదల జీవనోపాధిని మెరుగుపరచటం లాంటి అంశాలను చేపట్టేలా ఈ ఒప్పందం చేసుకున్నారు. ప్రాంతీయ ఆర్థిక వృద్ధి కోసం వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక, వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర పర్యావరణ వ్యవస్థల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్సు, మున్సిపల్ ఫైనాన్స్ తో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఏపీ ప్రభుత్వం యూఎన్ హ్యాబిటాట్ తో కలిసి పనిచేయనుంది. దీంతో పాటు 2028లో మెక్సికోలో జరుగనున్న 14వ వరల్డ్ అర్బన్ ఫోరమ్ సదస్సులో ఏపీ విజయాలను ప్రపంచవేదికపై ప్రదర్శించాలని నిర్ణయించారు.

**అమరావతిలో గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్:** ఈ ఒప్పందం సందర్భంగా అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు.

సర్జ్ ఏపీ, రైజ్ ఏపీ, అప్ లిఫ్ట్ ఏపీ సహా పట్టణ పేదరిక నిర్మూలనపై యూఎన్ హ్యాబిటాట్ తో కుదుర్చుకున్న ఒప్పందం చారిత్రాత్మకం అవుతుందని సీఎం అన్నారు. జీరో పావర్టీ పై ఓ రోడ్ మ్యాప్ నిర్దేశించుకుని ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు సీఎం వివరించారు. అర్బన్ ప్లానింగ్ సహా ఆర్థికాభివృద్ధిపై మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటు న్నట్టు తెలిపారు. బయోడైవర్సిటీని సంరక్షించేలా గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తి కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామన్నారు. అర్బన్ ప్లానింగ్, లివబిలిటి, డిజిటల్ గవర్నెన్సులో ఏపీ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకుంటున్నా మన్నారు.

బెస్ట్ ప్రాక్టీసెస్ బ్రాండ్ అంబాసిడర్ గా తాను వ్యవహరిస్తానని సీఎం అన్నారు. మరోవైపు రాజధాని అమరావతి నిర్మాణం సీఎం చంద్రబాబు విజన్ కు ప్రతిరూపంగా ఉందని, ఏపీ యూఎన్ హ్యాబిటాట్ మధ్య కుదిరిన ఒప్పందం చారిత్రాత్మకమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ వ్యాఖ్యానించారు. వ్యర్థాల నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ, బహిరంగ ప్రదేశాల అభివృద్ధి తదితర అంశాలపై ఏపీతో కలిసి పనిచేస్తామని అన్నారు. 2036 నాటికి పునరుత్పాదక ఇంధన రంగంలోనూ సమూల మార్పులు వచ్చేలా ఒప్పందం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.2 కోట్లు విరాళం

తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ట్రస్టులలో ఒకటైన బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి విరాళాలు అందుతున్నాయి. బుధవారం హైదరాబాద్‌కు చెందిన బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఇఒ జగదీష్, సిఎస్ఒ మాణిక్ రెడ్డి పుల్లగూర్ల బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి ఒక్కొక్కరు కోటి రూపాయలు విరాళంగా అందించారు. తిరుమలలో టిటిడి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు ఏ.రంగశ్రీ పాల్గొన్నారు.

# జగన్‌కు విజన్ లేదు

### ● మంత్రి నారాయణ ● దొంతాళి డంపింగ్ యార్డు పరిశీలన



**నెల్లూరు(వైద్యం), జులై 15 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేప ట్టిందని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన లెగసీ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరి ష్కారం చూపుతున్నామని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని దొంతాళి డంపింగ్ యార్డును బుధవారం పరిశీలించిన ఆయన, అక్కడ నిర్మాణంలో ఉన్న ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను పర్యవేక్షించారు. పనులు శరవేగంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ప్రజలపై చెత్త పన్ను భారం మోపడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 153 లక్షల టన్నుల లెగసీ చెత్తను వదిలి వెళ్లిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో 130 లక్షల టన్నుల చెత్తను తొలగించిందని, మరో 23 లక్షల టన్నుల వ్యర్థాల ప్రాసెసింగ్ కొనసాగుతోందని తెలిపారు. జూలై నెలాఖరుకల్లా రాష్ట్రంలో పేరుకుపోయిన లెగసీ చెత్తను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 107 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణం జరుగుతోందని, పూర్తయిన ప్రాసెసింగ్ ప్లాంట్లను 18న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించ నున్నట్లు వెల్లడించారు. దొంతాళి డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాలను ఈ నెలాఖరుకల్లా పూర్తిగా ప్రాసెస్ చేసి తొలగిస్తామని మంత్రి చెప్పారు. జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, రెండేళ్లలో నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆ ప్లాంట్ ప్రారంభమైన తర్వాత 100కిలోమీటర్ల పరిధిలోని మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్తను రోజువారీగా శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తా మని వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈ వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మహేష్, అదనపు కమిషనర్ హిమబిందు, ఎస్ఈ జానీ, జిందాల్ కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, జిగ్మా కంపెనీ ప్రతినిధులు, టీడీపీ నేత దొడ్డపనేని రాజానాయుడు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్యానికి హబ్‌గా ఆంధ్రప్రదేశ

### ● ఆయుర్వేద, యునాని, నేచురోపతి కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులతో ప్రాచీన వైద్యానికి పునర్ వైభవం ● రూ.414 కోట్లతో 1500 ఆయుష్ డిస్పెన్సరీల ఆధునీకరణ పనులు ● ఔషధ మొక్కల పెంపకానికి ప్రోత్సాహం ● వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆయుష్ వైద్యానికి ఆంధ్రప్రదేశ్ హబ్‌గా మారుస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అత్యంత నిరాదరణకు గురైన ప్రాచీన ఆయుష్ వైద్యానికి పునరుజ్జీవం తెచ్చేందుకు రూ. 414 కోట్లతో అభివృద్ధి చర్యల్ని చేపట్టామని చెప్పారు. విజయవాడ లోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం "ఔషధ మొక్కల స్థిరమైన సాగు, ఆర్థిక వృద్ధి, మార్కెటింగ్ మౌలిక సదుపా యాలు" అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, నేచురోపతి, హోమియోపతి) విభాగం పరిధిలో భారీ అంచనా వ్యయంతో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. కేవలం రోగం వచ్చిన తర్వాత చికిత్స అందించే ఖిరియాక్టివ్-క్యూరేటివ్‌ఖి విధానం నుంచి, రోగాలను ముందుగానే గుర్తించి నివారించే



ప్రెడిక్టివ్- ప్రివెంటివ్-వెల్‌నెస్ సెంట్రిక్ ఆరోగ్య విధానం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రాచీన ఆయుష్ వైద్య సేవల విస్తరణలో భాగంగా రూ. 280 కోట్లతో నాలుగు కొత్త ఆయుష్ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద వైద్య కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని కళాశాలలు రాబోతున్నాయని చెప్పారు. ఒక్కో కళాశాలకు రూ. 70 కోట్లు వ్యయం చేస్తామని చెప్పారు. ఇప్పటికే విశాఖపట్నంలో నేచురోపతి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు (మొత్తం రూ. 280 కోట్లు) పూర్తికావొచ్చాయని తెలిపారు. అదేవిధంగా తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులకు ఒక్కో దానికి రూ. 90 కోట్లు వెచ్చిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.414 కోట్లతో తలపెట్టిన 1,500కు పైగా ఆయుష్ డిస్పెన్సరీల ఆధునికీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. త్వరలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి రాష్ట్ర పర్యటనకు రానున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ సమక్షంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. మరోవైపు ప్రభుత్వ ఆరోగ్య సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు సుమారు 20 శాతం పెరిగాయన్నారు. గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 255 ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ వైద్య సామర్థ్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ కృషి కారణంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబిబియస్ సీట్లు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు.

## పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ అంశంలో కీలక పరిణామం

### ప్రతివాదులకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సమన్లు


**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ అంశంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టులో తెలంగాణ దాఖలు చేసిన ఒరిజినల్ సూట్‌పై ప్రతివాదులకు సమన్లు జారీ చేసింది. తెలంగాణ పిటిషన్‌పై విచారణ జరిపిన మరుసటి రోజే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సమన్లు పంపింది. 28 రోజుల్లో రిజిస్ట్రార్ ముందు హాజరుకావాలని ప్రతివాదులకు సమన్లు పంపింది. ప్రతివాదుల్లో ఏపీ ప్రభుత్వం, జలశక్తి, ఆర్థిక, అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖలు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో, జాతీయ జలసంఘం, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుల ఛైర్మన్లు మొత్తం 13 మంది ఉన్నారు. తెలంగాణ పిటిషన్‌పై తదుపరి ప్రక్రియను ఛాంబర్ జడ్జి చేపట్టనున్నారు. ఛాంబర్ జడ్జి ప్రక్రియ తర్వాతే ధర్మాసనం ముందుకు పిటిషన్ విచారణకు రానుంది.

## ఎపిహెచ్ఇఎఫ్ఆర్ఎం కమిటీ సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజు రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎపిహెచ్ఇఎఫ్ఆర్ఎంసి) సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజు రెగ్యులేషన్ అండ్ మానిటరింగ్ చట్టం2019 ప్రకారం ఈ నియామకాలను చేపట్టింది. కమిటీ సభ్యుల పదవీకాలం మూడు సంవత్సరాలు లేదా 70యేళ్ల వయస్సు వచ్చే వరకు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిలో ఏది ముందుగా వస్తే అది వర్తిస్తుందని స్పష్టం చేసింది. చార్టర్డ్ అకౌంటెంట్/పబ్లిక్ ఫైనాన్స్ నిపుణుడిగా తిరుమలశెట్టి వెంకట రంగ సత్య భానుమూర్తిని కమిటీ సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. అలాగే హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సభ్యులుగా డా. మన్యాల రామలింగ రాజు, పూజారి హరి ప్రకాష్‌లను నియమించింది. ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధిగా వీవీఐటీ యూనివర్సిటీ చాన్సలర్ డా.వాసిరెడ్డి విద్యాసాగర్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## వాసుదేవరెడ్డి, రాజ్ కసిరెడ్డి, కారుమూరి సునీల్‌పై సిట్ వారెంటు

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా టెండర్ల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులపై పిటి వారెంట్లకు ఎసిబి కోర్టు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులు వాసుదేవరెడ్డి, రాజ్ కసిరెడ్డి, కారుమూరి సునీల్‌పై సిట్ పీటీ వారెంట్లు జారీ చేసింది. ఈ నెల 20న ఎసిబి కోర్టులో హాజరుపరచాలని నిర్ణయించింది. ప్రస్తుతం ముగ్గురు నిందితులు రిమాండ్‌లో ఉన్నారు. వీరిని ఇటీవల ఇడి అధికారులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా వారిని రిమాండ్‌కు విధించింది. తాజాగా ఎసిబి కోర్టు అనుమతి ఇవ్వడంతో వీరిని త్వరలోనే ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నారు.



## విశాఖ బీచ్‌లో తప్పిన ప్రమాదం

### సముద్రంలో మునిగిపోతున్న నల్గొండ జిల్లా పర్యాటకుల్ని రక్షించిన మెరైన్ పోలీసులు

**విశాఖపట్నం, జులై 15 ప్రభాతవార్త:** విశాఖ బీచ్‌లో బుధవారం పెను ప్రమాదం తప్పింది. సముద్రంలో ఈతకు దిగిన పర్యాటకుల్ని అలలు లాక్కుపోతుండడంతో మెరైన్ పోలీసులు రక్షించగలిగారు. ఉదయం 10.30 గంటల సమయంలో తెలంగాణలోని నల్గొండ జిల్లా ముషాంపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు పర్యాటకులు ఆర్కే బీచ్ వద్ద సముద్రంలో ఈతకు దిగారు. అదే సమయంలో బలమైన అలలు వచ్చి ఇద్దర్ని సముద్రంలోకి లాగేసింది. పర్యాటకులు కేకలు వేయడంతో స్పందించిన మెరైన్ పోలీసులు అప్రమత్తమై వారి ప్రాణాల్ని రక్షించ గలిగారు. ప్రాథమిక చికిత్స అనంతరం, పర్యాటకుల్ని కౌన్సెలింగ్ చేశారు. ప్రస్తుతం అందరూ సురక్షితంగానే ఉన్నారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# రామగిరి బంగారు గనుల్లో త్వరలో మైనింగ్

### ● మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటన ● ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్‌తో కలిసి మైనింగ్ ప్రాంతం పరిశీలన

**అనంతపురం, జులై 15 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి బంగారు గనుల్లో మైనింగ్ త్వరలోనే చేపట్టనున న్నట్లు మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్.రాజు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజులతో కలిసి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మూతపడ్డ భరత్ గోల్డ్ మైన్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అపార ఖనిజ సంపద ఉన్నప్పటికీ గత పాలకులు మైనింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, కొన్ని చోట్ల దోపిడీకు పాల్పడ్డారన్నారు. ఉన్న మైనింగ్‌లను సరిగా నిర్వహించకపోవడం, ఖనిజాన్ని దోపిడీ చేయడం వంటివి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మైనింగ్ గ్రోత్ 36శాతం పెరిగిందన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 416 ఎకరాల్లో 108 హెక్టార్లలో మైన్ ఉందన్నారు. జొన్నగిరిలో టన్నుకు ఒక గ్రాము బంగారం వస్తే రామగిరిలో టన్నుకు 4గ్రాముల బంగారం లభిస్తుందన్నారు. ఇది క్రమంగా 6.5 గ్రాములకు కూడా చేరుతుందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి 2002వరకు ఇక్కడ మైనింగ్ జరిగింది. భారత్ మైన్స్ వారు 2001లో ఆపేశారన్నారు. ఇటీవల 2023లో మిషనరీతో పాటు ఇక్కడున్న ఖనిజాన్ని తీసుకెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇక్కడ మొత్తం 4లక్షల 60వేల టన్నుల ఖనిజం ఉండాలని అందులో లక్ష టన్నుల వరకు చోరీ అయినట్టు



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

తెలుస్తోందన్నారు. దీనిపై కచ్చితంగా ఎంక్వైరీ జరుగుతుందని, అది ఎవరు చేసినా చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఖనిజాన్వేషణ వేగంగా జరుగుతోందన్నారు. గోల్డ్, మ్యాగ్నటీస్, ఐరన్ ఓర్ వంటి ఖనిజాన్ని వెలికి తీసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. దీని వలన రాయల్టీతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఓబుళాపురం ప్రాంతంలో కూడా ఖనిజాన్ని ఎత్తుకెళ్లారన్నారు. ఈ ప్రాంతంలో కూడా త్వరలో మైనింగ్ ప్రారంభిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అలాగే గతంలో అక్కడ పనిచేసిన కార్మికులు, స్థానికులతో మంత్రి, ఎమ్మెల్యే సునీత మాట్లాడారు. బంగారు గనుల్లో పనిచేసిన వారితో అర్జీలు స్వీకరించారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు.

**మా ప్రాంత కల ఇది:** ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బంగారం మైనింగ్ చేస్తున్న సమయంలో ఎంతో మందికి ఉపాధి ఉండేదన్నారు. పరిటాల రవీంద్ర కార్మిక సంఘం నాయకునిగా కూడా పని చేశారని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో మైనింగ్ మూసివేసినప్పటి నుంచి వారికి ఉపాధి కరవైందన్నారు. ఇక్కడ మైనింగ్ తిరిగి ప్రారంభిస్తే వందలాది కుటుంబాలకు మేలు జరుగుతుందని.. ఎంతో మంది ఉపాధి లభిస్తుందన్నారు. మా ప్రాంత ప్రజల కల త్వరలోనే సాకారం అవుతుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.


AU SMALL FINANCE BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా- 302001 www.au.bank.in

బంగారం పై రుణం "ఎక్కడ ఉందో అలాగే" అనే ప్రాతిపదికన వేలం నోటీసు

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి పొందిన బంగారు సౌకర్యాలపై రుణానికి సంబంధించి వారి బకాయి మొత్తాలను చెల్లించమని క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడ్డాయి. రుణగ్రహీత/లు వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ పేర్కొన్న శాఖలలో 17 Aug 2026 ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 3:00 (సమయం) మధ్య పేర్కొన్న పద్ధతి ప్రకారం తాకట్టు పెట్టిన బంగారు వస్తువులు/ వస్తువుల వేలం నిర్వహించాల్సి ఉంటుంది. మరణించిన రుణగ్రహీతల విషయంలో, అన్ని షరతులు చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి. పైన పేర్కొన్న వేలం విఫలమైతే, ముందస్తు సమాచారం లేకుండా మరొక వేలం నిర్వహించే హక్కు బ్యాంకుకు ఉందని దయచేసి గమనించండి.

ప్రత్యక్ష వేలం శాఖ వివరాలు

KANIGIRI -L2666000018021 TIRUPATI RC ROAD -L25660001693953 L26660000287793 L25660001625293|Repalle -L26660000757219 L26660000689856 L26660000605206 L26660000734873 L26660000661869 L25660001577452| Nandyala -L25660001781617 L25660001634565 L25660001635694 L26660000519138 VINUKONDA - L26660000609549| Narasaraopet L25660001956919 L25660001679390 L25660001957187 L25660001760957 L26660000592208| Gannavaram - L26660000522192 L26660000521384| Tuni - L25660002015924 L25660001632419 L25660001686386 L25660001747173 | Eluru - L26660000534939 L26660000674575 L25660001674819 L26660000680563 L26660000502580 L25660001837874 Nandigama - L26660000592308 L26660000453901 NTR Circle Vijayawada -L26660000492166 L26660000622144 L26660000600286 L26660000619990 L25660001701740 L26660000571468 L26660000585742 L26660000369939|BADVEL -L26660000663306 L25660001613615 L26660000723534 GUNTAKAL -L25660001298166 L25660001300225 L25660001474305 L25660001298416 L26660000680483 Nandikotkur - L25660001744418 MADANAPALLI CTM ROAD -L26660000664264 L25660002114017 L25660001633887 L9001090152952177| MACHILIPATNAM -L26660000499294 L26660000577177 L26660000728395 L26660000596491|Kovur -L26660000657927 L26660000755533 L26660000647456 L26660000706286 L26660000598467 L26660000535917 L26660000590884 ADDANKI-L26660000512171 L25660001783724 L25660001577202| NAIDUPETA -L 26660000768928 L26660000497777| GUNTUR - L26660000700147|RAVU-LAPALEM -L25660001615642 L25660001661304 BHAVANIPURAM VIJAYAWADA- L25660001665926 Vizianagaram - L25660001574907 JANGAREDDIGUDEM - L25660001695139 L25660001731133 L26660000577297 L25660002289976 L25660001719396 Amalapuram L25660001707379 TIRUVURU -L25660001726723|Chirala -L26660000309894 L25660001593321 Kavali -L25660002265952 CHITTOOR CB ROAD - L26660000691082 L25660001686196 L25660001686226 Ponnur -L26660000548023 L26660000456866 Palamaner L26660000537564 GIDDALUR L26660000726478|NEL-LORE BV NAGAR -L25660001788115 | Kadapa L25660001877057 L25660001613565 MURALI NAGAR-VISAKHAPATNAM- L25660001591105 Yemmiganur -L25660001584768 L25660001607737 L25660001787256 KAKINADA -L26660000593976 Akividu - L26660000751760| Nuzvid - L26660000586950 Pileru -L25660001679190 L26660000644132|SUJATHA NAGAR ONGOLE -L26660000556457 L25660001574097 DEVARAPALLI - L26660000656029 TADPATRI-L25660001796989 Peddapuram - L25660001602416

గమనిక: 1. భౌతిక వేలం విఫలమైతే, https://gold.samil.in అనే వెబ్ లింక్ ద్వారా ఇ-వేలం నిర్వహించబడుతుంది.
2. ఒకవేళ ప్రతిపాదిత వేలం విఫలమైతే, ఈ నోటీసును తదుపరి వేలం కోసం ముందస్తు నోటీసుగా పరిగణించగలరు.
3. వేలం బిడ్ ఫారంలో పేర్కొన్న కొన్ని నిబంధనలు మరియు షరతులకు లోబడి ఉంటుంది, ఇది వేలం ప్రారంభానికి ముందు అందుబాటులో ఉంచబడుతుంది.

సం/-మేనేజర్,
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


# జగన్ క్షమాపణ చెప్పాలి.. ఆ మాటలు వెనక్కి తీసుకోవాలి

### ● మంత్రి అప్పలరాజు కొడుకుకి ఒక న్యాయం? సామాన్యుడికి ఒక న్యాయమా? ● ఆక్వా రైతులకు జగన్ చేసింది ఏమీ లేదు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఫైర్

**విజయనగరం, జులై 15 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్ రెడ్డి భీమవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పి మాటలు వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలు విషయాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని ఉద్దేశించి దుర్భాషలాడడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రజాప్రతినిధి విధానపరంగా విమర్శలు చేయాలి కానీ నోటికి ఏది వస్తే అది మాట్లాడకూడదని హితవు పలికారు. జగన్ రెడ్డి మాట్లాడిన మాటలను ఖండిస్తున్నామన్నారు. విలువలతో కూడిన మాటలతో రాజకీయాలు నడిపించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏ ఒక్కరిని కించపరుస్తూ మాట్లాడినా ఊరుకోరని, వ్యక్తిగతంగా దూషణలు చేయవద్దని చెబుతారన్నారు. కానీ వైకాపా అధినేత, నాయకులు అడ్డదిడ్డంగా మాట్లాడతారన్నారు. మత్స్యకారుల విషయంలో కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ప్రభుత్వం గల్లంతైన బోటు విషయంలో తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చిన్న అనే వ్యక్తిని కాపాడటంతో పాటు విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మత్స్యకారులకు జగన్ ప్రభుత్వం గతంలో పది లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగనామం పెట్టిందన్నారు. అధికారం కోల్పోయాక ప్రస్తుతం మత్స్యకారుల వద్దకు వచ్చి కొత్త బోటు, కోటి రూపాయలు అంటూ నాటకమాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారతతో తక్షణమే పది లక్షల రూపాయలు అందజేసి గల్లంతయిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రాణానికి విలువ కట్టడం కాదని, కష్టంలో ఉన్న కుటుంబాన్ని ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడం అన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రమాదాల్లో చనిపోయిన ఏ ఒక్క మత్స్యకార కుటుంబానికి కూడా పరిహారం చెల్లించలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం జగన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారని, కల్లబొల్లి



మాటలు నమ్మవద్దని రైతులకు హితవు పలికారు. ఆక్వా రైతులకు రూపాయన్నరకే కరెంటు అందజేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కొందరికి మాత్రమే ఇచ్చిన ఘనుడు జగన్ రెడ్డి అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆక్వా రైతులందరికీ కూడా రెండున్నరకే యూనిట్ విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందన్నారు. జగన్ రెడ్డికి నచ్చిన ఎలాంటి విషయాన్నైనా సమర్థిస్తారని, దానికి తార్కాణమే తెలంగాణలో నేరం చేసిన వ్యక్తిని ఎన్‌కౌంటర్ చేస్తే... అసెంబ్లీ సాక్షిగా అభినందించిన జగన్, విజయవాడ అనేక నేరాలు చేసిన యువకుడిని, అలాగే రోడ్డు ప్రమాదం చేసి ఒకరి మృతికి కారణమైన మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడిని సమర్థించడాన్నీ నేడు దేశ ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. సొంత వారిని, తనకు కావలసిన వారిని జగన్ రెడ్డి కేసుల నుంచి కాపాడటం కోసం చట్టాన్ని ఉపయోగిస్తారని, సొంతవారికి ఒక చట్టం.. బయటి వారికి ఒక చట్టం అని... అది జగన్ నైజం అన్నారు. జగన్ ఇదే వరవడితో ఉంటే ఈసారి 11 సీట్లు కాదు... కదా! డిపాజిట్లు కూడా రావు అని మంత్రి కొండపల్లి ఎద్దేవా చేశారు. పరిపాలన చేసే ఏ నాయకులైనా ప్రజలకు మంచిచేసే విధంగా ఉండటంతో పాటు భవిష్యత్తును చూపించాలన్నారు. ప్రజల్లో ధైర్యం నింపే బాధ్యత అధికారంలో ఉన్న పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీకి కూడా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గుర్తు చేశారు.

16-7pg4:16-7pg4.qxd 7/15/2026 10:26 PM Page 1



వార్త


కలకాలం నిలిచిపోయే పనులు చేయడంలో ఖర్చు అయిన జీవితమే చాలా ఉపయోగకరమైన జీవితం.

న- విలియం జేమ్స్

# చిత్త భ్రమలో కుటుంబాలు చిత్తు!


జీవితాలు క్షణ భంగురాలే. కానీ కొన్ని జీవితాలు తమకే తెలియని అసంకల్పిత చర్యల్లో అన్యాయంగా వేరొకరి క్రూరత్వానికి బలైపోవడం ఈ మధ్యనే చూస్తున్నాం. ఎన్నో కాపురాలు కూలిపోవడం ఒకనాటి మాట. తాజాగా భార్య భర్తల్లో ఎవరో ఒకరి క్రౌర్యానికో, తొందరపాటు ఆలోచనలకో, అనుమానాలకో కుటుంబాలు కుటుంబాలే బలైపోతున్నాయి. తన తర్వాత తమ బిడ్డలనెవరు సాకుతారన్న కారణంతో తానేకాక తన పిల్లల్ని కూడా చంపి ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఓ తల్లిదో తండ్రిదో అయినప్పుడు ఆ కుటుంబం భూస్థాపితమే. ఆయా కుటుంబాలలో ఒకరి పగకో, ప్రతీకారానికి కుటుంబం యావత్తూ బలైపోయిన సంఘటనలు, ఉదంతాలు వినిపిస్తున్నాయి. అదేదో కాల మహిమ అని సరిపెట్టుకోలేం. సమాజం ఎటువైపు వెళ్తోందో అర్థం కాని పరిస్థితి, అర్థం చేసుకోలేని పరిస్థితి ఎదురౌతోంది. ఇలాంటి సంఘటనల్లో భాగస్వాములైన వారి మానసిక పరిస్థితి ఎలాంటిదో కూడా గమనించాల్సి ంది. తల్లి కానీ, తండ్రి కానీ పిల్లలను హతమార్చి తానూ ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు తరుచుగా వార్తల్లో చూస్తున్నాము. ప్రతి సంఘటన చర్చనీయాంశమే కానీ ఆ తర్వాత పాతబడిపోతుంది. మరో సంఘటన వెలుగు చూస్తుంది. ఎప్పటి సంఘటన అప్పటి తర్వాత పాతదైపోతున్నా అందుకు సంబంధించిన కారణాలు సజీవంగానే ఉంటాయి. అటువంటి మరో సంఘటనకు పురికొల్పే అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాల్సి ందే. వీలైతే ఇలాంటి సంఘటనల ప్రభావం మరి కొందరిపై పడకుండా చూసుకోవాలి. అది మన బాధ్యతే. అవన్నీ ఆర్థిక సంబంధాలుగా కానీ వ్యక్తిగత ఆలోచనలుగా కానీ కొట్టిపడేయలేం. భారతీయకుటుంబ వ్యవస్థకు ఎన్నో కట్టుబాట్లు ఉన్నాయి. వాటన్నిటినీ విడిచి విధ్వంసపు ఆలోచనలు వస్తున్నాయంటే కుటుంబ వ్యవస్థ సరిగ్గా నడవనట్లు అనిపిస్తుంది. కుటుంబ సభ్యుల మానసిక ఆరోగ్య అవగాహన కూడా ప్రధాన పాత్ర వహిస్తుంది. మొన్నామధ్య ఓ తండ్రి తాను లేకుంటే తన బిడ్డలను చూసేవారుండరు కనుక వారినిలా వదిలేయడం కన్నా తనతో తీసుకెళ్లడం మంచిదనే ఆలోచనతో వారిని ముందుగానే హత్య చేసి తాను చనిపోవాలని ప్లాన్ వేసుకుంటాడు. వారిలో ఏ ఒక్కరు బయటపడినా వారి పోషణ, వ్యక్తిగత జీవితం దుర్భరమౌతుంది. తన కడుపున పుట్టిన బిడ్డలే అయినా మరో ప్రాణం తీసే హక్కు వారికి లేదు. అదొక తీవ్రమైన నేరం. పిల్లల్ని కనిపెంచి విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రులు, వారి ప్రాణాలను తీసే హక్కు తమదేనన్నట్లు ప్రవర్తించకూడదు. వీటన్నిటికే సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఆర్భాటపు శైలి. డిప్రెషన్, ఇతరత్రా ఒత్తిడిలు, భావోద్వేగాలు వారిని ఆలోచించుకోనివ్వవు. అందుకే వాటిని ముందుగా గుర్తించుకుని మానసిక ఆరోగ్య సేవల కోసం డాక్టర్లను సంప్రదించాలి. తాజాగా జరిగిన ఒక దుర్ఘటనలో నెల్లూరుజిల్లా తోటపల్లి గూడురుకుచెందిన హరికృష్ణ అనే వ్యక్తి మంగళవారం సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో తన భార్య ఇద్దరు పిల్లల్ని ఎదురొ స్తున్న ట్రైన్‌కు బలిఇచ్చాడు. తన బావ హత్యకేసులోనింది తుడుగా ఉన్న హరికృష్ణ తనకు ఆత్మహత్యే శరణ్యమని భావించాడు. దాంతో ఏ పాపం తెలియని భార్యాబిడ్డల్ని సైతం రైలు కిందకు తోసి వారిచావుకు కారకుడయ్యాడు. తానూతనువు చాలించాడు. ఆర్థిక ఇబ్బందులోఉన్నవారు, వైవాహిక జీవితంలో విఫలమయిన వారు, జీవిత భాగస్వాములపై సందేహాలున్న వారు ఇలాంటి దుష్కర్మలకు ఒడిగడుతుంటారు. మరో ఉదంతంలో తల్లిదండ్రులు పేచీ పడుతుంటే 'నా వల్లనే కదా మీ మధ్య గొడవ, అమ్మా నాన్నా నే చచ్చిపోతున్నా'నని వారి కళ్లెదుట ఆత్మహత్య చేసుకుంటున్న కొడుకును వాళ్లు ఆపలేకపోయారు. ఇలాంటి మరో విషాదం చోటు చేసుకోకుండా ప్రభుత్వాలు గ్రామస్థాయి నుంచి పట్టణాలలోని ప్రతిఒక్కరికి మానసిక ఆరోగ్య సేవలు అందించాల్సి న అవశ్యకత ఉంది. వ్యక్తులలో తీవ్ర నిరాశ, అకస్మాత్తుగా ఇతర బాంధవ్యాలను తెంచుకోవడం లాంటి చర్యలు చేసేవారిని పరకాయిస్తుండాలి. కుటుంబ సంబంధ బాంధవ్యాలు క్షీణిస్తున్న దశలో ఇలాంటి వాటిపై సాటి కుటుంబ సభ్యులే శ్రద్ధ చూపించాలి. అందరికీ విద్యలాగే అందరికీ మానసిక ఆరోగ్య సేవలు వంటి కార్యాచరణకుప్రభుత్వాలు నడుం కట్టాలి. ఇక బతికి లాభం లేదు. నాతోపాటే నా కుటుంబమూ చావుఅంచుల్ని చూడాలనే ఆలోచన ఏ ఒక్కరిలోనూ రానీయరాదు. కుటుంబ సభ్యుల్లో కానీ, స్నేహితుల్లో కానీ ఒంటరిజీవితాన్ని అనుభవిస్తున్న వారిలో అసాధారణ ప్రవర్తన వంటి సంకేతాలు కనిపిస్తేవాటిని తేలికగా తీసుకోకూడదు. అలాంటి వారిపట్ల సానుభూతి చూపడం, సంయమనంతో మాట్లాడడం బాధ్యతగా తీసుకోవాలి. కుటుంబపరంగా ఆసహనానికి లోనయ్యే వారు, సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించలేనివారిని సైతం అక్కున చేర్చుకుని వారి సమస్యను పరిష్కరించే ఆలోచన ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. విచిత్రమైన సామూహిక ఆత్మహత్యల్లో తొలిసారిగా మానసిక ఆరోగ్యం, మూఢనమ్మ కాలపై చర్చకు దారితీసిన ఢిల్లీ బురారీ కేసు2018లో నమోదైంది. ఒకే కుటుంబానికి చెందిన 11మంది అనుమానాస్పదపరిస్థితుల్లో సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2021లో హైదరాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కుటుంబ సమస్యలు, మానసిక ఆరోగ్యకారణాలతో ఆత్మహత్యచేసుకున్నారు. తెలంగాణ, కర్ణాకలో ఇలాంటివి వెలుగు చూస్తున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా 116కుటుంబపు సామూహిక ఆత్మహత్యల కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ లో 11కేసులు నమోదవగా దేశం మొత్తంమీద 270మంది ఇలాంటి ఆత్మహత్యలు చేసుకుని ప్రాణం తీసుకున్నారు. కుటుంబ కౌన్సి లింగ్, డిప్రెషన్‌లో ఉన్నవారికి ఉచిత కౌన్సి లింగ్‌లు చేపట్టాల్సి న బాధ్యత కేంద్రఆరోగ్యశాఖ చేపట్టాలి.

> విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.



డబ్ల్యు ఎమర్సన్

> ఏ దేశం అభివృద్ధి చెందిందన్నా అద్దాల మేడలు, రంగు గోడలు అని కాదు అర్థం. పౌరుల నైతికాభివృద్ధి.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు

### అత్యవసర సాగునీటి ప్రణాళికలు అవసరం

దక్షిణ భారత వ్యవసాయానికి నైరుతిరుతుపవనాలు జీవ నాధారం. అయితే ఈ ఏడాది తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షాభావం రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్ సాగు విస్తీ ర్ణం పెరిగినప్పటికీ, ఆశించినస్థాయిలో వర్షాలు లేకపోవ డంతో పంటల ఎదుగుదలపై అనిశ్చితి నెలకొంది. ఇప్ప టికే అనేక మండలాల్లో వర్షపాతం లోటు నమోదవగా, జలాశయాల్లోనూ నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. వాతావరణమార్పుల ప్రభావంతో వర్షాల స్వభావంలో వస్తున్న మార్పులు వ్యవసాయ రంగానికి కొత్తసవాళ్లను విసురుతున్నాయి. విత్తనాలు వేసిన రైతులు మళ్లీ విత్తాల్సి న పరిస్థితులు ఏర్పడితే పెట్టుబడి భారం పెరిగే ప్రమాదం ఉంది. వర్షాలపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతులే ఈ పరిస్థితికి ఎక్కువగా నష్టపోతారు. ఇది రైతుల ఆదాయంపైనే కాకుండా, ఆహార భద్రతపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు ముందస్తుచర్యలు చేపట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వ్యవసాయ బావులు తవ్వించాలి

గతంలో ప్రభుత్వం సన్న, చిన్న కారు రైతులకు. ఎస్సి, ఎస్టీ, రైతులకు పంట పొలాలకు సాగు నీరు అందించడంకోసం వ్యవసాయంకొరకు బావులు అవసరం ఉంది. వివిధ కార్పొరేషన్‌ల వార్షిక బడ్జెట్‌లో నుండి రైతు లకు బావులు త్రవించాలి. ఉపాధి హామీ పథకం కూలీల సహాయంతోతవ్వించాలి. దీంతో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. రైతులకు పుష్కలంగా సాగు బడి కోసం నీరు అందుతుంది. చెరువులు, కెనాల్ కాలువలలో నీటి సామర్థ్యం పెరుగుతుంది. కనుక ప్రభుత్వం వ్యవసాయ బావులు తవ్వించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ ఆఫీసులలో నెలల తరబడి దరఖాస్తులు అయిన కల్యాణలక్ష్మి ౖ, రేషన్ కార్డు, తదితర దరఖాస్తులను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలి. వివిధ పనుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు సకాలంలో అందాల్సి న అవసరం ఎంతైనా ఉంది. అధికారులు వీలై నంత తొందరగా పరిష్కరించాలి.

### ఏటిఎంలలో నగదు కొరత!

ఒకప్పుడు బ్యాంకు ఖాతాదారులు తమ బ్యాంకు శాఖలకు నేరుగా వెళ్లి నగదు తీసుకునే పరిస్థితి వుండేది. ప్రస్తుతం దేశమంతటా ఏటిఎంలు రావడంతో ఖాతాదారుడు బ్యాంకు శాఖలకు వెళ్లి నగదు తీసుకునే శ్రమ చాలా వరకూ తప్పింది. దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల శాఖలు తమ ఖాతాదారులకు ఏటిఎం కార్డుల సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే దేశవ్యాప్తంగా ఇప్పుడు కొన్ని నగరాల్లోని ఏటిఎంలలో బ్యాంకులు సరిపడా నగదునిల్వలు ఉంచడం లేదు. గత మూడు నాలుగు నెలలుగా ఈ సమస్య మరింత ఎక్కువగా వుంటుంది. చిన్న చిన్న నగరాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా వుండటంతో బ్యాంకు ఖాతాదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయంలో భారత రిజర్వు బ్యాంకు అన్ని బ్యాంకుల శాఖలకు దిశానిర్దేశం చేసి ఏటిఎంలలో నగదు నింపే విధంగా చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ఆరోగ్యంగా ఎదగాలి

ఐదు సంవత్స రాలలోపు పిల్లలకు ఇడ్లీ, రైస్‌సాంబర్ లేదా ఇతర బలమైన ఆహారంతో మెత్తగా కలిపి తినిపించడం చూస్తుంటాము. ఇకచాలు అన్నాకూడావినకుండా చందమామ, కాకమ్మ కథలు చెబుతూ బలవంతంగా ముద్దనోట్లో కుక్కుతుంటారు. ఇలా చేయడం వల్ల ఒక్కోసారి అజీర్తి, వాంతులు చేసుకొని ఏడుస్తుంటారు. దాంతో కన్నవాళ్లకు ఆందోలన కలగడం సహజం. ఇది ఏమాత్రం బిడ్డ ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యనిపుణులు చెబుతుంటారు. చిరుతిళ్లు తినే పిల్లలకు ఆకలి మందగించడం వల్ల ఫుడ్ సరిగ్గా తినరు. కావున వీలైనంతవరకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఎదిగే పిల్లలకు వెరైటీగా రాగిజావ, ఉడికించిన కూరగాయలు, అన్నంలో కలిపి పెట్టాలి. అలాగే ఫ్రూట్ సలాడ్స్ అందించాలి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### పెరుగుతున్న లింగ వివక్ష

గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వ్యవసాయరంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. భూమిపై యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల మహిళలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాలలో కార్పొరేట్ సంస్థల ఉన్నత పదవులలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# సర్వరక్షకుడు జగన్నాథుడే..



రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము

శ్రీ జగన్నాథుడి ప్రార్థనలు, కీర్తనలు చిన్ననాటి నుంచి నా జ్ఞాపకాల్లో పదిలమై ఉన్నాయి. పాఠశాలలో, కళాశాలలో చదువుకొనేటప్పుడు మహాప్రభు జగన్నాథుని భజనలు పాడటం నాకు చాలా ఆనందాన్నిచ్చేది. మహా ప్రభుకి చాలా సన్నిహితంగా ఉన్నఅనుభూతి కలిగేది. నేనీ మధ్య భజనలు పాడటం లేదు కానీ, ప్రతి రోజూ ఆ మహా ప్రభుని స్మరిస్తాను. భజనలోని ఓ నాలుగు పదాలైనా పలకని రోజుండదు. నిజానికి మహా ప్రభు నాకు దగ్గరగా ఉన్నట్టు భావిస్తుంటాను. కష్ట సమయాల్లో ఆయన నాకు అండగా ఉన్నారు. ఈనాటికీ భక్త కవి మధుసూదనరావు రచించిన పాటను పాడుతూనే ఉంటాను. అంతటా ఉండే ఓ మహాప్రభూ...నువ్వు రాత్రింబగళ్లు నా తోడే ఉన్నావు... ఈ జ్ఞాపకంతో నిన్ను ఎల్లప్పుడూ పూజిస్తాను.. నా పూర్ణ హృదయంతో.. అని ఆ పాటకి అర్థం. లౌకిక విషయాలు అర్థం చేసుకొనే వయసు వచ్చేనాటికి మహాప్రభు జగన్నాథు ని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను. మహా ప్రభు జగన్నాథుని గురించి ఇంట్లో తరచూ మాట్లాడుకొనే వారు. మా గ్రామంలోనూ ఇలాంటి చర్చలే ఎక్కువగా జరుగుతుండేవి. నేను గ్రామ పాఠశాలలో చదువుతున్నప్పుడు భక్త సాల్బేగ్ రచించిన 'ఆహే నీల శైల'అనే ప్రార్థనను క్రమం తప్పకుండా పఠించేవారు. మహాప్రభు జగన్నాథుని గురించి మా టీచర్ అనేక విషయాలు చెబుతూ ఉండేవారు. పూరీలో పెద్ద ఆలయం ఉంది. అంతటి గొప్ప ఆలయం మరొకటి లేదు! ఆ ఆలయంలో తన చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రునితో కలసి మహాప్రభు పూజలందుకుంటారు. మహా ప్రభు జగన్నాథుడు నల్లని రంగులో, గుండ్రని కళ్లతో ఉంటారు. సుభద్ర పసుపు రంగులో, బలభద్రుడు వెన్నెల్లో వికసించిన పుష్పంలా శ్వేతవర్ణంలో ఉంటారు. ఒక్కసారి ఆ మూర్తులను చూస్తే..ఎప్పటికీ మరచిపోం అని చెప్పేవారు. జగన్నాథుడే మహాప్రభువనీ, ఆయన ప్రసాదమే మహా ప్రసాదమని కూడా మా టీచర్ చెప్పేవారు. ఆయన ఆలయమే బడ దేవుళ్ల లేదా పెద్ద ఆలయం. ఆయన మార్గమే బడ దాండ. అంటే ఉత్కృష్ట మార్గం. ఆయన సముద్రమే మహోదధి లేదా గొప్ప మహాసముద్రం. మయూర్భంజ్ జిల్లాలోని మా ఊరు ఉపర్‌బేడా నుంచి పురుషోత్తమ క్షేత్రం పూరీ చాలాదూరంలో ఉంటుంది. మరి పూరీని సందర్శించే అవకాశం నాకెలా వస్తుంది? నేను పెద్దయ్యాక, భువనేశ్వర్‌కి వెళ్లాను. అక్కడ బాలికల ఉన్నత పాఠశాలయూనిట్-2లో చేరాను. అక్కడే వసతిగృహంలో ఉండే దాన్ని. అక్కడ ఉన్నప్పుడే పూరీ, భువనేశ్వర్, కోణార్క్ సందర్శించే అవకాశం నాకు లభించింది. మొదటిసారి మహాప్రభును దర్శించుకున్న జ్ఞాపకం ఇప్పటికీ నామదిలో స్పష్టంగాఉంది. ఎంత అద్భుతమైన ఆలయం! ఎంత తేజోవంతమైన దేవతా మూర్తులు! వాటిని మరచిపోగలమా? ఎవరైనా మహా ప్రభు జగన్నాథుని రథయాత్రను మరచి పోగలరా? శ్రీ క్షేత్రలో ఏడాదిలోని పన్నెండు నెలల్లో పదమూడు ఉత్స వాలు జరుగుతాయి. కానీ రథయాత్ర వైభవం మాత్రం అద్వితీయం. మహాప్రభు దర్శనంకోసం ఏడాది పొడవునా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. కానీ ఏడాదికోసారి మహాప్రభువే ఆలయాన్ని వదలి విశాల పథంలో గుండిచా ఆలయానికి చేరుకొని భక్తు లకు దర్శన మిస్తారు. మూడు అద్భుతమైన రథాలపై చక్రరాజ సుదర్శనునితో పాటు ముగ్గురు దేవతా మూర్తులు గుండిచా ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడురోజులు ఉండి, ఆ తర్వాత తిరుగుప్రయాణమవుతారు. అత్యంత వైభవోపేతమైన ఈ మహాప్రభు ఉత్స వానికి సాటి



లేదు. చిన్నతనం నుంచి మహాప్రభు జగన్నాథుని భక్తురాలిని. నేను అత్యంత భక్తిభావంతో కొలిచే దైవం ఆయన. నా జీవితంలో ఒడిదొడుకులను నిర్ణయించేది ఆయనే. నా సుఖ దుఃఖాలకు ఆయనే మూలం. నా జీవితంలో ఎన్నోకష్టాలను ఎదుర్కొన్నాను. ఆ సమస్యలన్నింటి నుంచి మహాప్రభు నన్ను బయటకు తీసుకొచ్చారు. ఎంతైనా నేను ఆయన బిడ్డనే కదా. భారత రాష్ట్రపతి పదవికి నన్ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు.. నేను భక్తిపూర్వకంగా మహా ప్రభుని తలచుకున్నాను. నన్ను ఇంత పెద్దస్థాయికి తీసుకెళుతున్నావు. నన్ను ముందుకు నడిపించు. ఎప్పుడూ నాతోనే ఉండు అని ప్రార్థించాను. ఆయన నా మొర ఆలకించారు. నా ప్రార్థనకు ఆయన ఎప్పుడూ స్పందిస్తారు. నేను రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో.. రథయాత్ర ఉత్స వం జరిగింది. నేను అప్పుడు ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. రథయాత్ర రోజు ఉదయమే నేను ఢిల్లీలోని హాజ్‌ఖాస్‌లో ఉన్న శ్రీజగన్నాథుని ఆలయానికి వెళ్లాను. మహా ప్రభు దర్శనం చేసుకున్నాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఆయన నాపై తన ఆశీస్సు లను కురి పించారు. పూర్తి విశ్వాసంతో నేను నామినేషన్ దాఖలు చేశాను. అత్యంత ఉత్సా హంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. 2022 జులై 25న రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి పార్లమెంట్ సెంట్రల్ హాలుకి వెళుతూ..దారిలో నేను మహాప్రభు జగన్నాథుని స్మరి స్తూనే ఉన్నాను. ఆయన ఆశీస్సు లతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రపతిగా నేను మొదటిసారి ప్రసంగించినప్పుడు ఆయన నాతోనే ఉన్నట్టు అనిపించింది. అయినప్పటికీ.. మహాప్రభు దర్శనం కోసం నా హృదయం పరితపించింది. రోజులు గడచిపోతున్నాయి కానీ పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరికైనా ఆయన దర్శనం ఎలా లభిస్తుందని నాకు అని పించింది. మహాప్రభూ! నేనేదైనా తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. దయచేసి నన్ను పూరీకి పిలిచి.. మీ దర్శన భాగ్యం ఇవ్వండి అనిమౌనంగా ప్రార్థించాను. భావాలకు లేదా భావోద్వేగాలకు కూడా ఆయనే మహాప్రభు. నా ఆలోచనలను ఆయన ఎలా అర్థం చేసుకోకుండా ఉంటారు? అనతి కాలంలోనే పూరీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు 2022 నవంబరు 10. పూరీకి చేరుకున్న తర్వాత వాహన శ్రేణి శ్రీ మందిర్ దిశగా ముందుకు వెళుతోంది. పూరీలోని బడదాండ వద్దకు చేరుకోగానే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముంచెత్తింది. బడదాండ శ్రీజగన్నాథునిది. ఇక్కడ ప్రొటోకాల్ పాటించాల్సి న అవసరం ఉందా? అన్ని పుణ్య క్షేత్రాల్లోనూ క్షేత్ర రాజంగా పూరీ ప్రసిద్ధి చెందింది. దేవుళ్లకే దేవుడు మహాప్రభు. ఎలాంటి ఆలోచనలు లేకుండా నా కారుని ఆపించాను. నా కారు ఆగగానే వెనుక వస్తున్న కార్లనీ కూడా ఆగిపోయాయి. ఏం జరుగుతుందో మిగిలిన వారికి అర్థమయ్యేలోపే.. చెప్పులు లేకుండా బడ దాండపై నడవడం మొదలుపెట్టా ను. అక్కడికి శ్రీ మందిర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలయ శిఖరం మీద ఉన్న నీలచక్రం, పతిత పావన ధ్వజం మీదే నా దృష్టిని సారించి ముందుకు సాగాను. ముందుకు నడుస్తూనే.. రోడ్డుకిరు వైపులా ఉన్న బాలలు, మహిళలు, యువత, పెద్దలకు నమస్కరిస్తూనే ఉన్నాను. కానీ నా దృష్టి మాత్రం మహాప్రభు మీదే ఉంది. ఆలయ సింహద్వారానికి చేరుకొనే సరికి.. నేను స్థిమితంగా ఉండలేకపోయాను. అప్పటికే నన్ను నేను మరచిపోయాను. బడ దాండ మీద దుమ్ములోనే సాష్టాంగ నమస్కారం చేసి ఆ మహాప్రభుకి నా ప్రణామాలు అర్పించాను. ఆ తర్వాత నేను గుడిలోకి వెళ్లాను. గర్భగుడికి చేరుకొని నలుగురు దేవతామూర్తులను దర్శనం చేసుకుని, దైవికానందంతో ఉప్పొంగిపోయాను. ఈ విశ్వానికి రక్షకుడు మహాప్రభువే. అందరూ వదిలేసిన వారికి కూడా ఆయనే రక్షకుడు. లోకం లోని జనుల కష్టాలను తీర్చేందుకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అందుకే ఆయన విశాలమైన గుండ్రటి నేత్రాలు ఎప్పుడూ రెప్ప వాల్చవు. ఆయనకి పెద్దాచిన్నా తారతమ్యం లేదు. ఆయన దృష్టిలో అందరూ సమానులే. సమానత్వమే ఆయన మంత్రం. ఆయన దీవెనలతోనే.. సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేసేందుకు నన్ను నేను అంకితం చేసుకున్నాను. గుండ్రని కన్నులతో ఉన్న మహాప్రభు జగన్నాథుని చూస్తూ.. ఓ మహాబాహూ! ప్రజలకు సేవ చేయాలనే నా అంకితభావం కొనసాగేలా ఆశీర్వదించు. ఓ కృపానిధీ! నా దేశాన్ని, ఈ ప్రపంచాన్ని రక్షి ంచు అని చేతులు జోడించి ప్రార్థించాను. ఇలా చెబుతూ భక్తిభావంలో లీనమైపోయాను.

# అవగాహనే కల్తీకి అసలైన అడ్డుకట్ట

డాక్టర్. వై. సంజీవ కుమార్

నేటి సమాజంలో కల్తీ అనేది కేవలం ఆహార పదార్థాలకే పరిమితం కాలేదు. మనం తినే ఆహారం నుంచి, తాగే నీరు వరకు, వాడే మందుల నుంచి, రోజువారీ వినియోగ వస్తువుల వరకు అనేక రంగాల్లో నాణ్యతలేని ఉత్పత్తులు విస్తరిస్తున్నాయి. ఫలితంగా ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయి. నేటి సామాన్యుడు పెరుగుతున్న ధరలతో ఇప్పటికే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నాడు. సంపాదన తక్కువ, ఖర్చులు ఎక్కువ. అలాంటి పరిస్థితుల్లో 'తక్కువ ధరకు వస్తే చాలు' అనే ఆలోచనతో వస్తువులను కొనుగోలు చేస్తున్నాడు. కానీతక్కువ ధర కోసం తీసుకున్న ఆ నిర్ణయమే కొన్నిసార్లు జీవితాంతం బాధను మిగులుస్తోంది. ఆహారంలో నాణ్యత లేకపోవడం వల్ల చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక రకాల అనారోగ్యసమస్యలు ఎదురవుతున్నాయి. కల్తీపాలు, నూనెలు, మసాలా దినుసులు, తీపి పదార్థాలు, పండ్లు, కూరగాయలు, తేనె వంటి అనేక ఆహారపదార్థాల్లో కల్తీ పెరుగుతోంది. ఇవి శరీరంలో నెమ్మదిగా విషంలా పనిచేసి క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ తాను సంపాదించిన డబ్బును వైద్య ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోంది. చివరికి తక్కువ ధరకు కొన్నవస్తువు వల్ల ఎక్కువ నష్టాన్ని చవి చూస్తున్నాడు. ప్రజల ఆర్థిక బలహీనతను కొందరు వ్యాపారులు అవకాశంగా మలుచుకుంటున్నారు. నాణ్యత లేని ముడిపదార్థాలతో వస్తువులు తయారు చేసి, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్లో విక్రయిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. కొందరు నకిలీ బ్రాండ్ పేర్లతో ప్రజలను మోసం చేస్తున్నారు. నిజాయితీగా వ్యాపారంచేసే వారు నష్టపోతుండగా, అక్రమంగా సంపాదించే వారికి అవకాశాలు పెరుగుతున్నాయి. కల్తీని పూర్తిగా అరికట్టడం కష్టమే కావచ్చు. కానీ కఠినమైన చట్టాల అమలు, నిరంతర తనిఖీలు, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించే విధానం, నేరస్థులకు వేగవంతమైన శిక్షలు ఉంటే పరిస్థితిలో గణనీయ



మైన మార్పుతీసుకురావచ్చు. అలాగే వినియోగదారుల్లో అవగాహన పెరగడం కూడా అత్యంత అవసరం. ప్రజలు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. కొనుగోలు చేసే వస్తువుల తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత గుర్తులు, తయారీదారు వివరాలు పరిశీలించాలి. అనుమా నాస్పదమైన వస్తువులను కొనకుండా ఉండాలి. బిల్లు తప్ప నిసరిగా తీసుకోవాలి. కల్తీ లేదా నాణ్యతలేని వస్తువులు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి. ప్రభుత్వ శాఖలు, ఆహార భద్రత అధికారులు, వినియోగదారుల సంఘాలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కల్తీ ఉత్పత్తులను కొంతవరకైనా అరికట్టాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. అందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఎవరైనా ఆహార పదార్థాలు, మందులు లేదా ఇతర వస్తువుల నాణ్యతపై అనుమానం వ్యక్తం చేస్తే, వెంటనే ఆ యాప్‌ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉండాలి. ఆ యాప్‌లో వస్తువు ఫొటోలు, వీడియోలు, కొనుగోలు చేసిన బిల్లు, దుకాణం పేరు, చిరునామా, కొనుగోలు చేసిన తేదీ, లొకేషన్ వంటి వివరాలను నమోదు చేసే సౌకర్యం కల్పించాలి. ఫిర్యాదు నమోదైన వెంటనే అది సంబంధిత ఆహార భద్రత, వినియోగదారుల పరిరక్షణ లేదా ఇతర తనిఖీ అధికారులకు చేరేలా వ్యవస్థ రూపొందించాలి. ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రత్యేక ట్రాకింగ్ నంబర్ ఇచ్చి, దాని పురోగతిని ఫిర్యాదు చేసిన వ్యక్తి యాప్‌లోనే తెలుసుకునే అవకాశం కల్పించాలి. ఫిర్యాదు నిజమని తేలితే సంబంధిత వ్యాపార సంస్థపై వెంటనే తనిఖీలు నిర్వహించి, అవసరమైతే వస్తువులను స్వాధీనం చేసుకోవడం, భారీ జరిమానాలు విధించడం, లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా, ఒకే దుకాణం లేదా తయారీ సంస్థపై పదేపదే ఫిర్యాదులు వస్తే వాటిని ప్రత్యేకంగా గుర్తించి కఠిన పర్యవేక్షణలో ఉంచాలి. తప్పుడు ఫిర్యాదులు తగ్గించేందుకు ఆధారాలతో కూడిన ఫిర్యాదులకే ప్రాధాన్యత ఇవ్వాలి. ●

# ప్రజాస్వామ్య దిశానిర్దేశకుడు ఓటరే..

ఫిరోజ్ ఖాన్

రాజకీయ సభల్లో హాజరైన జనసందోహమే ప్రజాభిప్రాయం కాదు. సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రచారమే ఓటర్ల తుది నిర్ణయమూ కాదు. చివరకు ఎన్నికలఫలితాన్ని నిర్ణయించేది మౌనంగా ఉండే ఓటరేనా? ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఎక్కువగా చర్చకు వస్తున్న ప్రశ్న ఇదే. రాష్ట్రంలో 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు చోటుచేసుకుంది. ఎన్నికల ముందు వెలువడిన వివిధ రాజకీయ విశ్లేషణలు, సర్వేలు, ప్రజా చర్చలతో పోలిస్తే తుది ఫలితాలపై భిన్న వ్యాఖ్యానాలు వ్యక్తమయ్యాయి. దీంతో 'సైలెంట్ ఓటర్' పాత్రపై మరోసారి చర్చ ప్రారంభమైంది. భారత ఎన్నికల సంఘం అధికారిక గణాంకాల ప్రకారం, గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 71 శాతం పోలింగ్ నమోదైంది. ఇది ప్రజాస్వామ్య భాగస్వామ్యం బలంగా కొనసాగుతోందని సూచిస్తుంది. మరో వైపు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రతి అర్హుడైన పౌరుడికి సార్వత్రిక ఓటు హక్కును కల్పిస్తే, 2013లో 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో రహస్య ఓటు ప్రజాస్వామ్య సమగ్రతకు కీలకమైన అంశమని సుప్రీంకోర్టు పేర్కొంది. అందువల్ల ఓటరు తన రాజకీయ అభిప్రాయాన్ని బహిరంగంగా వెల్లడించకపోయినా, పోలింగ్ కేంద్రంలో తీసుకునే నిర్ణయమే ప్రజాస్వామ్యానికి అసలు నిర్వచనంగా నిలుస్తుంది. సైలెంట్ ఓటర్‌ను ఒకే కులం, ఒకే మతం, ఒకే వర్గం లేదా ఒకే పార్టీతో ముడిపెట్టడం ప్రజాస్వామ్య వాస్తవాలను అతిగా సరళీకరించినట్లే అవుతుంది. భారత ఎన్నికల సంఘం విడుదల చేసే పోలింగ్ శాతం, ఓటరు జాబితా సవరణలు, ఓటర్ల గణాంకాలు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే అందిస్తాయి. కానీ ఓటరు ఎందుకు ఒక నిర్ణయం తీసుకున్నాడో చెప్పవు. సీఎస్‌డీఎస్ (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్-లోక్‌నీతి) వంటి సంస్థలు నిర్వహించిన ఎన్నికల అనంతర అధ్యయనాలు, ఓటర్ల నిర్ణయాన్ని ఒక్క అంశంతో వివరించడం సాధ్యం కాదని, అనేక సామాజిక, ఆర్థిక, స్థానిక అంశాలు కలిసే ప్రభావం చూపుతాయని సూచిస్తున్నాయి. పాలనపై అభిప్రాయం, స్థానిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రైతు సమస్యలు, మహిళల భద్రత, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాల అమలు, అభ్యర్థి విశ్వసనీయత, ప్రాంతీయ సమస్యలు ఇలాంటి అనేక అంశాలు కలిసి ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. తెలంగాణలో పట్టణ-గ్రామీణ ప్రాంతాల అవసరాలు, ప్రాధాన్యతలు భిన్నంగా ఉండటంతో రాజకీయ స్పందన కూడా ఒకేలా ఉండదు. అందుకే ప్రతి రాజకీయ పార్టీ వివిధ సామాజిక



వర్గాలతో నిరంతర సంబంధం కొనసాగించడం ప్రజాస్వా మ్య వ్యవస్థలో సహజమైన రాజకీయ ప్రక్రియ. అయితే తుది నిర్ణయం మాత్రం ఓటరు స్వతంత్ర అభిప్రాయం, వ్యక్తిగత అనుభవం, విశ్వాసంపైనే ఆధారపడి ఉంటుంది. రాజకీయ కమ్యూనికేషన్ గత దశాబ్దంలో గణనీయంగా మారిపోయింది. ఒకప్పుడు బహిరంగ సభలు, పోస్టర్లు, సంప్రదాయ ప్రచారమే ప్రధాన సాధనాలు కాగా, ఇప్పుడు సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారం, డేటా ఆధారిత వ్యూహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అదే సమయంలో సమాచార వేగం పెరిగిన కొద్దీ వాస్తవ నిర్ధారణ అవసరమూ పెరిగింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రజలతో మమేకం కావడానికి విభిన్న పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైన పోటీ. అయితే ప్రచార తీవ్రత ఒక్కటే ప్రజాభిప్రాయాన్ని కొలిచే ప్రమాణం కాదని రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఓటరు తన కుటుంబ ఆర్థిక పరిస్థితి, స్థానిక మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవల అనుభవం, ప్రజాప్రతినిధు ల అందుబాటు, భవిష్యత్‌పై నమ్మకం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాడు. అందువల్ల రాజకీయ సైకాలజీ అంటే భావోద్వేగాలను ప్రభావితం చేయడం మాత్రమే కాదు, ప్రజల్లో విశ్వాసాన్ని నిర్మించడం, నిలబెట్టుకోవడం, విశ్వసనీయతను సంపాదించడం కూడా అంతే కీలకమైన అంశంగా మారింది. డిజిటల్ ప్రచారం ఎంత విస్తరించినా, ఓటరు వ్యక్తిగత అనుభవం, స్థానిక వాస్తవాలు, పాలనపై తన అంచనాలే చివరికి అతని నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రాజకీయ పార్టీలు వ్యూహాలు రూపొందించడం, ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజం. అదే సమయంలో ప్రతి పార్టీ తన విధానాలు, పనితీరు, నాయకత్వాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లే హక్కు కూడా కలిగి ఉంటుంది. కానీ ఆ ప్రయత్నాలన్నింటికీ తుది తీర్పు ఇచ్చేది ఓటరే. అందుకే 'సైలెంట్ ఓటర్' అనేది ఏ ఒక్క పార్టీకి చెందిన రాజకీయ పదం కాదు. అది భారత ప్రజా స్వామ్య స్వేచ్ఛకు ప్రతీక. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రచారం దృష్టినిఆకర్షించవచ్చు, రాజకీయ నినాదాలు చర్చను సృష్టించవచ్చు, డిజిటల్ ట్రెండ్లు అభిప్రాయాలను ప్రభావితం చేయవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేది పారదర్శక పాలన, జవాబుదారీతనం, అభివృద్ధి, రాజ్యాంగ విలువలపట్ల నిబద్ధత మాత్రమే. చివరికి ఎన్నికల ఫలితాలు ఏపార్టీ విజయాన్ని మాత్రమే కాదు, మౌనంగా తన నిర్ణయాన్ని వ్యక్తపరిచిన లక్షలాది ఓటర్ల సమిష్టి తీర్పు ను కూడా ప్రతిబింబిస్తాయి. అందుకే రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే నాయకుల ప్రసంగాల కంటే ప్రజల జీవితా లను, ప్రచారాల కంటే ప్రజల అనుభవాలను, నినాదాల కంటే ప్రజల విశ్వాసాన్ని వినడం అవసరం. ప్రచారం ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు, కానీ ప్రజాస్వామ్యానికి దిశను నిర్దేశించేది చివరికి ఓటరే. ●

16-7Pg5exHNWMJQE:16-7Pg5exHNWMJQE.qxd 7/15/2026 10:24 PM Page 1



# సెమికాన్ 2.0కు గ్రీన్‌సిగ్నల్



**● రూ.1.28 లక్షల కోట్లు కేటాయింపు ● భారత్‌లో ఫోన్ల తయారీకి రూ.62.500 కోట్లు ● వారణాసిలో 2 మెగా ఎలివేటెడ్ కారిడార్లకు ఓకే ● రైల్వే విస్తరణ, ఎరువుల ఉత్పత్తి తదితర 7 కీలకప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం ● వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, జులై 15:** మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, రైల్వేలు, యూరియా తదితర రంగాలకు సంబంధించిన 7 కీలక ప్రతిపాదనలకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.2,19,353 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపనున్నాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధికి అవసరమైన కీలకరంగాల్లో పెట్టుబడులను పెంచడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ నిర్ణయాల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. సెమీకండక్టర్ రంగానికి సంబంధించిన కీలక కార్యక్రమాన్ని విస్తరిస్తూ రూ. 1.28 లక్షల కోట్ల (రూ.1,27,500 కోట్లు) అదనపు నిధులను కేటాయించేందుకు, అలాగే మొబైల్ ఫోన్ తయారీకోసం రూ. 62,500 కోట్ల వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేబినెట్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ, భారతదేశంలో సెమీకండక్టర్ డిజైన్, తయారీ వ్యవస్థ (ఎకోసిస్టమ్) అభివృద్ధి కోసం ప్రభుత్వం 'సెమీకాన్ 2.0' కార్యక్రమానికి ఆమోదం తెలిపిందని వైష్ణవ్ చెప్పారు. సెమీకాన్ 2.0 కార్యక్రమం ఆరు ప్రధాన అంశాల (స్తంభాల) ఆధారంగా రూపొందించబడుతుందని వైష్ణవ్ పేర్కొన్నారు. 1.చిప్ డిజైన్, 2. యంత్రాలు- ముడి పదార్థాలు, 3. కొత్త సెమీకండక్టర్ తయారీ కేంద్రాల ఏర్పాటు, 4.అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్. అలాగే అవుట్‌సోర్స్డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ప్యాకేజింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం. 5. పరిశోధన, అభివృద్ధి. 6. నైపుణ్యాల అభివృద్ధి (టాలెంట్ డెవలప్‌మెంట్). ఈ కార్యక్రమం మొదటి దశ అయిన 'సెమీకాన్ 1.0' విజయవంతమైందని పేర్కొన్న వైష్ణవ్, ఇప్పటికే మూడు ప్లాంట్లలో చిప్ ఉత్పత్తి ప్రారంభమైందని తెలిపారు. "ఇది ఒక వ్యూహాత్మక పరిశ్రమ. ప్రపంచంలోని అనేక దేశాలు దీనిని ఇప్పటికే వ్యూహాత్మక పరిశ్రమగా ప్రకటించాయి. సెమీకాన్ 1.0 కింద ఆమోదించబడిన 12 సెమీకండక్టర్‌ప్లాంట్లలో, మూడు ప్లాంట్లలో వాణిజ్య పరమైన ఉత్పత్తి ఇప్పటికే ప్రారంభమైంది" అని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల బాధ్యతలు కూడా నిర్వహి స్తున్న వైష్ణవ్ అన్నారు.

రాబోయే ఐదేళ్లలో రూ.62,500 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో 'మొబైల్ ఫోన్ తయారీ పథకం'ను ప్రకటించినట్లు కేంద్ర మంత్రి వైష్ణవ్ తెలిపారు. ఉత్పత్తిని పెంచడానికి, దేశీయ విలువ జోడింపును మరింతగా పెంపొందించడానికి, సరఫరా గొలుసు స్థితిస్థాపకతను బలోపేతం చేయడానికి, 'మేడ్ ఇన్ ఇండియా' మొబైల్ ఫోన్‌ల ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపరచడానికి ఈ నిధులను వినియోగిస్తామని పేర్కొన్నారు. ఈ పథకం కింద, భారతదేశంలో మొబైల్ ఫోన్‌ల తయారీకి సంబంధించిన అర్హత గల అమ్మకాలపై ప్రభుత్వం 2.25 శాతం నుండి 5 శాతం వరకు వేర్వేరు రేట్లలో ప్రోత్సాహక మద్దతునుఅందిస్తుంది. అలాగే,కీలకమైన భాగాలు, సబ్‌అసెంబ్లీల దేశీయ సేకరణకు అనుసంధానంగా 1.5 శాతం వరకు అదనపు ప్రోత్సాహకాన్ని కూడా అందిస్తుంది. భారతీయ బ్రాండ్‌లను నిర్మించే లక్ష్యంతో ఉత్పత్తి రూపకల్పన, ఆర్‌డి కోసం అర్హత గల అమ్మకాలపై ప్రభుత్వం 3 శాతం అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది.

వారణాసికి వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. మొదటి ప్రాజెక్టుగా వరుణా నది వెంట 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. దీనికి రూ.10,998 కోట్ల వ్యయం అవుతుంది. వారణాసి రింగ్ రోడ్‌ను జాతీయ రహదారి31తో అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టు మొత్తం 43.21 కిలోమీటర్ల మేర నిర్మించబడుతుంది. రెండో ప్రాజెక్టుగా గంగా నది వెంట 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.14,448 కోట్లుగా అంచనా వేశారు.

**రైల్వే రంగానికి మరో రెండు ప్రాజెక్టులు**

దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఒడిశాలోని పరదీప్ హరిదాస్‌పూర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్ల వ్యయాన్ని ఆమోదించింది. దీంతో పోర్టు ప్రాంతాల నుంచి సరుకు రవాణా మరింత సులభతరం కానుంది. అలాగే దంగోపోసిరాజ్ ఖర్సవాన్ మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్ల పెట్టుబడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తూర్పు భారతదేశంలో రైల్వే నెట్‌వర్క్

## టిఎంసిలో ఎమ్మెల్యే రాజీనామా



### కేసులభయంతో రెబెల్ శిబిరంలోకి మదన్ మిత్రా

**కోల్‌కతా,జులై 15:** పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో అంతర్గత విభేదాలు మరింత ముదురుతున్నాయి. సీనియర్ టిఎంసి ఎమ్మెల్యే మదన్ మిత్రా బుధవారం ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు శిబిరంలో చేరడం పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ వర్గానికి మరో రాజకీయ షాక్‌గా మారింది. తాను ఇప్పటికీ టిఎంసి సభ్యుడినేనని మదన్ మిత్రా స్పష్టం చేశారు. కమర్హాటి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మదన్ మిత్రా, మమతా బెనర్జీ వర్గానికి చెందిన "కాలీఘాట్ టిఎంసి" జాతీయ, రాష్ట్ర స్థాయి అన్ని సంస్థాగత కమిటీలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో పార్టీ చీఫ్ విప్ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేశారు. అసెంబ్లీలో రితబ్రత బెనర్జీని ఆయన కార్యాలయంలో కలిసి అనంతరం మీడియాతో మాట్లాడిన మదన్ మిత్రా, నేను ఇల్లు మార్చలేదు.. కేవలం గది మాత్రమే మార్చాను. నేను ఇప్పటికీ తృణమూల్ కాంగ్రెస్‌లోనే ఉన్నానని వ్యాఖ్యానించారు. తెల్లటి కుర్తా, తన ప్రత్యేకమైన నల్లటి కళ్లద్దాలతో రితబ్రత బెనర్జీ పక్కన కూర్చున్న మదన్ మిత్రా, మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గంలో ఇకపై ఎలాంటి సంస్థాగత బాధ్యతలు చేపట్టబోనని, అయితే టిఎంసి ఎమ్మెల్యేగా కొనసాగుతానని వెల్లడించారు. కాలీఘాట్ టిఎంసికి చెందిన జాతీయ, రాష్ట్ర కమిటీలన్నింటి నుంచి రాజీనామా చేస్తున్నాను. అలాగే చీఫ్ విప్ పదవినీ వీడుతున్నాను. కానీ నేను టిఎంసి ఎమ్మెల్యేగానే కొనసాగుతానని ఆయన తెలిపారు. టిఎంసిలో సంస్థాగత విభజన బహిర్గతమైన తర్వాత తిరుగుబాటు శిబిరంలో చేరిన అత్యంత ప్రముఖ నేతగా మదన్ మిత్రా నిలిచారు. దీంతో మమతా బెనర్జీ వర్గం ఎదుర్కొంటున్న రాజకీయ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిఎంసిలో ప్రజాదరణ కలిగిన కీలక నాయకుడిగా, మమతా బెనర్జీకి సుదీర్ఘకాలం అత్యంత సన్నిహిత సహచరుడిగా పేరుగాంచిన మదన్ మిత్రా, ఇటీవల పార్టీ నాయకత్వంలోని కొన్ని వర్గాలపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ పార్టీని వీడే ఉద్దేశం లేదని పలుమార్లు స్పష్టం చేశారు.అయితే ఇప్పుడు రితబ్రత బెనర్జీ శిబిరానికి మద్దతు ప్రకటించడం ద్వారా తిరుగుబాటు వర్గానికి ఇప్పటివరకు లభించిన అత్యంత ప్రముఖ రాజకీయ ముఖచిత్రంగా మారారు.

## గల్ఫ్‌నౌకల్లో ఉన్న ప్రతి భారతీయ నావికుడి వివరాలు ప్రత్యేక నమోదు

### కేంద్ర షిప్పింగ్ శాఖ తాజా ఆదేశాలు

**న్యూఢిల్లీ,జులై 15:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ గల్ఫ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రతి భారత నావికుడి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నౌక ఏ దేశ జెండాతో ప్రయాణిస్తున్నా అందులో పనిచేస్తున్న ప్రతి భారతీయుడిపై పూర్తి సమాచారం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌కు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఆదేశాలు జారీ చేశారు. పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న ప్రతి నౌకపై ప్రత్యేక ఆపరేషనల్ డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ డ్యాష్‌బోర్డ్‌లో నౌక ఉన్న ప్రాంతం, యాజమాన్యం, సరకు వివరాలు, సిబ్బంది సంఖ్య, భారతీయ నావికుల సంక్షేమం, భద్రతా పరిస్థితి, ప్రయాణ మార్గం, చేరాల్సిన పోర్టు, అందుబాటులో ఉన్న సౌకర్యాల వంటి సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుంది. వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించిందని సోనోవాల్ తెలిపారు. ఈ దాడుల్లో భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు గాయపడటం తీవ్ర వేదన కలిగించిందని చెప్పారు. ప్రపంచ సరఫరా వ్యవస్థ కొనసాగడంలో కీలక పాత్ర పోషిస్తున్న భారత నావికులపై ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇరాన్, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని భారత రాయబార కార్యాలయాలు, విదేశాంగ శాఖతో సమన్వయం పెంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నౌకాయాన భద్రత, ప్రత్యామ్నాయ పోర్టులు, వైద్య సాయం, తరలింపు, స్వదేశానికి పంపే ఏర్పాట్లు, దర్యాప్తు పురోగతిపై ఎప్పటికప్పుడు ధ్రువీకరించిన సమాచారం సేకరించాలని సూచించారు. అలాగే గల్ఫ్ ప్రాంతంలో భారతీయ నావికులను నియమించిన షిప్పింగ్ కంపెనీలు, నౌకల నిర్వహణ సంస్థలు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పూర్తి సమాచారం, భద్రత, అవసరమైన సాయం లేకుండా ఏ భారతీయ నావికుడినీ విధులకు పంపొద్దని స్పష్టం చేశారు.



## 19 యేళ్ల తర్వాత కోల్‌కతాకు తిరిగి వస్తున్న తస్లీమా నస్రీన్

### రాజకీయ వివాదానికి దారితీసిన పర్యటన

**కోల్‌కతా, జులై 15:** బంగ్లాదేశ్‌కు చెందిన ప్రవాస రచయిత్రి, మానవ హక్కుల కార్యకర్త తస్లీమా నస్రీన్ దాదాపు రెండు దశాబ్దాల అనంతరం కోల్‌కతాకు తిరిగి రానున్నారు. ఆమె రచనలపై గతంలో తీవ్ర నిరసనలు చెలరేగడంతో 2007లో నగరాన్ని విడిచిపెట్టాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.63 యేళ్ల తస్లీమా నస్రీన్ రాసిన ఆత్మకథాత్మక గ్రంథం'ద్విఖండి'తో పై దైవదూషణ ఆరోపణలు రావడంతో అప్పటి సిపిఎం ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది. 2004 నుంచి 2007 వరకు కోల్‌కతాలో నివసించిన ఆమె ప్రస్తుతం దీర్ఘకాలిక నివాస అనుమతితో ఢిల్లీలో ఉంటున్నారు.ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 1న రబీంద్ర సదన్‌లో నిర్వహించనున్నమౌలికవాద వ్యతిరేక కార్యక్రమానికి ఆమె హాజరుకానున్నారు. 2007 తర్వాత కోల్‌కతాకు ఇది ఆమె తొలి పర్యటన. మూడు సంస్థల సంయుక్త ఆహ్వానం మేరకు ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తస్లీమా నస్రీన్ కొన్ని కవితలు పఠించడంతో పాటు చర్చలో పాల్గొననున్నారు. ఆమె గౌరవార్థం పౌర సత్కారం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సువేందు అధికారి, రాష్ట్ర ఆర్థిక మంత్రి స్వపన్ దాస్‌గుప్తా, ప్రముఖ రచయిత శీర్షేందు ముఖోపాధ్యాయ్ హాజరయ్యే అవకాశముందని నిర్వాహకులు వెల్లడించారు.అయితే ఆమె పర్యటన ఇప్పటికే రాజకీయ వివాదానికి దారితీసింది. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య మాట్లాడుతూ, తస్లీమా నస్రీన్ స్వరాన్ని ఎందుకు అణచివేయాలి, బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం ఎదుర్కొన్న హింసను లజ్జాలో ఆమె రాశారు. గత వామపక్ష ప్రభుత్వం ఆమె రచనలను నిషేధించింది. కోల్‌కతాకు ఆమె రావడాన్ని మేము స్వాగతిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో ఇప్పటికీ నిషేధంలో ఉన్న లజ్జా నవలలో అక్కడి హిందువులు, ఇతర మతపు మైనారిటీలపై జరిగిన అవహనం, హింసను చిత్రీకరించారు.మరోవైపు తృణమూల్ ఎమ్మెల్యే అఖ్రుజ్జమాన్ స్పందిస్తూ, తస్లీమా నస్రీన్ తరచూ ముస్లింలపై విమర్శలు చేస్తారని, అందుకే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆమెను గౌరవిస్తోందని ఆరోపించారు.

## ఆ ముగ్గురికీ క్లీన్‌చిట్ ఇవ్వడమా?

### చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో కాంగ్రెస్ సర్కార్‌పై అశోక్ తీవ్ర విమర్శలు





**బెంగళూరు, జులై 15:** గత యేడాది బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన కేసులో ముగ్గురు సీనియర్ ఐపిఎస్‌అధికారులకు కర్ణాటక ప్రభుత్వం క్లీన్ చిట్ ఇవ్వడంపై రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అశోక్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.జూన్ 4, 2025న జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించి సీనియర్ ఐపిఎస్ అధికారులు బి. దయానంద, వికాస్ కుమార్ వికాస్, శేఖర్ హెచ్. తెక్కన్నవర్‌లపై ప్రారంభించిన శాఖాపరమైన విచారణలను ప్రభుత్వం ఉపసంహరించుకోవడాన్ని ప్రశ్నించిన అశోక్ ఈ ఘటనకు అసలు బాధ్యులు ఎవరో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల కన్నీళ్లు, వారి శాపం ఈ హంతకకాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టదని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అమాయక యువతకు న్యాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అశోక్ ఆరోపించారు. ఈ విషాదాన్ని ప్రభుత్వ ప్రాయోజిత హత్యగా అభివర్ణిస్తూ, బాధ్యులను రక్షించడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన భయానక తొక్కిసలాటలో 11 మంది అమాయక యువతీయువకుల మరణాలకు నిజమైన బాధ్యులు ఎవరు ఈ ప్రభుత్వ ప్రాయోజిత విషాదానికి న్యాయం ఎక్కడని ఆయన ప్రశ్నించారు.అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒకే రోజు రెండు వేదికల్లో ఐపీఎల్ విజయోత్సవాలకు అనుమతి ఇచ్చారని, అదే సమయంలో అప్పటి ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ విషాద పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆర్సీబీ జెండాతో ఫోటోలకు పోజులిచ్చారని అశోక్ ఆరోపించారు.అలాగే పోలీసులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, అప్పటి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ (డీపీఏఆర్) కార్యదర్శి సత్యవతి విధానసౌధ ముందు కార్యక్రమం నిర్వహించాలంటూ పట్టుబట్టారని, మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని అప్పటి ప్రధాన కార్యదర్శి షాలిని రజనీష్ పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఇప్పుడు సిద్ధరామయ్యకు తప్పులేదు, డి.కె. శివకుమార్ అమాయకుడు, ప్రధాన కార్యదర్శికి ఎలాంటి బాధ్యతలేదు, డిపిఎఆర్ కార్యదర్శి నిర్దోషి, ఇప్పుడు పోలీసు అధికారులూ నిర్దోషులయ్యారు.మరి ఆ 11మంది అమాయకుల మరణాలకు బాధ్యులు ఎవరు వాళ్లు తమంతట తామే చనిపోయారా అంటూ ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం నియమించే ప్రతి విచారణ కూడా నిజాలను వెలికితీయడానికి కాకుండా కేసును పూడ్చిపెట్టడానికేనని అప్పుడే చెప్పానన్నారు. కాగా, జూన్ 4, 2025న జరిగిన చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారులు బి. దయానంద, వికాస్ కుమార్ వికాస్, శేఖర్ హెచ్. తెక్కన్నవర్‌లపై ప్రారంభించిన శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలను కర్ణాటక ప్రభుత్వం మంగళవారం అధికారికంగా విరమించుకుంది. అఖిల భారత సర్వీసుల (క్రమశిక్షణ, అప్పీల్) నిబంధనలు1969 ప్రకారం ప్రారంభించిన విచారణలను సంబంధిత అధికారుల వివరణలు, పరిపాలనా శాఖ అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం మూసివేస్తున్నట్లు డిపిఎఆర్ (సర్వీసెస్4) శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.2025 జూన్ 4న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబి) తొలి ఐపిఎల్ టైటిల్ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు గుమిగూడడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 11 మంది మృతి చెందగా, కనీసం 56 మంది గాయపడ్డారు.

## సుప్రీంకోర్టులో హంగామా చేసిన ఇద్దరు న్యాయవిద్యార్థుల అరెస్టు

**న్యూఢిల్లీ,జులై 15:** సుప్రీంకోర్టులో న్యాయ విచారణకు అంతరాయం కలిగించడంతో పాటు భద్రతా సిబ్బందిపై దాడి చేసిన ఇద్దరు న్యాయ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్లకింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా జిల్లాకు చెందిన, లక్నో విశ్వవిద్యాలయంలో మూడో సంవత్సరం న్యాయ విద్యార్థి అయిన 24 ఏళ్ల ప్రబల్ ప్రతాప్ సింగ్, రాయ్‌బరేలికి చెందిన రెండవ సంవత్సరం న్యాయ విద్యార్థి 23 ఏళ్ల చందర్ భాన్ కలిసి జులై 10న సుప్రీంకోర్టులో హంగామా చేశారు. ప్రబల్ ప్రతాప్ సింగ్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. పిటిషనర్ అయిన ప్రబల్ ప్రతాప్ స్వయంగా కోర్టుకు హాజరై గందరగోళం సృష్టించాడు. న్యాయమూర్తులను దుర్భాషలాడటంతో పాటు కోర్టు హాలులో కాగితాలు విసిరేశాడు. అదుపు చేసేందుకు జోక్యం చేసుకున్న భద్రతా సిబ్బందిపై న్యాయ విద్యార్థులు దాడిచేసి వారి విధులను అడ్డుకున్నారు. మరోవైపు సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఇద్దరు న్యాయ విద్యార్థులను అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల ప్రవర్తనపై సుప్రీంకోర్టు సూచనల మేరకు వైద్య పరీక్షల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్‌కు తీసుకువెళ్లారు. అయితే ఇద్దరు న్యాయ విద్యార్థుల మానసిక ఆరోగ్యం బాగానే ఉన్నట్లుగా వైద్యులు నిర్ధారించారని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో నిందితులిద్దరినీ రెండు రోజుల పోలీస్ కస్టడీకి తరలించినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న అభ్యంతరకర విషయాల కరపత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## భారీ వర్షాల మధ్య కూడా చార్‌ధామ్ యాత్ర..

### 14 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య



**డెహ్రాడూన్, జులై 15:** ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రతిష్ఠాత్మక చార్‌ధామ్ యాత్రకు భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా పవిత్ర క్షేత్రాలను దర్శించుకుంటూ యాత్రను కొనసాగిస్తున్నారు.ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు ఉన్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని అధికారులు తెలిపారు.అధికారుల వివరాల ప్రకారం, ప్రతిరోజూ 6 వేల మందికి పైగా భక్తులు శ్రీ బద్రీనాథ్ ధామ్‌ను దర్శించుకుంటున్నారు. ఇక ప్రస్తుత యాత్రా సీజన్‌లో కేదార్‌నాథ్ ధామ్‌ను దర్శించిన భక్తుల సంఖ్య ఇప్పటికే 14 లక్షలు దాటింది. అయితే నిరంతర వర్షాల కారణంగా ఉత్తరాఖండ్‌లోని అనేక ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినడం, కొండచరియలు విరిగిపడటం, ట్రెక్కింగ్ మార్గాలు జారుడుగా మారడంవంటి సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. అందువల్ల యాత్రికులు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాష్ట్రంలోని చమోలి, రుద్రప్రయాగ్, పౌరీ గఢ్వాల్ తదితర కొండ ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ, జిల్లా యంత్రాంగంకలిసి యాత్ర సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. యాత్రికుల భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.బద్రీనాథ్ దర్శనం అనంతరం ఓ భక్తుడు మాట్లాడుతూ, తాము మొదట హేమకుండ్ సాహిబ్‌ను దర్శించేందుకు వచ్చామని, అక్కడ ప్రార్థనలు చేసిన తర్వాత బద్రీనాథ్ ధామ్‌ను కూడా సందర్శించాలని భావించి ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఇక్కడి అనుభవం ఎంతో అద్భుతంగా ఉందని, అన్ని ఏర్పాట్లు బాగున్నాయని, ప్రతి ఒక్కరూ ఈ పవిత్ర క్షేత్రాన్ని దర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని సూచించారు.మరో భక్తుడు కూడా వర్షాలు కొనసాగుతున్నప్పటికీ యాత్ర కోసం చేసిన ఏర్పాట్లను ప్రశంసించారు.

ప్రతికూల వాతావరణం ఉన్నా యాత్ర ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయిందని తెలిపారు. రుద్రప్రయాగ్ జిల్లా కలెక్టర్ విశాల్ మిశ్రా మాట్లాడుతూ, మొన్నటి సాయంత్రం వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం కేదార్‌నాథ్ ధామ్‌ను దర్శించిన భక్తులసంఖ్య 14 లక్షలు దాటిందన్నారు. ప్రస్తుతం మాన్సూన్ కారణంగా వాతావరణ పరిస్థితులే ప్రధాన సవాలుగా మారాయని చెప్పారు.వర్షాల సమయంలో రహదారులు తరచూ మూసివేయబడుతున్నాయని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం అధికంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎత్తైన ప్రాంతాల్లో యాత్ర సాగుతుండటంతో కొంతమంది భక్తులు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గుండెపోటు వంటి కారణాలతో కొందరు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయని, అనారోగ్యానికి గురైన పలువురిని సకాలంలో రక్షించి వైద్య చికిత్స అందించామని వెల్లడించారు.

## మోస్ట్‌వాంటెడ్ జాబితాలో గ్యాంగ్‌స్టర్ నితీశ్ కౌశల్



**వాషింగ్టన్,జులై 15:** అగ్రరాజ్యం అమెరికాలో అంతర్జాతీయ నేర ముఠాలపై ఎఫ్‌బీఐ చర్యలను వేగవంతం చేసింది. తాజాగా భారత మూలాలున్న నితీశ్ కౌశల్‌ను మోస్ట్ వాంటెడ్ నేరస్థుల జాబితాలోచేర్చింది. హత్యలు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వసూళ్లు, ఆయుధాల అక్రమ రవాణా, మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అతనికి ప్రమేయం ఉన్నట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. నితీశ్ కౌశల్‌కు జగ్గు భగవాన్‌పురియా ఆర్గనైజ్డ్ క్రిమినల్ గ్రూప్‌తో సంబంధాలు ఉన్నాయి. పంజాబ్‌లో ప్రారంభమైన ఈ ముఠా అమెరికాలోని కాలిఫోర్నియా సెంట్రల్ జిల్లా సహా పలు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

# సంక్షిప్త వార్తలు

## హార్ముజ్‌కు ప్రత్యామ్నాయంగా ఫుజైరా పోర్టు



**అబూదాబి,జులై 15:** పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో, వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన హార్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేయడంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఇ) ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, దుబాయ్‌కి చెందిన ప్రముఖ పోర్ట్స్ ఆపరేటర్ డిపి వరల్డ్, దేశ తూర్పుతీరంలోని ఫుజైరాలో కొత్తమల్టీపర్పస్ పోర్టు, కంటైనర్ టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే, నౌకలు ప్రమాదకరమైన హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించాల్సిన అవసరంలేకుండానే నేరుగా యూఎఇకి సరుకు రవాణాచేసే వెసులుబాటు కలుగుతుంది.

## పాక్‌లో ఘోర ప్రమాదం: నలుగురు మృతి


**కాబూల్,జులై 15:** పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.స్థానిక మీడియా కథనాల ప్రకారం, షేక్‌పురా జిల్లాలోని మురిద్కే ప్రాంతంలో కలా ఖతాయ్ రోడ్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సైద్‌వాలాలో నిర్వహించిన ఒమతపరమైన కార్యక్రమానికి హాజరై లాహోర్‌కు తిరిగి వస్తున్న ప్రయాణికులతో బస్సు ప్రయాణిస్తోంది. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించేందుకు బస్సు డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని మలుపు తిప్పడంతో అదుపుతప్పి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే నలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

## అయోధ్య ట్రస్టు సిఇఓ పోస్టుకు వెయ్యికిపైగా దరఖాస్తులు



**అయోధ్య,జులై 15:** రామమందిరం నిర్వహణ కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నూతనంగా ప్రకటించిన ప్రధాన కార్య నిర్వహణాధికారి (సిఇఓ) పోస్టుకు అనూహ్య స్పందన లభిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన రెండు రోజుల్లో వెయ్యికిపైగా దరఖాస్తులు ట్రస్టుకు అందడం విశేషం. ఆలయ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను మరింత క్రమబద్ధీకరించి, వృత్తిపరమైన ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఈ సిఇఓపదవిని సృష్టించింది. అభ్యర్థులలో అత్యధికులు విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండటం గమనార్హం.

## అంతరిక్షంలోకి భారతసంతతి వ్యోమగామి అనిల్‌మీనన్



**ఆస్తానా, జులై 15:** భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మీనన్ తన తొలి అంతరిక్ష యాత్రను విజయవంతంగా ప్రారంభించారు. రష్యాకు చెందిన సోయజ్ ఎంఎస్29 వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఆయన సురక్షితంగా చేరుకున్నారు. దాదాపు ఎనిమిది నెలలపాటు సాగే ఈమిషన్‌లో ఆయన కీలకమైన శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ప్రయోగాలు చేపట్టనున్నారు. కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి సోయజ్ ఎంఎస్ 29 వ్యోమనౌకలో అనిల్ మీనన్, రోస్‌కాస్మోస్ వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాలతో కలిసి బయలుదేరారు. కేవలం మూడు గంటల ప్రయాణం తర్వాత వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌లోని ప్రిచల్ మాడ్యూల్‌తో విజయవంతంగా అనుసంధానమైంది.

## ఇవి ఛార్జింగ్‌తో మంటలు.. ఇద్దరు మృతి

**లక్నో,జులై 15:** ఛార్జింగ్ చేస్తున్న ఎలక్ట్రిక్ వాహనంలో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న వాహనాలకు మంటలు వ్యాపించడంతో బిల్డింగ్ అంతా పొగలు కమ్ముకున్నాయి. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. 50 కుటుంబాలకు చెందిన వారిని కాపాడారు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం సెక్టార్ 66లోని మమురా విలేజ్ ప్రాంతంలోని ఒక బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది.



# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు వేగవంతం

● ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ సరళతరం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్

**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సంస్థ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులతోపాటు గృహ విద్యుత్ సర్వీసులకు, ఫీడర్లకు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మొత్తం కలిపి ఇప్పటివరకు 10.50 లక్షల స్మార్ట్ మీటర్లను అమర్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్‌లో పాదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చినట్లు తెలియజేశారు. స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షి ంచుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లులో ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుందని వివరించారు.

**ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ సరళతరం:** సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అందుబాటులో ఉన్న మొబైల్ అప్లికేషన్‌ను సరళతరం చేశామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు విద్యుత్ బిల్లుల చెల్లింపు, పేమెంట్ వివరాలను తెలుసుకోవడంతోపాటు కొత్త సర్వీసులకు దరఖాస్తు చేసుకునే సౌలభ్యం కూడా వుందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్స్ తోపాటు ఐఫోన్ వినియోగదారులు కూడా ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు.

సంస్థ పరిధిలో ఇప్పటికే మంజూరైన సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సబ్ స్టేషన్ల నిర్మాణంలో పరికరాల నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, సిహెచ్ రామచంద్ర రావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీనివాసులు, జగదీష్, లత పాల్గొన్నారు.

## మెరిట్ ఆధారంగానే ఎఇఇ పోస్టుల నియామకం

● 20 లోగా దరఖాస్తు చేసుకోవాలి ● ఆగస్ట్ 22 నుంచి రాతపరీక్షలు



**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎపిట్రాన్స్‌కో, ఎపిజెన్‌కో, ఎస్‌పిడిసిఎల్, ఇపిడిసి ఎల్, ఎపిసిపిడిసిఎల్ సంస్థల్లో అసి స్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ల భర్తీ ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలో మెరిట్ ద్వారానే నియామ కాలను చేపట్టడం జరుగుతుందని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం పేర్కొన్నారు. ఎపిట్రాన్స్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 16, టెలికామ్ 10, సివిల్ ఇంజనీర్లు 23 మొత్తం కలిపి 200, ఎపిజెన్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 52, మెకానికల్ 21, ఎలక్ట్రానిక్స్ 7, సివిల్ ఇంజనీర్లు 20 మొత్తం కలిపి 100, ఎపిఎస్‌పిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 125, టెలికామ్ 4, సివిల్ ఇంజనీర్లు 6 మొత్తం కలిపి 135, ఎపిఇపిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 128, టెలికామ్ 3, సివిల్ ఇంజనీర్లు 4 మొత్తం కలిపి 135, ఎపిసిపిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 56, టెలికామ్ 1, సివిల్ ఇంజనీర్లు 3 మొత్తం కలిపి 60 పోస్టుల నియామకానికి ఆయా సంస్థలు ప్రకటనను జారీ చేయడం జరిగింద న్నారు. నియామక ప్రకటనలో పేర్కొన్న షెడ్యూల్ మేరకే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొన సాగుతోందని, ఈ నెల 20వ తేదీ లోగా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. షెడ్యూల్ పేర్కొన్న విధంగానే ఈ ఏడాది ఆగస్టు 22వతేదీ నుండి 29వతేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. ఈ షెడ్యూల్ తేదీల్లో ఎటువంటి మార్పు వుండబోదని స్పష్టం చేశారు.

**నియామకాల్లో అవకతవకలకు చోటు లేదు:** ఎఇఇ పోస్టుల నియామక ప్రక్రియలో ఎటువంటి అవక తవకలకు చోటులేదని, ఈ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని సిఎండి శివశంకర్ వివరించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎఇఇ పోస్టుల నియామక అంశంలో అభ్యర్థులు దళారుల మాటలు, ఇతర అనధికారిక సామాజిక మాధ్య మాల ద్వారా వెలువడే సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని సూచించారు.

## ఎక్సలెన్సీ సెంటర్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

●ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇంటర్, ఐఐటి, నీట్, జెఇఇకి ఉచిత శిక్షణ

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ప్రముఖ కోచింగ్ సంస్థల సహ కారంతో నడపబోతున్న సెంటర్స్ ఆఫ్ ఎక్స లెన్స్‌లలో, ఇంటిగ్రేటెడ్ ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్‌తో కూడిన ఇంటర్మీడియట్ (ఎంపిసి/ బైపిసి) కోర్సులలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మార్చి 2026లో జరిగిన ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణులై, 85శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. మార్చి 2026లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులు సీనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవచన్నారు.

ఈ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల ద్వారా నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతో పాటు సమగ్రమైన ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్, వసతి, భోజనం, స్టడీ మెటీరియల్, ఇతర విద్యాపరమైన సహాయంతో కూడిన ఉచిత గురుకుల విద్యను అందిస్తామని తెలిపారు. 17 జులై 2026 నుండి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే ఇతర జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రసన్న వెంకటేష్ తెలిపారు.

## రౌడీ షీటర్‌పై పిడి యాక్ట్

**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ వరుసగా తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న రౌడీ షీటర్ కంకి వంశి(25)పై పిడియాక్ట్ పోలీసులు నమోదు చేశారు. ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రతిపాదనతో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు సూళ్లూరుపేట, శ్రీహరికోట, తడ, నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు, గూడూరు, నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల్లో దొంగతనాలు, దాడులు, మహిళలపై వేధింపులు, ఆయుధాలతో బెదిరింపులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు నమోదైంది. అతనిపై మొత్తం 28 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పలుమార్లు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ అతని నేరప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, ప్రజా శాంతి భద్రతలకు తీవ్ర ముప్పుగా మారినట్లు జిల్లా పోలీసు శాఖ గుర్తించింది. దీంతో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల మేరకు నిందితుడిని ఈరోజు కడప సెంట్రల్ జైలుకు భద్రతా ఏర్పాట్ల మధ్య తరలించారు.

# తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి టిటిడి నిధులు




**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతికి అత్యంత ప్రధాన మైన మరో పుణ్యక్షేత్రం తిరుచానూరు పరిసర ప్రాంతాల రహదారుల విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి టిటిడి నిధులు మంజూరుకు ఆమోదం లభించింది. తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రహదారులను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేశారు. తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ప్రణాళికలు, బ్లూప్రింట్లను టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడుకి తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్,విసి గోవిందరావు వివరించారు.

బుధవారం తుడ ఛైర్మన్ దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్. గోవిందరావుతో కలిసి తుడా కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో జరిగిన సమావేశంలో టిటిడి పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. తిరుచానూరు పరిసరాల్లో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అంతర్గత, ప్రధాన రహదారులను లింక్ చేస్తూ మాస్టర్ ప్లాన్ రోడ్లను డిజైన్ చేశామన్నారు.

భూసేకరణ ప్రక్రియ, ప్రస్తుతం ఉన్న రోడ్ల విస్తరణకు ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను అధిగమించడానికి తీసుకుంటున్న చర్యలను టిటిడి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

టిటిడి, తుడ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం ద్వారా తిరుపతి నగర రూపురేఖలు మారతాయని స్పష్టంచేశారు.

తుడ అధికారులు అందించిన ప్రజెంటేషన్, ప్రణాళికలపై ఛైర్మన్ బి.ఆర్. నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేసేందుకు టిటిడి బోర్డు పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని తెలిపారు.

# నదుల అనుసంధానంతోనే కరవు నివారణ

● జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ● కేంద్ర మాజీ మంత్రి దివంగత కెఎల్ రావుకు నివాళి



**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశం కరవు విపత్తును అధిగమించాలంటే నదులను అనుసంధానం చేయడమే ఏకైక మార్గమని ఎపి జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఉద్ఘాటించారు. గంగా, మహానది, గోదావరి, కృష్ణా, కావేరి వంటి నదులు ఈ దేశానికి చాలా అవసరమని కెఎల్ రావు సూచించారని, వాటిని అనుసంధానం చేయాలన్నారు. జలవనరుల శాఖ నిపుణుడు, కేంద్ర మాజీ మంత్రి దివంగత కెఎల్ రావు 125వ జయంతి సందర్భంగా విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ఉన్న ఆయన ఘాట్ వద్ద మంత్రి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ "కెఎల్‌రావు ఇచ్చిన స్ఫూర్తి, అప్పటి ప్రధానమంత్రి నుండి ప్రస్తుత నరేంద్ర మోడీకి స్ఫూర్తినిచ్చింది. అదేవిధంగా, చంద్రబాబు నాయుడు కూడా దీనిని అమలు చేసి, పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణా డెల్టాలను అనుసంధానించారు. ఇది కెఎల్ రావుకు మన గొప్ప నివాళి. పట్టిసీమ ద్వారా 445 టిఎంసిలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించాం" అని వివరించారు. పట్టిసీమ, ఒట్టిసీమ అన్న గొడ్డలి పార్టీ నాయకుడు ఇప్పుడు ఏం చెబుతారని మంత్రి నిమ్మల రామానాయుడు నిలదీశారు. విధ్వంసపు ఆలోచనలు, పాలన అనుభవం లేకపోవడం, ముందుచూపు లేకపోవడం వల్లే గొడ్డలి పార్టీ నాయకుడు పట్టిసీమ ఎత్తిపోతల వైపు కన్నెత్తి చూడలేదని మంత్రి విమర్శించారు. కృష్ణా డెల్టాకు నీరు అందక, సాగు తాగునీరు లేక బీడుగా మారితే చూడాలన్నదే గొడ్డలి పార్టీ ఆకాంక్ష అని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా, కెఎల్ రావు కుమారుడు విజయరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ అండర్ టన్నెల్ అయినా, భవానీపురం సమీపంలోని గాంధీ హిల్ అయినా, లేదా ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని నిల్వ చేయడం అయినా, ఈ స్ఫూర్తిని అందుకున్న ఎన్టీ రామారావు ఆ రోజుల్లో కృష్ణమ్మను తన కలంలో ఇరికించి తెలుగు గంగపై వారి మద్రాసులకు నీటిని అందించారు. అదే స్ఫూర్తితో, ముఖ్యమంత్రి పట్టిసీమ ప్రాంతంలో నదుల అనుసంధానం ద్వారా ఆ ప్రాంతానికి 445 టిఎంసిల నీటిని తీసుకువచ్చారు. 442 టిఎంసిల నీటిని వినియోగించుకొని రూ.50 వేల కోట్ల విలువైన పంటలను కృష్ణా డెల్టా రైతులు పండించారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. వైఎస్సార్సీపీ కుట్రలు ఎన్ని చేసినా సిఎం చంద్రబాబు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన తండ్రి ఆశయాలతో ముందుకు సాగుతుండటం సంతోషంగా ఉందని కెఎల్ రావు కుమారుడు విజయరావు అన్నారు.

## తిరుమల సమాచారం

### శ్రీవారి దర్శన టిక్కెట్లు, వసతి కోసం మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

● టిటిడి అధికారిక వెబ్‌సైట్‌నే వినియోగించాలి:

అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజురోజుకూ రెట్టింపవుతున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు పలు రకాలుగా దళారులు భక్తులను నమ్మించి మోసం చేస్తున్నారు. వివిధ దర్శనాలు కల్పిస్తామని, గదులు ఇప్పిస్తామని నమ్మించి భారీగా డబ్బులు తీసుకుని చివరకు దగా చేస్తున్నారు. దీంతో రోజురోజుకూ భక్తుల నుండి వస్తున్న ఫిర్యాదులతో టిటిడి అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఓ వైపు టిటిడి విజిలెన్స్ విభాగం అధికారులు, తిరుమల పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులుపేసుకుంటుండ టంతో దళారుల మోసాలు ఎక్కువయ్యాయనే విమర్శలు లేకపోలేదు. ఇప్పుడు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కూడా మధ్యవర్తులను, దళారులను నమ్మిమోసపోవద్దని సూచించారు. టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారానే భక్తులు దర్శనం టిక్కెట్లు, వసతి కోసం సంప్రదించాలని తెలిపారు. శ్రీవారి దర్శనం, వసతి గదులు, ఆర్జిత సేవలు తదితర బుకింగ్‌ల కోసం భక్తులు తప్పనిసరిగా టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు.

# కుప్పలుతెప్పలుగా విరాళాలు!

● పెరిగిన దాతల దర్శనాల ఒత్తిడి తట్టుకోలేకనే సదుపాయాలు కోత

● టిటిడి కొత్త దాతలకు జీవితాంతం నుండి పాతికేళ్లకు కుదింపు



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు... ఆపద మొక్కుల వాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాల ప్రాధాన్యతలో దాతలు కీలకంగా మారారు. ఎన్నో ఏళ్ళనుండి ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ ట్రస్టులు, పథకాలకు డబ్బున్న ధనవంతులు నుండి కోటీశ్వరులు కూడా దేవదేవునిపై భక్తి విశ్వాసాలతో విరాళాలివ్వడం పరిపాటిగా మారింది. ధనవంతులు, పారిశ్రామిక వేత్తలు, కోటీశ్వరులు కూడా దేవునిపై భక్తి విశ్వాసాలతోనే గాక వారి కుటుంబం తిరుమలకు వస్తే ఇష్టదైవాన్ని దగ్గరగా వీక్షించే భాగ్యం కలుగుతుందని విశ్వాసంతోనే విరాళాలు ఇస్తున్నారనేది టిటిడి వర్గాల అభిప్రాయం. ఇందులో ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు రూ.2,500 కోట్లకు పైగానే విరాళాలు రావడం విశేషం. ఆ తరువాత ఎస్వీ ప్రాణ దాన ట్రస్ట్‌కు ప్రస్తుతం విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే పలు ట్రస్ట్‌లకు దాతలు విరాళాలు ఇచ్చేందుకు టిటిడి అధికారులతో బాటు పాలకమండలి కూడా ప్రోత్సాహమిస్తోంది. టిటిడిలో దాదాపు 2లక్షల మంది దాతలు నమోదైనట్లు తెలుస్తోంది. మంగళవారం ఒక్కరోజే 96.98కోట్ల రూపాయలు వివిధ పథకాలకు విరాళాలు రావడం విశేషం. ఇందులో ఆన్‌లైన్‌ద్వారా 2,354మంది, ఆఫ్‌లైన్ ద్వారా 106మంది భక్తులు విరాళాలు అందించారు.

ఇదివరకు టిటిడి ట్రస్టులు, పథకాల్లో ఏదేని ఒక దానికి ఒక లక్ష రూపాయలు విరాళమిచ్చినా దాతలకు నిన్నటి వరకు సంవత్సరంలో మూడు సార్లు ఐదుగురికి సుపథం టిక్కెట్లు జారీచేసేవారు. నూతన దాతల పాలసీతో ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఇడి) టిక్కెట్లు జారీ చేస్తారు. రూ.2 లక్షలు విరాళాల దాతలకు ఏడాదికి ఒకసారి సుపథం దర్శనం టిక్కెట్లు ఇస్తారు. ఇలా రూ.3లక్షలు దాతలకు ఏడాదికి రెండుసార్లు సుపథం, రెండు సార్లు ఎస్ఇడి టిక్కెట్లు ఇస్తారు. రూ.10లక్షలు ఇచ్చిన దాతలకు సంవత్సరంలో ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనం సదుపాయం కల్పించారు. రూ.15లక్షలు విరాళమిచ్చిన దాతలకు ఒకసారి సుపథం, ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనాలు సదుపాయం కల్పించారు. రూ.20లక్షలు దాతలకు ఒకసారి సుపథం, ఒకసారి ఎస్ఇడి, రెండు సార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనాలు సౌకర్యం ఉంటుంది. 25లక్షలు ఇచ్చిన దాతలకు రెండు సార్లు సుపథం, ఒకసారి ఎస్ఇడి, మూడు సార్లు విఐపి బ్రేక్ దర్శనాలు సదుపాయం ఉంటుంది. రూ.50లక్షలు దాతలకు ఏడాదికి నాలుగుసార్లు సుపథం, 2సార్లు బిగినింగ్ బ్రేక్, ఒకసారి సుప్రభాతం, 2సార్లు కల్యాణోత్సవం సేవా భాగ్యం కల్పిస్తారు.

అత్యధికంగా కోటి రూపాయలు ఇచ్చిన దాతలకు నాలుగుసార్లు సుపథం దర్శనం, 3సార్లు బిగినింగ్ బ్రేక్, సుప్రభాతసేవ దర్శనం 2సార్లు అవకాశం ఉంటుంది. ఇదివరకు ఉన్న సదుపాయాల్లో భారీగా టిటిడి కొత్తగా చేరే దాతలకు కోత విధించింది. ఇదివరకు దాతలకు జీవితాంతం సౌకర్యాలు కల్పించిన టిటిడి కొత్తవారికి 20యేళ్ళకు మాత్రమే కుదించింది.

పలురకాలుగా పారిశ్రామికవేత్తలు ఇచ్చే విరాళాల దాతల సౌకర్యాలను 15సంవత్సరాలకు కుదించారు. టిటిడి గణాంకాల మేరకు రూ.10లక్షల లోపు దాతలు 1,212మంది, రూ.10లక్షల నుండి 25లక్షల వరకు 1,246మంది దాతలు, కోటి రూపాయలు విరాళాలిచ్చిన దాతలు కేవలం ఇద్దరే ఉండటం గమనార్హం. వసతి సదుపాయాల్లో కూడా వంద రూపాయలు గదుల నుండి 3వేల రూపాయల అద్దె గదుల వరకు ప్రయోజనం ఉంటుంది. టిటిడి నుండి ప్రయోజనాలను పొందడానికి దాతలు ముందుగానే తమ విరాళాలు సమర్పించారనేది అధికారుల వాదన. రూ.2 కోట్లు విరాళాలిచ్చిన దాతలకు ప్రయోజనాలు కూడా 20యేళ్ళకే కుదించారు.

ఇంకా దాతలు శ్రీవారి దర్శనాల కోసం తీసుకువస్తున్న ఒత్తిడితోనే నూతన దాతల నిబంధనల్లో మార్పుచేసి సౌకర్యాలు కుదించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు పలు పథకాలకు, ట్రస్ట్‌లకు విరాళాలివ్వాలని టిటిడి విజ్ఞప్తి చేస్తుండగా మరోవైపు ఇలా సౌకర్యాలు కుదించడంతో మరీ భక్తులైన దాతల నుండి ఏ మేరకు స్పందన ఉంటుందనేది చూడాల్సిందేనని టిటిడి ఉద్యోగ వర్గాల సమాచారం. టిటిడి అధికారులు మాత్రం సామాన్యభక్తుల దర్శనాల కోసమే దాతల ప్రయోజనాల్లో కుదింపు చేశామనేది వివరణ.

# ఆపదమొక్కులవాడికి రేపు ఆణివార ఆస్థానం



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆల యంలో శుక్రవారం (రేపు) సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగ నుంది. ఉదయం 7గంటలకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయ దేవేరులతో మలయప్పస్వామి గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షి ణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్దజీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగు పట్టువస్త్రాలను మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విశ్వక్సేనులకి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు తలకు శ్రీవారిపాదవస్త్రంతో వరిపట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వ రోభం అని స్వామిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామికి, టిటిడి ఇఒ చేతులకు లచ్చన తాళపు చెవిగుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి తాళపు గుత్తిని స్వామివారి పాదాలచెంత ఉంచుతారు.

**సాయంత్రం పుష్ప పల్లకీ:** ఆణివార ఆస్థానం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు.ఆణివార ఆస్థానం కారణంగా జులై 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం,

# విద్య, ఆరోగ్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యం

● ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడిలో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. టిటిడి ఆధ్వర్యంలోని 33 విద్యాసంస్థల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నా రని, వారికి నాణ్యమైన విద్యతో పాటు అత్యా ధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, కృషిని అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధి రోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో బుధవారం టిటిడి విద్యాసంస్థల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "ప్రతిభా పురస్కారం-2026 కార్యక్రమాన్ని నిర్వహించి 147 మంది ప్రతిభావంతులను సన్మానించారు. ఇఒ ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ విద్యే జీవితాన్ని మార్చే శాశ్వత సంపద అని, దానిని ఎవరూ హరించలేరని పేర్కొన్నారు. గ్రామీణ, రైతు కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు టిటిడి కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా టిటిడి విద్యాసంస్థలను తీర్చిదిద్దేందుకు అవసరమైన అధ్యాపక సిబ్బంది, మౌలిక సదు పాయాలు, పోషకాహార భోజనం, నాణ్యమైన బోధనను అందిస్తున్నామని తెలిపారు. జెఇఒ డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ టిటిడి 150 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా "ప్రతిభా పురస్కారాలు" అందజేయడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. రూ.162 కోట్లతో విద్యాసంస్థలను ఆధునికీ కరిస్తూ డిజిటల్ క్లాస్‌రూములు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సిసిటివి వ్యవస్థలు, ఆధునిక మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యోగా, సంగీతం, నృత్యం, నైతిక విలువల బోధనకు ప్రాధాన్యం ఇస్తూ దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల సహకారంతో విద్యాసంస్థలను అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, బోర్డు సభ్యుడు జి. భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ 250 అదనపు సీట్లు, డే స్కాలర్లకు మధ్యాహ్న భోజన పథకం, కొత్త విద్యా భవనాల నిర్మాణం ద్వారా మరింత మందికి నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్వీ జూనియర్ కళాశాల, పద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన 76మంది ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు, తిరుపతి, తిరుమలలోని వివిధ టిటిడి పాఠశాలలకు చెందిన 71మంది విద్యార్థులను సన్మానించారు. పద్మావతి మహిళ జూనియర్ కళాశాలకు చెందిన ప్రణవి, ఉత్పల, నేహశ్రీ రాష్ట్ర స్థాయిలో 99శాతం మార్కులు సాధించి నందుకు ఛైర్మన్, ఇఒ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ కనబరిచిన 147 మంది విద్యార్థులకు ఐదు గ్రాముల వెండి డాలర్, మెమెంటో, శాలువా, ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు ఎన్. సదాశివరావు, సభ్యురాలు జానకి, టిటిడి డిఇఒ ఫణికుమార్ నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ళు, ప్రధానోపాధ్యా

## డిజిటల్ సేవలో శివయ్య దర్శనం సులభతరం

కియోస్క్ యంత్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో భక్తులకు అందించే సేవలలో పారదర్శకత కోసం ప్రభుత్వం అన్నిసేవలను డిజిటలైజేషన్ చేసిందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలోని నాల్గవ గేటు వద్ద భక్తుల సౌకర్యార్థం కియోస్క్ యంత్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలను అమలు చేసేందుకు పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని ఎంపిక చేసారన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎన్నో సేవలున్నాయని వాటిని ఆన్‌లైన్ చేయటం ద్వారా భక్తులకు ఇబ్బంది ఉండదన్నారు. ఏ పథకమైనా ఆదిలో కొన్ని ఒడుదుడుకులు ఎదుర్కొక తప్పదన్నారు. భక్తులకు సులభతర దర్శనం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆన్‌లైన్ సేవలు అమలు చేస్తుందన్నారు. ఇందుకు భక్తులు సహకరించాలన్నారు.

డిజిటల్ పద్ధతిలో నేరుగా టోకెన్లు దర్శన టిక్కెట్లు బుక్ చేసుకునే సదుపాయం కల్పించటమే ధర్మకర్తల మండలి లక్ష్యమని ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టె సాయిప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, గోపినాథ్, ఇఒ బికె వెంకటేశులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ప్రకాశం జిల్లా డిఆర్‌సి సమావేశంలో మంత్రులు ఆనం, గొట్టిపాటి, డోలా ● హాజరైన శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు



**ఒంగోలు (కలెక్టరేట్), జులై 15 ప్రభాతవార్త:** ఒంగోలులోని ప్రకాశం భవనం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రకాశం జిల్లా సమీక్షా మండలి (డీఆర్‌సీ) సమావేశం జిల్లా ఇన్‌చార్జి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ. రాజాబాబు, మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్లు కల్పన కుమారి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, ఒయూడీఏ చైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర కల్చరల్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుచిత్ర వీరయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇంచార్జ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలు చేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రతి శాఖ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంత గ్రామాల సమస్యలు, తాగునీటి సరఫరా, వెలిగొండ ప్రాజెక్టు పురోగతి, మత్స్యశాఖ అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. టైగర్ రిజర్వ్ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అటవీ చట్టాల కారణంగా వెదురు సాగు సాధ్యం కాని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రవాణా, బిల్లుల చెల్లింపులు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ముఖ్యంగా మార్కాపురం జిల్లాలో భూగర్భ జలమట్టం తగ్గుతున్న ప్రాంతాల్లో ప్రాజెక్టులు, కాలువల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని రిజర్వాయర్లలో నిల్వ చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి అవసరమైన నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహిస్తూ, గతంలో ప్రాజెక్టు ప్రారంభమైనప్పటికీ రైతులకు నీరు అందలేదని గుర్తు చేసిన మంత్రి, ప్రస్తుతం ప్రభుత్వం సుమారు రూ.2,900 కోట్లతో నిర్మాణ పనులు, మరో రూ.900 కోట్లతో భూసేకరణ చేపట్టిందని తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు విడుదల చేసే లక్ష్యంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి ఆనం వెల్లడించారు. అదేవిధంగా జిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని, ప్రజాప్రతినిధులు-అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు మరింత వేగంగా చేరుతాయని పేర్కొన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని సమావేశంలో స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రకాశం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని కోరారు. ఇతర ఎమ్మెల్యేలు కూడా తమ తమ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, సాగునీరు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజాప్రతినిధులు చేసిన సూచనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

## ఎస్ఐ నిర్లక్ష్యంతోనే యువకుడు మృతి

● ఏడుకొండలు కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**గూడూరు (నెల్లూరు), జులై 15 ప్రభాతవార్త:** గూడూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద హై టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. మనుబోలు మండలం వెంకటకుమదిలో బొల్లి ఏడుకొండలు అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందారు. గత మూడు రోజుల క్రితం బంగారం దొంగతనం కేసులో మృతుడిని మనుబోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడుకొండలును పోలీసులే కొట్టి హత్య చేశారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఉన్న ఏడుకొండలు మృతదేహాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. వైసిపి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మృతదేహాన్ని చూసేందుకు కాకాణి గోవర్ధన్ రెడ్డిని అనుమతించగా, మిగిలిన వైసిపి శ్రేణులను అనుమతించకపోవడంతో పోలీసులు, వైసిపీ శ్రేణులకు మధ్య ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు అణగారిన వర్గాలపై ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కక్షసాధింపు చర్యలు చేస్తున్నారన్నారు. ఏడుకొండలుని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ఉపయోగించారని, పోలీసుల ఆధ్వర్యంలో చనిపోయాడు కాబట్టి అతని మృతి లాకప్ డెత్‌గా పరిగణించాల్సిందేనన్నారు. ఏడుకొండలుని పోలీసులు మూడు రోజులపాటు స్టేషన్‌లో ఉంచి తీవ్రంగా కొట్టారని.. పోలీసులు ఉన్నతాధికారుల సహకారంతో హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్ఐ హనీఫ్ పై గతంలో పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో పలు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మృతుడిని విచారిస్తున్న సమయంలోని సిసి ఫుటేజ్ రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఏడుకొండలు కుటుంబానికి న్యాయం జరిగే వరకు వదిలిపెట్టే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. వీరితోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు మృతుని కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగా మురళి, తిరుపతి ఎంపి గురుమూర్తి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మీరారెడ్డి, జడ్పిటిసి యామిని, గూడూరు ఎంపీపీ గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహంతో వైసిపి శ్రేణుల ధర్నా

**మనుబోలు (నెల్లూరు), జులై 15, ప్రభాతవార్త:** చోరి కేసులో నిందితుడు బొల్లి ఏడుకొండలును మనుబోలు పోలీసులు కొట్టి చంపారు అని ఆరోపిస్తు నిందితుడి మృతదేహాన్ని పంచనామా అనంతరం కాకాణి గోవర్దన్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు మనుబోలు పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై ఉంచి ఆందోళనకు దిగారు. ఈ సంద్భంగా కాకాణి గోవర్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి, ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి కోటి రూపాయాలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి, ఆ కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్లు నెరవేరే వరకు బాధిత కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. 15 రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నిందితులపై తగుచర్యలు తీసుకుంటామని ఈ సందర్బంగా డిఎస్‌పి శ్రీనివాసరావు తెలియజేయడంతో ఆందోళన విరమించారు.

## జగమర్ల అడవిలో ఏనుగు హాల్‌చల్



**పలమనేరు, జులై 15 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు హాల్‌చల్ చేసింది. దీంతో అటవీ అధికారులు స్పందించి కుంకీఏనుగుతో గాలింపు చర్యలు చేపట్టి ఒంటరి ఏనుగును పట్టుకున్నారు. మూడు నెలలుగా ఒంటరి ఏనుగు నేషనల్ హైవే పక్కనే తిరుగుతూ పాదచారులను, వాహన దారులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ నెల 13న తెల్లవారు జామున 3:30 గంటల సమయంలో నేషనల్ హైవే పక్కనే నిలిచి వుండగా వాహన దారులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు అపరేషన్ కుంకీ ప్రారంభించారు. పెంగరగుంట అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఏనుగుల శాంచురీ నుండి శిక్షణ పొందిన కుంకీ ఏనుగును తీసుకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం నుండి ఆపరేషన్ కుంకీ పేరుతో గాలింపు చర్యలు చేపట్టిన అధికారులకు రాత్రి 7గంటల సమయంలో పట్టుబడింది. గాలింపు చర్యల్లో భాగంగా కుంకీ ఏనుగు అరుపులు విన్న ఒంటరి ఏనుగు చివరకు జగమర్ల అటవీ ప్రాంతంలో పట్టుబడింది. ఈ ఏనుగును టెంపో వాహనంలో పెంగరగుంట వద్ద ఏనుగుల శాంచరీకి తరలించారు.

## భర్త దారుణ హత్య.. భార్య, చిన్నారి అదృశ్యం

**గుడుపల్లె, జులై 15 ప్రభాతవార్త:** గుడికి భార్య, చిన్నారిపాపతో కలసి వెళ్లిన ఓ భర్త దారుణహత్యకు గురికాగా భార్య, చిన్నారి అదృశ్యమైన సంఘటన చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం మల్లప్పకొండ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి డిఎస్పీ పార్థసారథి తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. శాంతిపురం మండలం బోయనపల్లికి చెందిన హాసినికి తమిళనాడు రాష్ట్రం దేవదాసనపల్లికి చెందిన రమేష్‌తో వివాహం జరిగిందన్నారు. వీరికి ఏడాదిన్నర వయసుగల చిన్నారి ఉంది. కాగా మంగళవారం రమేష్ తన భార్య, చిన్నారితో కలసి మల్లప్పకొ ండకు టువీలర్‌లో వచ్చారన్నారు. కాగా బుధవారం ఉదయం రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో వీరు ముగ్గురు అదృశ్యమైనట్లు కేసు నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో గాలించగా మల్లప్పకొండ అటవీ ప్రాంతంలో రమేష్ హత్యకు గురైన విషయం గుర్తించినట్లు చెప్పారు. రమేష్ భార్య, చిన్నారి అదృశ్యమైనారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రెండు బైక్‌లు ఢీ: ఇద్దరు మృతి

**పుల్లంపేట, జులై 15 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని ఉత్తరంవారి పల్లె ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర మంగళవారం అర్ధరాత్రి రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కడప-చెన్నై జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న స్కూటీని హీరో హోండా ప్యాషన్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. వీరిని వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రాజంపేట మండలం గాలివారిపల్లికు చెందిన భార్యాభర్తలు సోంబత్తిన నారాయణ(48), లక్ష్మీదేవి(42)లు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇరువురు స్వగ్రామమైన గాలివారిపల్లి నుంచి ఓబులవారిపల్లె మండలం పెరుమాళ్ళపల్లిలో వ్యవసాయం చేసుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే పొలం పనులు ముగించుకొని తిరిగి రాత్రి సమయంలో బయలుదేరారు. పుల్లంపేట సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న రాజంపేట మండలం మందపల్లికి చెందిన గోపాల్, ప్రసాదులు వస్తున్న మోటార్ బైక్‌ను బలంగా ఢీకొనడంతో భార్యాభర్తలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ భార్యాభర్తలు బుధవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతుల అంగీకారంతోనే ఆక్వా ధరల నిర్ణయం ఉండాలి

మాజీ ముఖ్యమంత్రి జగన్



**భీమవరం, జులై 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో యావత్ రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక సమస్యల సుడిగుండంలో కూరుకుపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపి అధినేత జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆక్వా సమస్యల పరిష్కార నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో జగన్ మాట్లాడుతూ రైతాంగం పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర లేదని ఆక్వా రంగం కూడా అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉందని అన్నారు. ఇష్టానుసారంగా సీడ్ ఫీడ్ ధరలను పెంచుకుంటూ పోతున్నారని, రైతుల అంగీకారంతోనే ధరల నిర్ణయం ఉండాలని ధరలు పెంచాలంటే అక్టోబర్ నవంబర్ మాసాల్లో పంటలు సమృద్ధిగా అందుబాటులో ఉన్న తరుణంలో రివ్యూ చేయాలని అన్నారు. ఆక్వా రైతాంగం అంతా తమ గోడును వెళ్ళబోసుకున్నారని తెలిపారు. ఆక్వా రంగంలో రైతులకు అవసరమైన మెటీరియల్ సప్లై చేసే కంపెనీలు అన్నీ చంద్రబాబు సానుభూతి పరులకే ఉండటం రైతాంగం చేసుకున్న కర్మ అని అన్నారు. సీడ్ ఫీడ్ వారే నిర్ణయిస్తారని రైతులు ఎంతో పెట్టుబడి పెట్టి సాగుచేస్తే పంట చేతికి వచ్చేసరికి వారంతా సిండికేట్లుగా ఏర్పడి రేట్లు ధమాలున పడేస్తున్నారని అన్నారు. చంద్రబాబు సానుభూతిపరుల సిండికేట్ ఈ రాష్ట్రాన్ని నడిపిస్తుందని జగన్ విమర్శించారు. చంద్రబాబు వచ్చారంటే చాలు సిండికేట్లకు పండగే పండగ అని, రైతాంగానికి కన్నీళ్లే కన్నీళ్ల అని ఈ పరిస్థితి ఇప్పుడు రాష్ట్రంలో ఉందన్నారు. కంపెనీలు ఇస్తానుసారంగా ధరలూ పెంచుతూ పోతే ముఖ్యమంత్రి ఎందుకు అదుపు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. కిలో ధర 14 నుండి 16 వరకు ఎడాపెడా పెంచి, ఆందోళన వెలిబుచ్చితే కంటితుడుపు చర్యగా రెండు రూపాయల తగ్గించారు అన్నారు చంద్రబాబు భాషలో చెప్పాలంటే వంద కొరడా దెబ్బలు కాదు 98 మాత్రమే అని చెప్పినట్టు ఉందన్నారు రైతాంగం ఎలా బ్రతుకుతుందని జగన్ ప్రశ్నించారు. సూపర్ సిక్స్ సెవెన్ హామీలు, మోసాలతో అడుగు ముందుకేసి ప్రజలను మోసం చేశారన్నారు. 2018-19లో ఆక్వా ఎగుమతుల విలువ రూ.13,855 కోట్లు ఉంటే వైఎస్ఆర్సీపి ప్రభుత్వ హయాంలో రూ.20వేల కోట్లు ఉందన్నారు. నరసాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ నిలిచిపోయిందన్నారు. మెడికల్ కాలేజీ కూడా ఆగిపోయిన పరిస్థితి ఉందన్నారు మీ అందరి కష్టాలు నాకు తెలుసు అని, అందరికీ ఒకటే హామీఇస్తున్నానని అది "నేను ఉన్నాను" అని మాత్రం చెబుతున్నాను అన్నారు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేదని ఆర్‌బికే లు నిర్వీర్యమయ్యాయని, సబ్సిడీలు లేవని, వైఎస్ఆర్సీపి అందరికీ తోడుగా ఉంటుందని చెబుతున్నాను అన్నారు. అప్పటివరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగుతాయని రైతాంగాన్ని చేయి పట్టి నడిపిస్తూ తోడుగా ఉంటామని ఆక్వా రైతులకు వైస్ జగన్ భరోసానిచ్చారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

● టిడిపి శ్రేణులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు



**కోవూరు, జులై 15 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం కోవూరులోని కార్యాలయంలో టిడిపి నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా అంకితభావంతో పనిచేశారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం మరో 10 రోజులు గడువు ఇచ్చిన నేపథ్యంలో బిఎల్ఎలు సద్వినియోగం చేసుకుని పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత బేధాభిప్రాయాలు పక్కనపెట్టి పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో వర్గాలు ఉన్నా ఎన్నికల సమయంలో అందరూ ఏకమై పార్టీ అభివృద్ధిలో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న పలు నాయకులు వారి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డి, ఐదు మండలాల అధ్యక్షులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.84 కోట్లు



**కాణిపాకం, జులై 15 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.1.84 కోట్లు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ చైర్మన్ వి.మణినాయుడు, ఇఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. 22 రోజులకు హుండీల ద్వారా రూ1,83,98,379లు ఆదాయంగా లభించింది. అలాగే 49 గ్రాముల బంగారు, 640 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 16,165 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ2,20,830లు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 2373 అమెరికా డాలర్లు, 625 యూఏఈ దినార్స్,12 సింగపూర్ డాలర్లు 3 మలేషియా రింగిట్స్, 60 సౌదీ రియాల్స్, ఐదు ఆస్ట్రేలియా డాలర్లు, 65 కెనడా డాలర్లు ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ, ప్రసాద్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## అమరావతిలో అభివృద్ధి పేరుతో దోపిడీ

● రాజధానిని ఫ్రీ జోన్‌గా తక్షణమే ప్రకటించాలి ● వర్షాభావంతో ఇబ్బందుల్లో ఖరీఫ్ రైతులు

● ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ఆదుకోవాలి ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గం సభ్యులు జగదీష్



**అనంతపురం, జులై 15 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్ర రాజధాని అమరావతిలో అభివృద్ధి పేరుతో చేస్తున్న ప్రతి పని లోనూ భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు జగదీష్ ఆరోపించారు. బుధవారం అనంతపురంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారన్నారు. తాము అమరావతి అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు. కానీ పనుల పేరుతో ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు వేల కోట్ల రూపాయల ప్రజా సొమ్మును కట్టపెడుతున్నారని, ఇది సరికాదని హితవు పలికారు. ఒక చదరపు అడుగు నిర్మాణానికి అయ్యే ఖర్చు సగటున రూ.5 వేలు ఉంటుందని, కానీ టిడిపి ప్రభుత్వం ఏకంగా 16 వేల నుంచి 20 వేల వరకు ఇస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. తెలంగాణాలో సచివాలయం ఏర్పాటుకు, ఢిల్లీలో నూతన పార్లమెంటు భవన నిర్మాణానికి కేవలం చదరపు అడుగుకు కేవలం రూ.6 వేలు చెల్లించారని గుర్తుచేశారు. కానీ అమరావతిలో ఏకంగా రూ.20 వేల వరకు అడుగునకు చెల్లించడం వెనుక అవినీతి, అక్రమాలు దాగున్నాయని అన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం రుషికొండలో ప్యాలెస్ నిర్మాణాన్ని వ్యతిరేకించామని గుర్తు చేశారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అమరావతిలో కూడా అలాంటి తప్పిదమే చేస్తోందని హెచ్చరించారు. ఇక రాజధాని అమరావతి కేవలం కొన్ని జిల్లాలకే పరిమితం కాదని, రాష్ట్రంలోనే అన్ని జిల్లాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో భాగస్వామ్యం కల్పించాలని, అందువల్ల రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి యువజనలు కూడా ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సకాలంలో వర్షాలు కురవక భూములు బీటులు వాలాయన్నారు. తక్షణమే రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేయాలని, వారి రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, సిపిఐ నాయకులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకి వైభవంగా ఆషాఢం సారె

● ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా ప్రారంభమైన ఆషాఢ సారె ఉత్సవాలు



**ఇంద్రకీలాద్రి, జులై 15 ప్రభాతవార్త:** తమ ఇలవేలుపును ఇంటి ఆడపడుచుగా భావిస్తూ భక్తులు దుర్గమ్మకి ఆషాఢం సారె సమర్పణ ఉత్సవాలు వైభవంగా బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిసారెను ఆలయ వైదిక సిబ్బంది తొలి సారె సమర్పణ చేశారు. ఘాట్ రోడ్ ఓం మలుపు నుండి మేళతాళాలు, కోలాటాలు, వేదమంత్రోచ్చారణల నడుమ శోభాయమానంగా సాగిన ఊరేగింపుకు వైదిక బృందానికి ఇఓ వికె శీనా నాయక్ ఘనస్వాగతం పలికారు. మహామండపం 6వ అంతస్తులో అమ్మవారికి తొలి సారె సంభారాల సమర్పణ చేశారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సారె సమర్పించిన వైదిక సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో వేదఆశీర్వాదాలు అందించి, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాద వితరణ గావించారు. ఈ మహత్తర కార్యక్రమంలో దేవస్థాన స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్ దుర్గా ప్రసాద్, కోట ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవికుమార్, ఇతర అర్చకులు, వైదిక సిబ్బంది, సంప్రదాయ పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

**వేద పాఠశాల సందర్శించిన ఇఓ:** దేవస్థానం ఈవో వికె శీనానాయక్ దేవస్థానం వేదపాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, భోదన తీరు పరిశీలన చేశారు. వేదపాఠశాల ప్రాంగణంలో దేవతా వృక్షాలు ఎదగటానికి గానూ బిల్వం, మారేడు, నేరేడు వంటి మొక్కలు నాటారు. ఈవో ఆదేశాల ప్రకారం విద్యార్థుల ఆరోగ్యస్థితి తెలుసుకోవడానికి దేవస్థానం వైద్యబృందం వేదపాఠశాల సందర్శించి, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి, ఎఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మకి వెండి గిన్నె కానుక:** శ్రీ అమ్మవారి తీర్థము



భక్తులకు వితరణ చేయడానికి 374 గ్రాముల వెండి గిన్నెను బుధవారం హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ, భారతి దంపతులు తమ కుమార్డు జి వెంకట అజయ్ కుమార్ పేరిట కానుకగా అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వై శ్రీనివాసరెడ్డి తమ కుటుంబీకులతో కలిసి రు.1,01,116ల విరాళాన్ని బుధవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**మహిళల రద్దీ:** ఆషాఢ సారె సమర్పణకు ఇరు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులరా ఈరోజు సాయంత్రం 4 గంటల వరకు 23 సారె బృందాలు 9623 మంది భక్తులు వచ్చారు. ఉదయం 6.30 గంటలకు శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయం నుండి ఉత్సవ మూర్తిని మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు నడుమ



అర్చక బృందం మహా మండపం 6వ అంతస్తుకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదిక పై ప్రతిష్టించారు. అనూహ్యంగా పెరిగిన సారె భక్తుల రద్దీతో దర్శనం భవానీ అనుగ్రహ దర్శన్ క్యూ లైన్ (100/ దర్శనం లైన్ ) మొత్తం సారె భక్తులకు ఉచిత దర్శనంగా ఇఓ కేటాయించారు.

ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ ఆగస్టు 12 వరకు దుర్గమ్మకి ఆషాఢమాస సారె సమర్పించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. సారె సమర్పించాలనుకున్న భక్తులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ రశీదుతో పాటు సారె తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలుతో సారె బృందాలకు ఆలయ ప్రవేశం లేదని, సారె సమర్పణ బృందాలు లగేజ్, పాదరక్షలు, సెల్‌ఫోన్లు కనకదుర్గ నగర్లోనే భద్ర పరచుకుని ఆలయ ప్రాంగణం లోకి ప్రవేశించాలని, ఆలయ ప్రాంగణంలో, మహా మండపం 6వ అంతస్తులో సెల్ ఫోన్స్ కలిగిన భక్తుల వద్ద నుండి ఫోన్స్ స్వాధీనం చేసుకొని సీజ్ చేస్తామన్నారు.

16-07pg10:16-07pg10.qxd 7/15/2026 11:13 PM Page 1






ఫిఫా ప్రపంచకప్‌లో రెండోసారి ఫైనల్ చేరిన ఆనందంలో స్పెయిన్‌ఆటగాళ్లు

# ఫ్రాన్స్‌కు షాక్ : ఫైనల్లో స్పెయిన్

**టెక్సాస్, జులై 15:** సాకర్ వరల్డ్ కప్‌లో యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. డల్లాస్‌లో జరిగిన జరిగిన తొలి సెమీఫైనల్లో 2-0గోల్స్ తేడాతోఫ్రాన్స్‌ను ఓడించింది. ఈసారైనా కప్ సాధించాలన్న గత రన్నరప్ ఫ్రాన్స్ ఆశలపై నీళ్లు చల్లింది. ఫుట్‌బాల్ చరిత్రలో రెండోసారి ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. 2010లో మొదటిసారి ఫైనల్ చేరిన స్పెయిన్, అప్పట్లో నెదర్లాండ్స్‌ను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది.

**దుర్భేధ్యమైన డిఫెన్స్**

మ్యాచ్ ప్రారంభం లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి ఫ్రాన్ జట్టు... స్పెయిన్ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. కిలియన్ ఎంబాపె, మైఖేల్ ఒలిసే, డెంబెలేలతో కూడిన బలమైన ఫ్రాన్స్ అటాకింగ్ త్రయాన్ని స్పెయిన్ డిఫెండర్లు సమర్థవంతంగా కట్టడిచేశాయి.

**పెనాల్టీ గోల్**

తొలిఅర్ధభాగం 22వ నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమల్‌ను ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ దిగ్నే బాక్స్ లోపల ప్రమాదకర రీతిలో కిందపడేయడంతో స్పెయిన్‌కు పెనాల్టీ లభించింది. దీన్ని స్టార్ ఫార్వర్డ్ మికేల్ ఓయార్జబాల్ గోల్‌గా మలిచి స్పెయిన్‌కు 10 ఆధిక్యం లభించింది. ఇక ద్వితీయార్థం కొద్దిసేపటికే 58వ నిమిషంలో స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ దాని ఓల్మో అందించిన అద్భుతమైన పాస్‌ను ఫుల్ బ్యాక్ ఆటగాడు పెడ్రో పోర్రో గోల్‌గా మలిచాడు. స్పెయిన్‌కు రెండో గోల్ అందించాడు.

**విఫలమైన ఫ్రాన్స్ వ్యూహాలు**

మ్యాచ్ మధ్యలో ఫ్రాన్స్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన డిఫెండర్ విలియం సాలిబా గాయంతో మైదానం వీడాడు. ఫ్రాన్స్ జట్టును గట్టెక్కించడానికి హెడ్ కోచ్ డిడియర్ డెషాంప్స్ వ్యూహాత్మక మార్పులు చేశారు. అడ్రియన్ రాబియోట్ స్థానంలో మను కోనేను, బ్రాడ్లీ బార్కోలా స్థానంలో డెసిరె డౌను, అలాగే రాయన్ చెర్కిలను మైదానంలోకి దించినప్పటికీ ఫలితం లేకపోయింది. స్పెయిన్ గోల్‌కీపర్ ఉనై సిమన్ చేసిన అద్భుతమైన సేవ్స్, డిఫెండర్ మార్క్ కుకురెల్లా టాకిల్స్ ఫ్రాన్స్ ఆశలపై నీళ్లు చల్లాయి.

**ఓయార్జబాల్ అరుదైన రికార్డు**

ఓయార్జబాల్ తన ఫామ్‌ను మరోసారి చాటుకున్నాడు. స్పెయిన్ తరఫున గత20 మ్యాచ్‌ల్లో ఇది అతనికి 18వ గోల్. ఈ గోల్‌తో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో స్పెయిన్ తరఫున 30గోల్స్ మార్కు అందుకున్న ఆరో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో డేవిడ్ విల్లా (59), రావుల్ (44), ఫెర్నాండో టోరెస్ (38), అల్వారో మొరాటా (37), డేవిడ్ సిల్వా (35) వంటి దిగ్గజాల సరసన చేరాడు. ఈ విజయంతో స్పెయిన్ జట్టు అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వరుసగా 37 మ్యాచ్‌లు ఓటమి లేకుండా గెలుస్తూ వస్తోంది. దీంతో ఇటలీ పేరిట ఉన్న చారిత్రాత్మక రికార్డును సమం చేసింది. అలాగే ఫ్రాన్స్‌పై వరుసగా ఇది స్పెయిన్‌కు మూడో విజయం. స్పెయిన్ జట్టు ఈనెల 19న న్యూజెర్సీ స్టేడియంలో జరగబోయే ఫైనల్లో కప్ కోసం ఆడనుంది.

**ఇది మా స్థాయి ఆటకాదు: ఎంబాపె**

సెమీఫైనల్లో ఫ్రాన్స్ ఆటతీరుపై ఆ జట్టు స్టార్ ఆటగాడు క్లియాన్ ఎంబాపె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది తమ స్థాయి ఆట కాదని, అనుకున్నట్లుగా ఆడలేకపోయామన్నాడు. వ్యూహాలు, సాంకేతికంగానూ ఘోరంగా విఫలమయ్యామని వాపోయాడు. మిడ్‌ఫీల్డ్‌లో 3 ఆన్ 2వ్యూహంతో బరిలోకి దిగినా. అయితే, ఆటగాళ్ల మధ్య సమన్వయలోపంతో అనుకున్న ఫలితం సాధించలేకపోయినట్లు వెల్లడించాడు. స్టారర్ ఎంబాపె కూడా ఈ మ్యాచ్‌లో గోల్ చేయలేకపోయాడు.

## జపాన్ ఓపెన్‌లో పివి సింధుపైనే ఆశలు

## తొలి రౌండ్‌లోనే లక్ష్య, ఆయుష్, ఉన్నతి ఔట్

**టోక్యో, జూన్ 15:** జపాన్ ఓపెన్‌లో రెండో రోజు భారత్‌కు నిరాశాజనకంగా నిలిచింది. భారత షట్లర్లు లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా తొలి రౌండ్ ఓటమితో ఇంటిదారి పట్టారు. లక్ష్యసేన్ వరుస గేమ్‌ల్లో ఓడగా, యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా పోరాటపటిమను ప్రదర్శించి నప్పటికీ చివరికి ఓటమి పాలయ్యారు. ఆసియా ఛాంపియన్‌షిప్స్ ఫైనలిస్ట్ ఆయుష్ మూడు గేమ్ల పోరులో థాయిలాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్‌లావుత్ చేతిలో 19-21, 25-23, 15-21తో పరా జయం పొందాడు. ఈ పోరు ఏకంగా 82 నిమిషాలపాటు ఉత్కంఠగా కొనసాగింది. ఇక రెండుసార్లు ఒడిశా ఓపెన్ సూపర్ 100 ఛాంపియన్ ఉన్నతి 21-16, 16-21, 15-21 తేడాతో మరోసారి చైనీస్ తైపీ షట్లర్ హువాంగ్ యుహసున్ చేతిలో ఓడింది.

ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్స్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్... స్థానిక ఫేవరెట్ కోకి వతనాబే ముందు నిలవలేకపోయాడు. కేవలం 38 నిమిషాల్లోనే 16-21, 14-21 తేడాతో పరాజయం పొందాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టోలే జోడీ రూపంలో ఈ టోర్నీలో భారత్ సవాల్ మిగిలివుంది. రెండో రౌండ్‌లో సింధు ఐదో సీడ్ చైనా క్రీడాకారిణి హాన్ యూతో తలపడనుండగా... ధ్రువ్, తనిషాలు టాప్ సీడ్స్ ఫెంగ్ యాన్ జె, హువాంగ్ డాంగ్ పింగ్‌లతో పోటీపడతారు.











## గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ, ఎంబాపె

**టెక్సాస్, జులై 15:** ఫిఫా ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసే ఆటగాడికి ఇచ్చే గోల్డెన్ బూట్ రేసు ఆసక్తిగా మారింది. అర్జెంటీనాస్టార్ లియోనెల్ మెస్సీ, ఫ్రాన్స్ స్టార్ ఫార్వర్డ్ ఎంబాపె మధ్య పోరు నెలకొంది. సెమీస్‌లో గోల్ చేయడంలో విఫలమైనా... ఎంబాపె మాత్రం గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు. ప్రస్తుతం 8 గోల్స్, 3 అసిస్ట్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడి తర్వాత మెస్సీ (8 గోల్స్, 2 అసిస్ట్స్), ఇర్లింగ్ హాలాండ్ (7గోల్స్)ఉన్నారు. నార్వే ఇంటిముఖం పట్టడంతో ఇర్లింగ్ హాలాండ్ ఛాన్స్ కోల్పోయాడు. మెస్సీ... ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్‌లో గోల్ సాధిస్తే గోల్డెన్‌బూట్ రేసులో ముందుకొస్తాడు. అర్జెంటీనా సెమీస్ గెలిచినా, ఓడినా మెస్సీకి మరోమ్యాచ్ ఉంటుంది. ఫ్రాన్స్ మూడో స్థానం మ్యాచ్ నేపథ్యంలో.. ఎంబాపె కూడా గోల్డెన్ బూట్ కోసం పోటీలో ఉన్నట్లే. ఇక ఇంగ్లాండ్ సంచలనాలు హ్యారీ కానే, జూడ్ బెల్లింగ్హామ్ చెరో ఆరేసి గోల్స్‌తో తరువాతి స్థానాల్లో ఉన్నారు. అర్జెంటీనాతో పాటు గెలిస్తే ఫైనల్, లేదంటే థర్డ్ ప్లేస్ మ్యాచ్ రూపంలో రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఈ ఇద్దరూ మెరుగ్గా గోల్స్ సాధిస్తే మెస్సీ, ఎంబాపెను వెనక్కి నెట్టే అవకాశం ఉంది.

## జోరు మీదున్న టీమిండియా కెప్టెన్ గిల్

**దుబాయ్, జులై 15:** టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జోరు మీదున్నాడు. అన్ని ఫార్మాట్లలో పరుగుల వరద పారిస్తున్నాడు. ఐపీఎల్ ప్లే ఆఫ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై సెంచరీ (104) సాధించిన శుబ్ మన్ గిల్... ఆఫ్ఘనిస్తాన్‌పై ఏకైక టెస్ట్‌లో 126పరుగులతో అదరగొట్టాడు. ఇక రెండు వన్డేల్లోనూ వరుసగా 84 నాటౌట్, 154 రన్స్ సాధించాడు. ఇక ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలోనూ 80నాటౌట్‌తో నిలిచి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. మొత్తంగా బ్యాట్‌కు పనిచెబుతూ శుభ్‌మన్ గిల్ ప్రత్యర్థి బౌలర్ల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాడు.

తాజాగా ఐసీసీ విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లోనూ భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రేటింగ్ పాయింట్లు పెంచుకుని ప్రపంచ నంబర్ వన్ స్థానానికి మరింత చేరువయ్యాడు. తొలి వన్డేలో 80 పరుగులు చేసిన గిల్‌కు 12 రేటింగ్ పాయింట్లు లభించాయి. ప్రస్తుతం అతను ప్రపంచ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

అగ్రస్థానంలో ఉన్న డారిల్ మిచెల్‌ను (814) అధిగమించేందుకు గిల్‌కు (803) ఇంకా 12 రేటింగ్ పాయింట్లు మాత్రమే అవసరం. మరో మంచి ఇన్నింగ్స్ ఆడితే మిచెల్‌ను వెనక్కినెట్టి నెంబర్ వన్ ర్యాంకు సొంతమవుతుంది. తొలి వన్డేలో విఫలమైనప్పటికీ భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి (3వ స్థానం), రోహిత్ శర్మ (4వ స్థానం) తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.

అజేయ అర్ధశతకం సాధించిన వాషింగ్టన్ సుందర్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 73వ స్థానానికి చేరుకున్నాడు. అలాగే తొలి వన్డేలో అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్ల జాబితాలో టాప్-10లోకి ప్రవేశించాడు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఆటగాళ్లకు కూడా మెరుగైన ర్యాంకులు దక్కాయి. ఇంగ్లండ్ తరఫున తొలి వన్డేలో 76 పరుగులు చేసిన జో రూట్ 12వ స్థానానికి చేరుకున్నాడు.

### వన్డేల్లో నంబర్ వన్ దిశగా




# స్వల్పలాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, జులై15:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం ప్రారంభంలో బలమైన ర్యాలీ నమోదు చేసినప్పటికీ, చివర్లో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రోజువారీ గరిష్ఠ స్థాయిల నుంచి లాభాలు తగ్గాయి. ఐబీఎం నిరాశపరిచే భవిష్యత్ మార్గదర్శకాలను ప్రకటించడంతో ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 86 డాలర్ల సమీపంలో కొనసాగుతుండటంతో ప్రపంచ ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 130.49 పాయింట్లు పెరిగి 77,185.43వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 26.45పాయింట్లు లాభపడి 24,078.50 వద్ద స్థిరపడింది. గత మూడు వరుస ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1.38 శాతం, సెన్సెక్స్ 1.45 శాతం మేర నష్టపోయాయి. ఎటర్నల్ -2.80శాతం లాభం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్-0.69శాతం పెరిగితే ఐసీఐసీఐ బ్యాంక్-0.24 శాతం లాభం బీఎస్ ఈ మిడ్‌క్యాప్150 సూచీ 0.55 శాతం, స్మాల్‌క్యాప్250 సూచీ 0.69 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్‌లో మొత్తం 2,297 షేర్లు లాభపడగా, 1,974 షేర్లు నష్టపోయాయి. 178 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.1600 తో పోలిస్తే 96.3200 వద్ద ట్రేడైంది.

ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.64 శాతం తగ్గి రూ.1,41,301 వద్దకు చేరాయి. సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 89 సెంట్లు (1.05 శాతం) పెరిగి 85.62 డాలర్లకు చేరింది. ఐపీఓలో లిస్టైన కుసుమ్‌గర్‌కు భారీ ప్రీమియంకుసుమ్‌గర్ షేరు బీఎస్ఈలో తొలి ట్రేడింగ్ రోజున ఇష్యూ ధర 419తో పోలిస్తే 44.26 శాతం ప్రీమియంతో రూ.604.45 వద్ద ముగిసింది. ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ 6.50శాతం ఎగిసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నికర లాభం 29.57 శాతం పెరిగి రూ.5,332.30 కోట్లకు చేరడంతో షేరు 0.96 శాతం లాభపడింది. బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్, తొలి త్రైమాసికంలో నికర లాభం త్రైమాసిక ప్రాతిపదికన 7.1 శాతం, వార్షిక ప్రాతిపదికన 94.28 శాతం పెరిగి రూ.735 కోట్లకు చేరడంతో షేరు 6.46 శాతం ఎగిసింది. ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 7.52శాతం లాభపడింది. స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ - 5.81 శాతం పెరిగింది. ఆదిత్య బిర్లా మనీ 8.82 శాతం, గోవా కార్బన్ 7.59 శాతం, టాటా ఎఎల్‌సి 4.44 శాతం, డెన్ నెట్‌వర్క్స్ 4.42 శాతం, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ 4.34 శాతం, బెనారస్ హోటల్స్ 1.05 శాతం నష్టపోయాయి. ఐపిఒల పరంగా ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు మంచి స్పందన లభించింది. బుధవారం సాయంత్రం 4.30 గంటల వరకు 12.45 కోట్ల షేర్ల ఆఫర్‌కు 33.44 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ ఇష్యూ 2.69 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. షేరు ధర రూ.545-574గా నిర్ణయించారు. ఆల్పైన్ టెక్స్‌వర్క్స్ ఐపీఓకు బుధవారం సాయంత్రం వరకు 1.20 కోట్ల షేర్ల ఆఫర్‌కు వ్యతిరేకంగా 94.92 లక్షల షేర్లకు బిడ్లు రావడంతో 0.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఈ ఐపీఓ కూడా ధరలు ఒక్కో షేరుకు రూ.100-105గా నిర్ణయించారు.




# అమల్లోకి భారత్ - బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**న్యూఢిల్లీ, జులై 15:** భారత్‌బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కానుండగా, వివిధ రంగాలపై భిన్నమైన ప్రభావం పడనుంది. భారతీయ ఎగుమతులకు బ్రిటన్ మార్కెట్లో భారీ ప్రోత్సాహం లభించగా, బ్రిటన్‌కు చెందిన పలు ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించింది. భారతదేశం నుంచి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే దాదాపు 99 శాతం ఉత్పత్తులకు సుంక రహిత ప్రవేశం లభించనుంది. మరోవైపు బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చే పలు ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించారు.

భారత శ్రామిక ఆధారిత రంగాలకు పెద్ద ఊతంఈ ఒప్పందంతో రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్డ్ ఫుడ్, ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, చేపలు, మాంస ఉత్పత్తులు వంటి శ్రామిక ఆధారిత రంగాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటివరకు 4 శాతం నుంచి 16 శాతం వరకు ఉన్న బ్రిటన్ దిగుమతి సుంకాలు పూర్తిగా తొలగించబడటంతో ఈ ఉత్పత్తులు ఇకపై సుంకం లేకుండా బ్రిటన్ మార్కెట్లోకి ప్రవేశించనున్నాయి. ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు, సిరామిక్స్, గాజు, రాయి, సిమెంట్ ఉత్పత్తుల ఎగుమతులకు కూడా మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించనున్నాయి. భారత్‌లో తయారయ్యే ఎలక్ట్రిక్, హైబ్రిడ్, హైడ్రోజన్ ఆధారిత ప్రయాణికుల వాహనాలకు బ్రిటన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. నిర్ణయించిన కోటా పరిధిలో ఎగుమతి అయ్యే ఈ వాహనాలు ప్రస్తుతం అమల్లో ఉన్న 10 శాతం సుంకం లేకుండా బ్రిటన్‌లోకి ప్రవేశించనున్నాయి. కొన్ని ఉత్పత్తులకు సుంక రాయితీ వర్తించదుతాజా ఆపిల్స్, వాల్‌నట్స్, వే ప్రొడక్ట్స్, బ్లూవెయిన్ చీజ్, ఎంపిక చేసిన విత్తన రకాలు, బంగారు బార్లు, స్మార్ట్‌ఫోన్లు వంటి సున్నితమైన ఉత్పత్తులను భారత్ సుంక రాయితీల నుంచి మినహాయించింది.

స్కాచ్ విస్కీ, బోర్బన్, రమ్, జిన్, వోడ్కా, బ్రాండీ, టెకిలా, సాకే, సైడర్, మీడ్, లిక్కర్స్ వంటి ప్రీమియం మద్యపాన ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గింపు ఉంటుంది. స్కాచ్ విస్కీపై ప్రస్తుతం ఉన్న 150 శాతం దిగుమతి సుంకాన్ని దశలవారీగా 40 శాతానికి తగ్గించనున్నారు. ఆటోమొబైల్ రంగంలో నిర్ణీత కోటా మేరకు దిగుమతి అయ్యే వాహనాలపై 100 శాతం సుంకాన్ని 10 శాతానికి తగ్గించనున్నారు. సౌందర్య ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న 22 శాతం వరకు సుంకాలను ఒప్పందం అమలైన తొలి రోజు నుంచే లేదా గరిష్ఠంగా 10 సంవత్సరాల వ్యవధిలో పూర్తిగా తొలగించనున్నట్లు ఇరు దేశాలు వెల్లడించాయి.

## హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ లాభం 611 కోట్లు




**ముంబై, జులై 15:** ప్రైవేట్ జీవిత బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తొలిత్రైమాసికంలో నికరలాభం వార్షిక ప్రాతిపదికన 11.5శాతంపెరిగిరూ.611 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.548 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కంపెనీ నెట్ ప్రీమియం ఆదాయం కూడా 15.1 శాతం పెరిగి రూ.14,539 కోట్ల నుంచి రూ.16,728 కోట్లకు చేరుకుంది. ఇది బీమా వ్యాపారంలో స్థిరమైన వృద్ధిని ప్రతిబింబిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. పాలసీదారుల కొనసాగింపు పరంగా కూడా కంపెనీ మిశ్రమ ఫలితాలను నమోదు చేసింది. 61 నెలల పర్సిస్టెన్సీ నిష్పత్తి గత ఏడాది 61 శాతం నుంచి 65.5 శాతానికి మెరుగుపడగా, 13 నెలల పర్సిస్టెన్సీ నిష్పత్తి మాత్రం 82.7 శాతం నుంచి 80 శాతానికి తగ్గింది. కంపెనీ సాల్వెన్సీ నిష్పత్తి గత ఏడాది 192 శాతం నుంచి ఈసారి 185 శాతానికి తగ్గినప్పటికీ, గత త్రైమాసికంలోని 177 శాతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడింది. నియంత్రణ సంస్థ నిర్దేశించిన కనిష్ఠ స్థాయికంటే ఇది ఎంతో ఎక్కువగా ఉందని కంపెనీ పేర్కొంది. దేశ ఆర్థిక పరిస్థితులు తమ వ్యాపారానికి అనుకూలంగా ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభదాయకమైన కస్టమర్ సమీకరణ పైనే ప్రధాన దృష్టి సారిస్తామని కంపెనీ స్పష్టం చేసింది. వాల్యూ ఆఫ్ న్యూ బిజినెస్ మార్జిన్లు వచ్చే కొన్ని త్రైమాసికాల్లో ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉందని యాజమాన్యం తెలిపింది. అయితే వ్యాపార పరిమాణం పెరగడం, ఉత్పత్తుల మిశ్రమంలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల దీర్ఘకాలంలో మార్జిన్లు మెరుగుపడతాయని పేర్కొంది. 202627 ఆర్థిక సంవత్సరంలో మార్జిన్ల కంటే వ్యాపార విస్తరణకే అధిక ప్రాధాన్యం ఇస్తామని కంపెనీ వెల్లడించింది. నికరలాభం రూ.548 కోట్ల నుంచి 611 కోట్లకు పెరిగితే నెట్ ప్రీమియం ఆదాయం రూ.14,539 కోట్ల నుంచి రూ.16,728 కోట్లకు చేరింది.




## సెబీ బోర్డు సభ్యులకు కఠిన నియమావళి

**ముంబయి, జులై 15:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) తన బోర్డు సభ్యుల కోసం సమగ్ర ప్రవర్తనా నియమావళిని ఆమోదించింది. ఈ కొత్త నియమావళిలో ప్రయోజనాల సంఘర్షణ (కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్) నివారణకు కఠిన నిబంధనలు, పూర్తిస్థాయి సభ్యుల ప్రత్యక్షషేర్ పెట్టుబడులపై ఆంక్షలు, ఆస్తులు-బాధ్యతల వెల్లడిపై మరింత పారదర్శకత, పదవీ విరమణ అనంతర పరిమితులు వంటి అంశాలను చేర్చింది. మార్కెట్ నియంత్రణ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని సెబీ తెలిపింది. కొత్త నిబంధనల ప్రకారం సెబీ ఛైర్‌పర్సన్‌తో పాటు హోల్‌టైమ్ సభ్యులు తమ పదవీకాలంలో వ్యక్తిగత ఈక్విటీ షేర్లు, ఈక్విటీగా మారే ఆర్థిక సాధనాలు, ఈక్విటీ మరియు కమోడిటీ డెరివేటివ్‌లలో కొత్త పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి ఉండదు. అయితే మ్యూచువల్ ఫండ్లు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు వంటి నిపుణుల నిర్వహణలో ఉండే సమిష్టి పెట్టుబడి సాధనాల్లో మాత్రం పెట్టుబడులు కొనసాగించవచ్చు. బోర్డులో చేరే సమయానికి ఇప్పటికే నిషేధిత పెట్టుబడులు కలిగి ఉన్న హోల్‌టైమ్ సభ్యులు వాటిని విక్రయించడం, పదవీకాలం ముగిసే వరకు నిలిపివేయడం (ఫ్రీజ్ చేయడం) లేదా సెబీ ఆమోదించిన విధానంలో వాటిని బదిలీ చేయడం తప్పనిసరి. అలాగే ఫ్రీజ్ చేసిన ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించిన ఓటింగ్ హక్కులను వినియోగించుకునే అవకాశం కూడా ఉండదు.

కొత్త కోడ్ ప్రకారం బోర్డు సభ్యులు తమ కుటుంబ సంబంధాలు, ఆర్థిక పెట్టుబడులు, అప్పులు, స్థిరాస్తులు, వృత్తిపరమైన ప్రయోజనాలు, అద్దె ఒప్పందాలు తదితర వివరాలను సమగ్రంగా వెల్లడించాల్సి ఉంటుంది.

## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో హెచ్‌పిసిఎల్ సిలిండర్లు



**ముంబయి, జులై 15:** క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, హెచ్‌పిసిఎల్‌తో జతకట్టి దేశంలోనే మొదటిసారిగా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిత్యావసర ఎల్‌పీజీ గ్యాస్‌సిలిండర్లను ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే డెలివరీ చేసే సేవలను బుధవారం ప్రారంభించింది. ప్రస్తుతం తొలి దశలో భాగంగా ఈ సేవలను కర్ణాటక రాజధాని బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవడానికి ఉండే నిబంధనలవలే కాకుండా, ఈ యాప్ ద్వారా ఆర్డర్ చేయడానికి వినియోగదారులకు ముందస్తుగా ఎలాంటి డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్ ఉండాల్సిన అవసరం లేదు. ఈటైఅప్‌లో భాగంగా హెచ్‌పీసీఎల్ తన సరికొత్త 10 కిలోల హెచ్‌పీ నవ్య కాంపోజిట్ సిలిండర్లను వాణిజ్యపరంగా మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ సిలిండర్ల ప్రత్యేకత ఏంటంటే, ఇవి పారదర్శకంగా (ట్రాన్స్‌లూసెంట్) ఉండి, సిలిండర్‌లో ఎంత గ్యాస్ మిగిలి ఉందో బయటి నుంచే స్పష్టంగా చూసుకోవచ్చు. వీటితో పాటు సాధారణ 5 కిలోల మెటల్ సిలిండర్లు కూడా ఇన్‌స్టామార్ట్ యాప్‌లో లభిస్తాయి. ఇన్‌స్టామార్ట్ కేవలం నిత్యావసర సరుకులకే పరిమితం కాకుండా, గ్యాస్ సిలిండర్ల వంటి అత్యవసర గృహ అవసరాలను కూడా సురక్షితంగా, నమ్మకంగా ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గ్యాస్ సిలిండర్ల రవాణాలో భద్రత అత్యంత కీలకమైన అంశం కాబట్టి, వీటి డెలివరీ బాధ్యతలను స్విగ్గీ సాధారణ డెలివరీ బాయ్స్‌కు కాకుండా, హెచ్‌పీసీఎల్ అధికారిక గుర్తింపు పొందిన పంపిణీదారుల (డిస్ట్రిబ్యూటర్స్) నెట్‌వర్క్‌కు అప్పగించారు. యాప్‌లో వచ్చే ఆర్డర్లను స్థానిక హెచ్‌పీసీఎల్ డిస్ట్రిబ్యూటర్లకు బదిలీ చేస్తారు. వారు తమ శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా మాత్రమే వినియోగదారుల ఇళ్లకు సిలిండర్లను సురక్షితంగా చేరవేస్తారు. మొదటిసారి ఆర్డర్ చేసే వారికి కొత్త గ్యాస్ కనెక్షన్‌గా పరిగణించి గుర్తింపు కార్డులను , నివాస ధృవీకరణ పత్రాలను సేకరిస్తారు.




## హెచ్‌డిపి ఫైనాన్షియల్ లాభం 735కోట్లు

**న్యూఢిల్లీ, జులై 15:** హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. రుణాల వృద్ధి, రుణాల పంపిణీ పెరగడం, ప్రధాన రుణ వ్యాపారంలో స్థిరమైన వృద్ధి కారణంగా కంపెనీ నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 38శాతం పెరిగింది. త్రైమాసికంలో రుణాలపై బలమైన డిమాండ్‌తో పాటు కార్యకలాపాల్లో స్థిరమైన పురోగతి కనిపించినట్లు కంపెనీ వెల్లడించింది. త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.735 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.532 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం ఆదాయం దాదాపు రూ.5,000 కోట్లకు పెరిగింది. రుణాల పోర్ట్‌ఫోలియోలో అన్ని విభాగాల్లో కొనసాగుతున్న డిమాండ్, వ్యాపార విస్తరణ ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. త్రైమాసికంలో రుణాల పంపిణీ వార్షిక ప్రాతిపదికన 16.2 శాతం పెరిగి రూ.17,629 కోట్లకు చేరుకుంది. అలాగే కంపెనీ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 32.4 శాతం పెరిగి రూ.1.09 లక్షల కోట్లకు చేరింది. కంపెనీ స్థూల రుణాల (గ్రాస్ లోన్స్) పరిమాణం రూ.1.14 లక్షల కోట్లకు పెరిగి, గత ఏడాదితో పోలిస్తే 17.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. పోటీ తీవ్రంగా ఉన్న రుణ మార్కెట్‌లోనూ కంపెనీ స్థిరమైన విస్తరణను కొనసాగించినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఆస్తుల నాణ్యత కూడా దాదాపు స్థిరంగానే కొనసాగింది. జూన్ చివరి నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.58 శాతంగా నమోదైంది. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.05 శాతంగా గత ఏడాదితో దాదాపు సమానంగా ఉంది. ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం వార్షిక ప్రాతిపదికన 20.5శాతం పెరిగి రూ.1,420 కోట్లకు చేరుకుంది. సవాళ్లు ఉన్నప్పటికీ సంస్థ కార్యకలాపాలు సానుకూల దిశలో కొనసాగుతున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఫలాహారమే ఆరోగ్య ముచ్చట !



సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం ఎంత అవసరమో తెలియ చెప్పే ఎన్నో అధ్యయనాలు తెలుసుకుంటున్నాం. ప్రధానంగా మధుమేహం మంటే చక్కెరకు దూరంగా ఉం'టే' సరిపోతుందా? అందే కాదు. ఐనా తీపి పదార్థాలు తగ్గిస్తే ప్రమాదం తగ్గుతుందని అనుకోవడం కద్దు. సమస్య కేవలం ఏం తింటున్నామన్న దాంట్లోనే కాదు.. ఏం తినడం లేదన్న దాంట్లోనూ ఉందన్న విషయాన్ని కొన్ని అధ్యయనాలు తేటతెల్లం చేసున్నాయి. ముఖ్యంగా భారత్‌లాంటి దేశాల్లో పండ్లను తగినంతగా తీసుకోకపోవడం టైప్ 2 డయాబెటిస్ భారాన్ని మరింత పెంచుతోందని పరిశోధకులు వెల్లడించారు. ప్రపంచంలో మధుమేహంతో జీవిస్తున్న వారిలో 60 శాతానికి పైగా ఆసియాలోనే ఉన్నారని తెలిసింది. భారత్‌లోనే దాదాపు 7.7 కోట్ల మంది టైప్2 మధుమేహంతో బాధపడుతుండగా, మరో 2.5 కోట్ల మంది ప్రీడయాబెటిస్ దశలో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఈ పరిస్థితుల్లో మధుమేహాన్ని అరికట్టాలంటే చక్కెర తగ్గించడమే కాకుండా రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు. భారత్‌తో పాటు దక్షి ణాసియాలో మాత్రం పండ్ల వినియోగం పెంచడంపైనే ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు.ప్రపంచంలో పండ్లను తగినంతగా తినకపోవడం వల్లనే 85,960 మరణాలకు కారణమైనట్లు అధ్యయనం వెల్లడించింది. పండ్లలో ఉండే పీచు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు శరీర జీవక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపింది. ఇవి ఇన్సులిన్ స్పందనను మెరుగుపరచడంతో పాటు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో కూడా పండ్లలోని పోషకాలు చురుగాపనిచేస్తాయని వివరించింది. ఆగ్నేయాసియాలో తృణ ధాన్యాలు తక్కువగా తీసుకోవడం ప్రధాన సమస్యగా ఉండగా, తూర్పు ఆసియాలో మాంసం అధికంగా తినడం ఎక్కువ ప్రభావం చూపుతోంది. అధిక ఆదాయ ఆసియా, పసిఫిక్ దేశాల్లో ప్రాసెస్డ్ మాంసం ప్రధాన ప్రమాద కారకంగా గుర్తించారు. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ 2023 విశ్లేషణలో భారత్‌తో పాటు దక్షి ణాసియాలో టైప్2 మధుమేహానికి ప్రధాన ఆహార సంబంధిత ప్రమాద కారకం పండ్లను తక్కువగా తీసుకోవడమేనని తేలింది. చక్కెర, ప్రాసెస్డ్ ఆహారం గురించే ఎక్కువగా చర్చ జరుగు తున్న సమయంలో ఈ అధ్యయనం దృష్టిని మరో కీలక అంశంపైకి మళ్లించింది. ఆరోగ్యకర మైన ఆహారాన్ని పెంచడం కూడా మధుమేహ నియంత్రణలో అంతే ముఖ్యమని స్పష్టం చేసింది.1990 నుంచి 2023 వరకు ఆసియాలోని 34 దేశాల సమాచారాన్ని పరిశీలించి ఈ అధ్యయనం నిర్వహించారు. ఆహార అలవాట్లు మధుమేహంపై ఎంతటి ప్రభావం చూపుతున్నాయో ఈ గణాంకాల ద్వారా తెలుసుకోవడమే కాదు పండ్లు, తృణధాన్యాల వినియోగం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం దిశగా తమ ఆహార వినియోగంలో

**చిట్కా**
: గోరువెచ్చని నీటిలో అరచెక్క నిమ్మరసము కలిపి పుక్కిలిస్తే నోటి దుర్వాసన రాదు. □

## దత్తాత్రేయుడు



దత్తాత్రేయుని రూపం అపురూపమైంది. అది సచ్చిదానంద రూపం. జడలు కట్టడం, పులిచర్మాన్ని ధరించటం వైరాగ్యం, తపస్సు, ధ్యానాలకు గుర్తు, భూమాతకు, ధర్మానికి ప్రతీక అయిన గోవు ఆయనను వెన్నంటే ఉంటుంది. అటే దత్తాత్రేయుడు ధర్మరక్షకుడని, గోరక్షకుడని తేటతెల్లమవుతుంది. వారి వెంట ఉండే నాలుగు శునాకాలు చతర్వేదాలకు నిదర్శనం.అలాగే స్వామి భస్మధారణ నిరాడంబరత్వానికి, అక్షమాల జప ప్రాధాన్యానికి చిహ్నాలు. అందుకే ఆ దివ్యమూర్తిని మన మహర్షులు, భక్తులు. సకల ధర్మాలూ అడుగంటిపోయి, ఏం చేయాలో తెలియని అయోమయ స్థితి ఆవరించిన కలి యుగంలో దత్తాత్రేయుని ఆశ్రయించి శరణు వేడటమే కర్తవ్యమని గ్రహిస్తారు. పురాణ కథను అనుసరించి ఒకసారి చతుర్ముఖ బ్రహ్మ వేదాలను మర్చిపోతే దత్తాత్రేయుడే ఆయనకు వేదదానం చేశాడు. మరొకప్పుడు జంభాసురుడనే రాక్షసుడి బాధ నుంచి దేవతలను ఆ స్వామే రక్షించాడు. కార్త వీర్యార్జునుడు దత్తుడి కోసం తపస్సు చేసి వెయ్యి చేతులు, నిత్యయౌవనం వరాలుగా పొందాడు. అదే విధంగా ప్రహ్లాదుడికి ముని రూపంలో ప్రత్యక్షమై ఆత్మజ్ఞానాన్ని బోధించాడు. ఇలా అనంత కరుణా సముద్రడై భక్తులకు జ్ఞానం, ఆనందం ప్రసాదించిందే దత్తాత్రేయ అవతారం. అందుకే అన్నమయ్య కూడా తిరుమల కొండపై ఏడుకొండల స్వామిలో దత్తాత్రేయుని దర్శించుకుని కీర్తనలతో స్తుతించాడు. దత్తాత్రేయుని రెండో అవతారం శ్రీనరసింహ సరస్వతి. అంబ అనే భక్తురాలికి కుమారుడిగా ఆవిర్భవించిన రూపమిది. ఆ మహాను భావుడి మూడో అవతారం మాణిక్‌ప్రభు. దత్తుడి మరో రెండు అవతారాలు అక్కల్‌కోట మహారాజు, శిరిడీ సాయిబాబా.ఈ రెండు అవతారాల నుంచే దత్తావతారులు అవధూత మార్గాన్ని అనుసరించటం ఆరంభ మైంది. అవధూత అంటే శరీరం మీద ఆచ్ఛాదనతో సహా లౌకిక బంధాలన్నీ వదిలిన సన్యాసి. అందుకే వీరి తల్లి దండ్రుల వివరాలు, పుట్టిన తేదీ, ప్రదేశం తదితర వివరాలు అలభ్యం. ఇది దత్తాత్రేయస్వామి అవతార లీల. □

## 'అరటి' కాయ కబాబ్

**కావలసిన పదార్థాలు**
అరటికాయ: ఒకటి, శనగపప్పు: అరకప్పు, చాట్ మసాలా: చిటికెడు, ఆమ్‌చూర్: చిటికెడు, కొత్తిమీర: కొద్దిగా, ధనియాల పొడి: అర టీస్పూన్, జీలకర్ర పొడి: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కారం: పావు టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా, ఉప్పు: తగినంత

**తయారీ విధానం:** ముందుగా, అరటికాయను ఉడికించి తొక్క తీసి, ఒక గిన్నెలో వేసి చేత్తో మెదిపి ఉంచాలి. ఉడికించిన శనగపప్పును కూడా మెత్తగా మెదిపి అందులో వేయాలి. సన్నగా తరిగిన కొత్తిమీర, చాట్ మసాలా, ఆమ్‌చూర్, గరం మసాలా, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం తో చిన్న చిన్న ఉండలు చేసుకుని.. పొడవుగా కానీ, వెడల్పుగా కానీ వత్తుకుని వేడి నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకుంటే అరటికాయ కబాబ్ రెడీ. వీటిని టమాటా సాస్, పుదీనా చట్నీతో సర్వ్ చేసుకోవాలి. □



## వ్యథ: ఆలయాలు మాస్ కౌన్సెలింగ్ కేంద్రాలు !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న:** మా అక్క గత ఆరు నెలలుగా దిగులుతో బాధపడుతోంది. మా బావ చేస్తున్న వ్యాపారాల్లో నష్టం రావడంతో పాటు అప్పుల సమస్య కూడా ఉంది. దీంతో ఆకలి తగ్గింది, నిద్ర సరిగా పట్టడం లేదు. కోపం, చిరాకు కూడా ఎక్కువయ్యాయి. సైకాలజిస్టు వద్ద కౌన్సెలింగ్ తీసుకుంటే మంచిదని చెప్పాను. కానీ నా మాట వినకుండా మా పురోహితుడి సూచన మేరకు 40 రోజులు శివాలయంలో ప్రదక్షి ణలు చేయడానికి సిద్ధమైంది. ఈ పరిస్థితిలో ఆమెను ఎలా ఒప్పించాలి? - **లావణ్య, బెంగళూరు**

**జవాబు:** అమ్మా, ఆలయాలు అనేక మందికి మానసిక ప్రశాంతత, భావోద్వేగ మద్దతు, ఆత్మస్థైర్యాన్ని అందించే ఆధ్యాత్మిక వేదికలు. అందుకే వాటిని రూపకంగా 'మాస్ కౌన్సెలింగ్ కేంద్రాలు' అని పేర్కొనవచ్చు. కోట్లాది మంది ప్రజలు జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, బాధలు, నుంచి ఉపశమనం పొందడానికి ఆలయాలను ఆశ్రయిస్తుంటారు. కౌన్సెలింగ్ సైకాలజీ దృష్టిలో చూస్తే, వ్యక్తి తన బాధలను వ్యక్తపరచడం, తనకంటే ఉన్నతమైన శక్తిపై విశ్వాసం ఉంచడం, ఆశావహ దృక్పథాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఆలయాల్లోని ప్రశాంత వాతావరణం, ప్రార్థన, ధ్యానం, భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు మనసును స్థిమిత పరచడంలో సానుకూల ప్రభావం చూపుతాయి. అనేక శాస్త్రీయ అధ్యయనాలు ధ్యానం, ప్రార్థన వంటి ఆధ్యాత్మిక సాధనలు ఒత్తిడి హార్మోన్ కార్టిసోల్ స్థాయిని తగ్గించడంలో, ఆందోళనను నియంత్రించడంలో, భావోద్వేగ సమతుల్యతను పెంపొందించడంలో తోడ్పడతాయని సూచిస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో కొంత సమయం గడపడం వల్ల గుండె స్పందన, రక్తపోటు వంటి శారీరక సూచికలపై కూడా అనుకూల ప్రభావం కనిపించవచ్చు. ఆలయానికి వచ్చిన వ్యక్తి తన బాధలో తాను ఒంటరివాడిని కాదనే భావనను పొందుతాడు. తనలాంటి సమస్యలతో వచ్చిన మరెందరో భక్తులను చూడటం ద్వారా ఆశ, ధైర్యం పెరుగుతాయి. దీనినే సైకాలజీలో సామాజిక మద్దతు ప్రభావంగా పేర్కొంటారు. అయితే, డిప్రెషన్, తీవ్రమైన ఆందోళన, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రేనియా వంటి మానసిక రుగ్మతలకు కేవలం పూజలు లేదా ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే సరిపోవు. ఇటువంటి పరిస్థితుల్లో సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్, అవసరమైతే సైకియాట్రిస్ట్ ద్వారా వైద్య చికిత్స తప్పనిసరి. ఆలయాలు, పూజలు వాటికి ప్రత్యామ్నాయం కావు.మీ అక్క ప్రస్తుతం మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. శివాలయానికి వెళ్లడం వల్ల ఆమెకు ప్రశాంతత, ధైర్యం లభిస్తే దాన్ని నిరుత్సాహపరచాల్సిన అవసరం లేదు. అయితే ఆకలి లేకపోవడం, నిద్రలేమి, నిరంతర దిగులు, చిరాకు వంటి లక్షణాలు కొనసాగితే సున్నితంగా ఆమెను సైకాలజిస్టు వద్ద కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లండి. అవసరమైతే సైకియాట్రిస్ట్‌ను కూడా సంప్రదించాలి. ఆధ్యాత్మికత,కౌన్సెలింగ్, వైద్య చికిత్స పరస్పర విరుద్ధమైనవి కావు. అవసరాన్ని బట్టి ఈ మూడు కలిసి పనిచేస్తే వ్యక్తి మరింత మెరుగైన మానసిక ఆరోగ్యాన్ని పొందగలరు. □



## 'అటామిక్ అలవాట్లు'

కోపం తెచ్చుకోకుండా ఉండేం దుకు ప్రయత్నించాలి. ఇలా చెప్పుకంటూ పోవాలే కానీ ఎన్నెన్ని అలవాట్లు మన జీవనశైలిలో భాగం చేసుకోవాలని ఆలోచిస్తామో.. వీటిల్లో మొదలు పెట్టకుండా వదిలేసేవి కొన్నైతే.. ఒకటి రెండు రోజులు చేసి వదిలేసేవి మరికొన్ని. మీరే కాదు దాదాపు సగానికి పైగా మహిళలు, అమ్మాయిల పరిస్థితి ఇదే. దీనికి పరిష్కారంగానే 'అటామిక్ అలవాట్ల' పద్ధతిని ఫాలో అవుతాం అంటున్నారు ఈ తరం అమ్మాయిలు. అంటే, పరమాణువులు ఎంత చిన్నగా ఉంటాయో, మనం ప్రయత్నించే అలవాట్లు కూడా అంతే చిన్నగా ఉండాలనేదే దీని ఉద్దేశం. ఉదాహరణకు వాకింగ్ రోజులో ఒక్కసారైనా వాకింగ్ చేయాలి, నిద్రపోయే ముందు పుస్తకం చదవాలి. ప్రశాంతంగా వంట చేయాలి. చేయాలన్నదే మీ లక్ష్యం అయితే.. 10–15 నిమిషాల పాటు, కనీం వారం రోజులైనా చేయాలి. క్రమేణా అదో అలవాటుగా మారి, నడక మీ జీవితంలో భాగంగా మారుతుంది. అలానే పుస్తకం చదవాలి అనుకుంటే కనీసం 1 లేదా 2 పేజీల్ని చదవడం లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇలానే ప్రతిదీ చిన్నగా మొదలుపెడితే క్రమేణా పెద్ద పెద్ద మార్పులూ, మంచి అలవాట్లూ మీ జీవితంలో భాగం అవుతాయి. ప్రయత్నించి చూడండి మరి! □



## 'జననాయగన్' 23న విడుదల



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటిస్తున్న ఆఖరి చిత్రం (కెవిఎన్ 69) విడుదల తేదీ ఎట్టకేలకు అధికారికంగా ఖరారైంది. ఎన్నో వాయిదాలు, సెన్సార్ వివాదాల తర్వాత ఈ చిత్రానికి జననాయగన్ (తెలుగులో జననాయకుడు, హిందీలో జన్ నేత) అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ KVN ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. విజయ్ రాజకీయా ల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించి, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ ఇప్పటికే 'A' సర్టిఫికేట్ జారీ చేసింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో జులై 23న విడుదల కాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# తెర

## 'వదలా' ప్రీ రిలీజ్ ఈవెంట్



ప్రేక్షకులు మా చిత్రాన్ని వదలకుండా చూసి ఎంకరేజ్ చేస్తారని ఆశిస్తున్నాను 'వదలా' పీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో జగపతి బాబు..చరిత చిత్ర బ్యానర్ మీద కిషోర్ నాయుడు చిరు మామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'వదలా' జగపతి బాబు, లయ, హృతిక శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో ఆకెళ్ల వి కృష్ణ ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ మూవీని జులై 17న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ..అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. .. తెలుగు ఇండస్ట్రీలోకి నిర్మాతగా వస్తున్న కిషోర్‌కి థాంక్స్. 'వదలా' చిత్రంతో నిర్మాత కిషోర్‌కి మంచి విజయం దక్కాలి. తమ్మారెడ్డి, జగపతి బాబు గారి మీదున్న ప్రేమ, గౌరవంతో ఇక్కడకు వచ్చాను. 'వదలా' ట్రైలర్ నాకు చాలా నచ్చింది. కాన్సెప్ట్, కథ చాలా కొత్తగా అనిపించింది. పాటలు నాకు చాలా నచ్చాయి. జగపతిబాబు మాట్లాడుతూ.. 'వదలా' లాంటి థ్రిల్లర్ మూవీని చేయడం ఆనందంగా ఉంది. ఇదొక ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్. ఈ మూవీలో విషయం ఉంది, కంటెంట్ ఉంది అని నమ్మాను. అందుకే ప్రతీ విషయంలో నేను జాగ్రత్తగా తీసుకున్నాను. ఈ 'వదలా'చిత్రాన్ని వదలకుండా నాకోసం చూడండి. నిర్మాత తమ్మారెండ్డి భరద్వాజ్‌మాట్లాడుతూ..సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి యాభై ఏళ్లు అవుతోంది. ఓ పదేళ్ల క్రితం వైరాగ్యంతో సినీ సన్యాసం తీస ుకుంటే.. కిశోర్ మాత్రం 'వదలా'అనే సినిమా నిర్మించాల్సిందే అని పట్టుపట్టారు. అని అన్నారు.నిర్మాత కిషోర్ నాయుడు చిరుమామిళ్ల మాట్లాడుతూ.. మా 'వదలా' ఈవెంట్‌కు వచ్చిన అనిల్ రావిపూడికి థాంక్స్. తమ్మారెడి వల్లే నేను నిర్మాతగా నిలబడగలిగాను. ప్రతీ రోజూ సెట్‌లో 150 మందికి భోజనం పెట్టాను. అదే నాకు అదృష్టం. జగపతిబాబు , లయ, చోటా, దర్శకుడు వంశీ, వంశీశేఖర్‌ల ఆత్మీయత నాకెంతో నచ్చింది.

## 'రాజా ది రాజా' ఆడియన్స్ ఎంజాయ్ చేస్తా: రుత్విక్



రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన రాజా ది రాజా చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్‌కు సంబంధిం చిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. .

**మీ తొలి సినిమా విడుదలకు వస్తోంది. ఎలా అనిపిస్తోంది?**
చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. అదే సమయంలో కొంచెం టెన్షన్ కూడా ఉంది. ఈ రోజు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాను. ఈ ప్రయాణంలో దాదాపు ప్రతి విభాగం నుంచి ఎంతో నేర్చుకున్నాను. పూర్తిగా మొదటి నుంచి ప్రారంభించాను.

**యాక్టర్ కావడానికి మీరు చేసిన గ్రౌండ్ వర్క్ ఏమిటి?**
చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉంది. స్కూల్‌లో, నాటకాల ప్రదర్శనల్లో పాల్గొనేవాడిని. షేక్స్పియర్ నాటకంలో డ్యూక్ పాత్ర కూడా చేశాను.అమెరికాలో ఫిల్మ్ కోర్స్ చదివాను. అలాగే కొన్ని షార్ట్ ఫిల్మ్స్ కూడా చేశాను. నేను చేసిన ఒక షార్ట్ ఫిల్మ్‌లో డ్యూయల్ రోల్ చేశాను.

**ఈ సినిమా చేయడానికి ముందు ఎన్ని కథలు విన్నారు?**
దాదాపు ఏడు కథలు విన్నాను. అందులో ఖిమార్సల్ ఆర్ట్స్ నేపథ్యంలో ఒక కథ వుంది. నిజానికి దాంతోనే హీరోగా పరిచయం కావాలనుకున్నాను. దాని కోసం ఏడు నెలలు ప్రిపరేషన్ కూడా చేశాను.

**తొలి సినిమాకే రెండు గెటప్స్ చేయడం ఎలా అనిపించింది?**
నాకు ఎప్పుడూ ఛాలెంజింగ్ పాత్రలు చేయడమే ఇష్టం. ఈ సినిమాలోని రెండు గెటప్స్ కోసం పూర్తిగా ప్రిపేర్ అయ్యాను. కాస్ట్యూమ్స్ కూడా స్వయంగా చూసుకున్నాను.

**సాయికుమార్ , నరేష్‌తో కలిసి నటించడం ఎలా అనిపించింది?**
నరేష్ గారు నా తండ్రి పాత్రలో కనిపిస్తారు. ఆయనతో నటించడం చాలా ఎంజాయ్ చేశాను. ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించారు. సెట్స్‌లో చాలా సరదాగా ఉంటారు.

**డైరెక్టర్ అనిల్ బోయిడపు గురించి?**
తనకి సినిమా అంటే చాలా పాషన్. పలు సూపర్ హిట్ సినిమాలకు ఆయన అసోసియేట్‌గా పని చేశారు. చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. చాలా మంచి డైరెక్టర్ అవుతారు.

## 'కరుణామయ'చిత్రం ప్రారంభం



చైతన్య శక్తి, స్వాతి శ్రీ జంటగా బాబీ పిక్చర్స్ మీద ప్రొడక్షన్ నెంబర్. 1గా సంకా బత్తుల నాగేశ్వరరావు నిర్మించనున్న చిత్రం 'కరుణామయ' ప్రముఖ దర్శకులు వి.వి. వినాయక్, వి.ఎన్ ఆదిత్యల చేతుల మీదుగా ఘనంగా ప్రారంభంబాబీ పిక్చర్స్ మీద ప్రొడక్షన్ నెంబర్.1గా సంకాబత్తుల నాగేశ్వరరావు నిర్మించనున్న చిత్రం 'కరుణామయ' చైతన్య శక్తి, స్వాతి శ్రీ జంటగా రాబోతోన్న ఈ సినిమాకి హర్షవర్ధన్ పారెళ్ళ దర్శకత్వం వహించనున్నారు. ఆరాధ్య హైందవి సమర్పణలో ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కనున్న ఈ మూవీని ఈ ఏడాది డిసెంబర్ 23న విడుదల చేయనున్నారు. నిర్మాతసంకాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. క్రిస్మస్ సందర్భంగా మా సినిమాని ఈ ఏడాది డిసెంబర్ 23న రిలీజ్ చేయాలని అనుకుంటున్నాం. మాకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కోసం వచ్చిన వి.వి.వినాయక్‌కి, వి ఆదిత్యకి ధన్యవాదాలు అని అన్నారు. దర్శకుడు హర్షవర్ధన్ పారెళ్ళ మాట్లాడుతూ ..కుటుంబ కథా చిత్రంగా మా 'కరుణామయ' తెరకెక్కబోతోంది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మా నిర్మాత నాగేశ్వరరావుకి థాంక్స్. హీరో చైతన్య శక్తి మాట్లాడుతూ .. 'కరుణామయ'చిత్రంలో నేను హీరోగా పని చేస్తున్నాను. ఇంత మంచి కథలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మా మూవీని హిట్ చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. హీరోయిన్ స్వాతి శ్రీ మాట్లాడుతూ .. 'కరుణామయ' సినిమాలో నేను హీరోయిన్‌గా చేస్తున్నాను. నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్.

## 'ఆపరేషన్ అరుణారెడ్డి' ప్రీ రిలీజ్ ఈవెంట్



ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ..ప్రముఖ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ అరుణారెడ్డి' ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్ బాధ్యతలు కూడా పోసాని కృష్ణమురళి వహిస్తుండటం విశేషం. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్, బీజేపీ నేత రఘునందన్ రావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 17న 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ మహదేవ్ ఏలేందర్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని పోసాని ఎంతో ప్లానింగ్‌తో రూపొందించారు. . కథ విన్నప్పుడే ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందని అనిపించింది. డీవోపీ సుధాకర్ మాట్లాడుతూ ఇందాక మా మ్యూజిక్ డైరెక్టర్ చెప్పినట్లు 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమా పోసానికి 2.ఓ అవుతుంది. ఈ సినిమాకు వర్క్ చేసేప్పుడు పోసానిదగ్గర ఎంతో నేర్చుకున్నాను. హీరోయిన్ హిందోళ చక్రవర్తి మాట్లాడుతూ 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమాలో ప్రధాన పాత్రలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. సెకండ్ లీడ్ రోల్ కాజల్‌శర్మ మాట్లాడుతూ 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమాలో అరుణారెడ్డి స్నేహితురాలి పాత్రలో నటించాను. ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ కు వస్తోంది.

## 'చెన్నై లవ్ స్టోరీ' గ్రాండ్ ప్రెస్ మీట్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫొటో, ,బేబి వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొంద ుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ' ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు నటి సిరి హన్మంతు మాట్లాడుతూ 'చెన్నై లవ్ స్టోరీ' మూవీలో నటించే అవకాశం దక్కడం హ్యాపీగా ఉంది. ఈ నెల 24న మీరంతా మా సినిమాతో ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చూడబోతున్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ ఈరోజు బర్త్ డే జరుపుకుంటున్న కిరణ్ గారికి హ్యాపీ బర్త్ చెబుతున్నా. మా మూవీ నుంచి గ్లింప్స్ రిలీజ్ చేసి ఏడాది అవుతోంది. ఇప్పటిదాకా మీరు ఆ గ్లింప్స్ ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. కో ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ ప్రేమ అనే పదం ఒక్కో టైమ్ లో ఒక్కోలా వినిపిస్తుంటుంది. ఇప్పుడు నాకు ప్రేమ అంటే చెన్నై లవ్ స్టోరీనే. మరో నెల రోజుల వరకు ఈ సినిమానే నా ప్రేమ.అన్నారు డైరెక్టర్ రవి నంబూరి మాట్లాడుతూ మా సినిమాలో నివి, స్టీవెన్ శంకర్ క్యారెక్టర్స్ మధ్య అందమైన సంభాషణలు ఉంటాయి. ఈ రెండు పాత్రలకు టైమ్ తీసుకుని టమంచి డైలాగ్స్ రాశాం. ఆ స్వేచ్ఛను మా ప్రొడ్యూసర్స్ ఇచ్చారు.




బుధవారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ నిరుద్యోగ జెఎసి నేతలు

# జిఓ 46ను తక్షణమే రద్దు చేయాలి

## తెలంగాణ నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో నిరుద్యోగ రణభేరి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జులై 15, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 46ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరు ద్యోగ రణభేరి పేరుతో పెద్ద ఎత్తున ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంకు నవజవాన్ భారత్ సభ, దిశ విద్యార్థి సంఘం నేతలతో పాటు పలువురు రాజకీయనాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మోతీలాల్ నాయక్, వినోద్‌లు మాట్లాడుతూ 20వేల పోస్టులతో పోలీస్ మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీవో నెంబర్ 87ను సవరించి, ఎస్ఐ వయోపరిమితి 38యేళ్లకు, కానిస్టేబుల్ వయోపరిమితిని 36 యేళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్, అశోక్‌నగర్ నిరసనల్లో విద్యార్థులు, నిరుద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను భేషరతుగా ఎత్తివేయాలని, ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా మార్చి భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ఆమోదించాలని, లేనిపక్షం నెలకు పది వేల రూపాయల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్‌లు జారీ చేసి పరీక్ష ఫలితాలు ప్రకటించిన ఆరు నెలల్లోగా నియామక పత్రాల జారీని తప్పనిసరిగా చేయాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగనాయకులు చైతన్య కుమార్, వేముల కార్తిక్, మహిపాల్, రోహిత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.




బుధవారం విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్ ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

# విద్యకు అధిక ప్రాధాన్యం: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(అల్వాల్), జులై 15 ప్రభాతవార్త:** విద్య, ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఓల్డ్ అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో డాక్టర్ జయ్‌ప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డిఆర్) ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్‌ను మంత్రితో పాటుగా పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్‌లు సం యుక్తంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పాఠాలు బట్టీపట్టే కంటే శాస్త్రీయ దృక్పథం ద్వారా ఆలోచింపచేసే శక్తి మెరుగవుతుందని పేర్కొన్నారు. ఒకనాడు దిగుమతులుపై ఆధారపడిన దేశం ఎగుమతులు చేసే స్థాయికి వెళ్ళడం శాస్త్రవేత్తల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎఫ్‌డిఆర్ ఆద్వర్యంలో బాలికల పాఠశాలలో సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఆయన తెలిపారు. మేదస్సు వికాసం ద్వారానే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజజేందర్ పేర్కొన్నారు. విద్య మీద ఖర్చు చేసే ప్రతి పైసా భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ సెంటర్‌ల ఏర్పాటును మరింత విస్తృత పరుస్తామని ఎఫ్‌డిఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ పేర్కొ న్నారు. పాఠ్య పుస్తకాలు పఠనం ద్వారా మేదా శక్తిని పెంపొందించుకోవచ్చని పేర్కొన్న ఆయన ఆవిష్కరణలు ద్వారా ఉన్నతమైన స్థితికి చేరుకుంటారని వివరించారు. సినిమా, సైన్స్‌కు విడదీయరాని బందం ఉందని రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శాస్త్రీయ దృక్పదం లేకుండా సినిమా తీయలేమని తెలిపారు. విద్యార్థులు థామస్ అల్వా ఎడిసన్‌లా పోరాడి గెలవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాధికారిణి రేణుక దేవి, ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్, జిల్లా సైన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఇఓ మురళి క్రిష్ణ మూర్తి, పాఠశాల ప్రధానో పాధ్యా యురాలు శకుంతల, రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజని ప్రియ తదితరులు పాల్గొన్నారు.




బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న జాన్‌వెస్లీ

# ఉపాధి కల్పనను ప్రాథమిక హక్కుగా మార్చాలి

## ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి

### సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగుల మహాధర్నాలో పలువురు నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జులై 15, ప్రభాతవార్త:** అందరికీ తిండి, చదువు, వైద్యంతో పాటు ఉపాధి కల్పనను ప్రాథమిక హక్కుగా మార్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున నిరుద్యోగుల మహాధర్నా నిర్వహించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురావు టి. జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు సీపీఎం పోలీట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్‌రావు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బి.వి.రాఘవులు మాట్లాడుతూ నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు చేస్తున్న పోరాటాలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీకై 25లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని, దీనిపై ఢిల్లీలో వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందని, మనిషి పనిని సులభతరం చేసేలా యంత్రా లు ఉండాలి కానీ, ఉపాధిని దెబ్బతీసే విధంగా ఉండకూడదని అన్నారు. దేశ అవసరాలకు వాడాల్సి న సహజవనరులను అంబానీ, ఆదానీ లాంటి సంస్థలకు మోదీ సర్కార్ కట్టబెడుతోందని ఆరోపించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాలతో సాధించుకున్న తెలంగాణలో ఆ హామీలను నెరవేర్చటంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రెండు లక్షలఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని కాంగ్రెస్ బుట్ట దాఖలు చేసిందని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి, నోటిఫికేషన్లువిడుదల చేయాలని, లేని పక్షం పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చాక దేశంలోనే నెలసరి వేతనం పొందే వారి సంఖ్య వేగంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఓయూ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ఆర్ఎల్ మూర్తి, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ఆర్ఎల్ మూర్తి, డి.ఉపేందర్, కొడంగల్ రవి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మి, బండారు రవి, డివైఎఫ్ఐ రాష్ట్ర అద్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

## గురుకుల సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యం వద్దు

### సంస్థ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై15:** పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభవిష్య త్తును తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష ్య మని, అర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి దళిత, గిరి జన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సంక్షే మానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధు లు వెచ్చిస్తున్న నేపథ్యంలో, ఆ లక్ష్యాలకు అను గుణంగా అధికారులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. బుధవారం డీఎస్సీ భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్)కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి తమ పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుంచి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను ఓపికగా వింటూ వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుపై ఉన్న ఆశయాలను అడిగి తెలు సుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లో సీట్లు కేటాయించాలని, ఇతర జిల్లాల్లో చదివించడం వల్ల రవాణా, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రికి వివరించారు. వారి సమస్యలను విన్న మంత్రి స్పందిస్తూ, పేద కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు వారికి అనుకూలమైన జిల్లాల్లో సీట్లు కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్) సక్రు నాయక్కు మంత్రి పలు కీలక సూచనలు చేశారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం,

విద్యార్థుల సంక్షేమం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని, ప్రతి అర్జీని నిబంధనల పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని ఆదే శించారు. అలాగే మారుమూల గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదం డ్రులు, సంరక్షకులు, బంధువులతో అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. వారికి స్పష్టమైన సమాచారం అందిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిఎం. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థుల విద్యా అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ భారీ స్థాయిలో నిధులు కేటాయించి గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్న సమయంలో, క్షేత్రస్థాయిలో అధికారుల నిరక్ష ్యం లేదా అలసత్వానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలను ప్రతి అధికారి తన బాధ్యతగా భావించి పనిచేయాలని, ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించాల్సి న బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆ లక్ష్యాల సాధనలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా

# రాష్ట్రంలో పడిపోయిన ఉద్యాన సాగు

## 1.72 లక్షల ఎకరాల్లో పంటల కోత

## 9,51,134 ఎకరాలకు మాత్రమే పరిమితం

## కూరగాయల సాగు 34,146 ఎకరాలకు తగ్గుదల

## గత యేడాది కంటే 2 లక్షల ఎకరాల్లో తగ్గిన విస్తీర్ణం

## రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యాన శాఖ నివేదిక

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు తెలంగాణలో ఆహార, వాణిజ్యపంటలతో పాటు, ఉద్యాన పంటల సాగుపైనా తీవ్ర ప్రభావం చూపాయి. గతఏడాది కంటే ఈ సారి పంటల సాగు పడిపోయింది. రాష్ట్రంలో ఈసారి వర్షా భావం కారణంగా వరి సాగు తగ్గుతుందని, దాని స్థానంలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెరుగుతుందని రైతులు, అధికారులు భావించారు. అయితే దానికి భిన్నంగా వ్యవసాయ పంటలతో పాటు, ఉద్యాన పంటల సాగుకూడా భారీగా తగ్గుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలో గత ఏడాది ఇదే సమయానికి 11,24,001 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయగా, ఈ ఏడాది అది 9,51,134 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. ఈ మేరకు దీనికి సంబంధించి ఉద్యాన శాఖ బుధవారం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో వెల్లడించింది. దీంతో మొత్తం 1,72,867 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు తగ్గినట్లు స్పష్టమైంది. కూరగాయలు, పసుపు, మిర్చి తదితర పంటల సాగు గణనీయంగా తగ్గిపోవడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా అధికారులు పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరగడం వల్ల 2023 నుంచి 2025 వరకు ఉద్యాన పంటల సాగు క్రమంగా తగ్గుతూ వచ్చింది. సాధారణంగా తెలంగాణలో ఏప్రిల్ నుంచి జులై వరకు ఉద్యాన పంటల ప్రధాన సాగు సీజన్‌గా ఉంటుంది. ఈ సయంలో 2023లో 12,03,380 ఎకరాలు, 2024లో 11,39,832 ఎకరాలు, 2025లో 11,24,001 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం కేవలం 9,51,134 ఎకరాల్లోనే ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. పంటల వారీగా సాగు పరిస్థితి నివేదికలో పేర్కొన్నట్లుగా గత ఏడాది ఇదే సమయానికి టమాటా, బెండ, బీరతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరలు కలిపి 53,405 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి అవి 19,259 ఎకరాలకు పరిమితమయ్యాయి. దీంతో కూరగాయల సాగు 34,146 ఎకరాలు తగ్గింది. పసుపు, మిర్చి, అల్లం, వెల్లుల్లి, ఉల్లి, ఇతర మసాలా దినుసుల సాగు కూడా భారీగా క్షీ ణించింది. గత ఏడాది 1,81,735 ఎకరాల్లో సాగు చేసిన ఈ పంటలు ప్రస్తుతం 41,395 ఎకరాల్లో మాత్రమే ఉన్నాయి. అంటే ఈ విభాగంలోనే 1,40,340 ఎకరాల సాగు తగ్గింది. అలాగే మామిడి, నిమ్మ, దానిమ్మ, జామ వంటి పండ్ల తోటల విస్తీర్ణంలో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. గత ఏడాది 4,52,921 ఎకరాల్లో ఉన్న ఈ తోటలు ప్రస్తుతం 4,52,104 ఎకరాల్లో కొనసాగుతున్నాయి. ఇక ఆయిల్‌పాం సాగు మాత్రం పెరుగుదల నమోదు చేసింది. గత ఏడాది 3,10,776 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పాం, ఇతర సంబంధిత పంటలు ఈసారి 3,20,111 ఎకరాలకు చేరాయి. దీంతో కొత్తగా 9,335 ఎకరాల్లో ఈ పంటల సాగు పెరిగింది.

అయితే పూల పంటలు, ఔషధ మొక్కల సాగు కూడా ఈసారి గణనీయంగా తగ్గినట్లు ఉద్యాన శాఖ నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితులు మెరుగుపడితే రానున్న రోజుల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముందని నివేదికలో అధికారులు స్పష్టం చేశారు.

# పసుపు యంత్రాల సబ్సిడీకై దరఖాస్తుల ఆహ్వానం

## నిజామాబాద్ పసుపు బోర్డు నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు, ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తన అభివృద్ధి కార్యక్రమాలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించింది. పసుపు పంట కోత అనంతరం అవసరమైన వివిధ రకాల యంత్రాలను కొనుగోలు చేయడానికి, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం (సబ్సిడీ) కోరుతూ అర్హులైన రైతులు, భాగస్వాముల నుండి పసుపు బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కోత అనంతర యాంత్రీకరణకు ఆర్థిక రాయితి కల్పించడం ద్వారా, మార్కెట్‌లో పసుపు నాణ్యతను పెంచడం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ పసుపు ఉత్పాదకతను, పోటీతత్వాన్ని గణనీయంగా పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. పసుపు పంట కోత అనంతరం అవసరమైన వివిధ రకాల యంత్రాలను కొనుగోలు చేయడానికి, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం (సబ్సిడీ) కోరుతూ అర్హులైన రైతులు, భాగస్వాముల నుండి బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ వ్యూహాత్మక చొరవ ప్రత్యేకంగా పసుపు పండించే రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతు సంఘాలు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఎంతో మేలు చేకూర్చనుందని బోర్డు అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 22వ తేదీ నుండి ప్రారంభంకానున్న దరఖాస్తు ప్రక్రియ దాన్ని సమర్పించడానికి ఈ నె 31, సాయంత్రం 5.30 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. పూర్తి చేసిన దరఖాస్తులను, దానికి జోడించాల్సిన అన్ని నిర్దేశిత పత్రాలతో పాటు, నిర్ణీత గడువు ముగిసేలోపు నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో స్వయంగా సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఈ పథకం కింద దరఖాస్తులను ముందుగా వచ్చిన వారికి ముందుగా ప్రాధాన్యత ప్రాతిపదికన మాత్రమే పరిగణించనున్నారు. అందువల్ల అర్హులైన ఆసక్తి గల రైతులు, సంస్థలు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# పామాయిల్‌కు ప్రోత్సాహం

## రాష్ట్రంలో సాగుకు ఊతం

## ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం



**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త :** నూనెగింజలు, పామాయిల్‌కు కేంద్రం ప్రోత్సాహం తెలంగాణకు ఊతమిచ్చింది. నూనెగింజలు, పామా యిల్ సాగుపై కేంద్రం దృష్టి సారించడం తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, పంటల వైవిధ్యీకరణ కు తోడ్పడుతుందని వ్యవసాయ శాఖ భావిస్తోంది. అధికారవర్గాలు వెల్లడించిన వివరాలు ప్రకారం జాతీయ ఆహార భద్రతా మిషన్ (నూనెగింజలు), జాతీయ వంట నూనెల మిషన్-ఆయిల్ పామ్ (ఎన్ఎమ్ఇఒ-ఒపి) కింద నూనెగింజలు, వంట నూనెలపై కేంద్రం పునరుద్ధరించిన దృష్టి, ముఖ్యంగా పామ్ సాగు వేగంగా విస్తరిస్తున్న జిల్లాల్లో తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తుందని భావిస్తున్నారు. భారీ స్థాయిలో సాగు విస్తీర్ణం పెరగడం, రైతుల బలమైన భాగస్వామ్యంతో ఆయిల్ పామ్ మిషన్ కింద తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని ఇటీవలి ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ప్రస్తుతం జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్‌గా పునర్‌వ్యవస్థీకరించబడిన జాతీయ ఆహార భద్రతా మిషన్, మెరుగైన విత్తనాలు, వ్యవసాయ పద్ధతులు, రైతు సహాయం ద్వారా నూనెగింజలతో సహా కీలక పంటలలో ఉత్పాదకతను పెంచడాన్ని లక్ష ్యంగా పెట్టుకుంది. జాతీయ వంట నూనెల మిషన్-ఆయిల్ పామ్ కింద, తోటల పెంపకానికి మద్దతు, విత్తన తోటలు, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో పామాయిల్‌ను దీర్ఘకాలిక ఆదాయ వనరుగా ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ ఇప్పటికే తన లక్ష ్యంలో గణనీయమైన భాగాన్ని అధిగమించి, సాగు విస్తీర్ణాన్ని పెంచుతూనే ఉంది. రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ఇస్తున్న ప్రోత్సాహానికి ఈ మిషన్ అనుగుణంగా ఉందని, ఇది రైతులకు హామీతో కూడిన నీటిపారుదల, మార్కెట్ సౌకర్యం, ప్రాసెసింగ్ మద్దతును అందిస్తుందని అధికారులు తెలిపారు. ఈ రెండు పథకాలను జాగ్ర త్తగా అమలు చేస్తే, మెట్ట, నీటిపారుదల వ్యవసాయ రంగాల రూపురేఖలను మార్చగల వని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవరావు అన్నారు. నూనెగింజల పంటకు దిగుబడి మెరుగు దల అవసరం కాగా, పామాయిల్‌కు ఓపిక, ప్రాసెసింగ్ మద్దతు కావాలి. ధరలు, నీటిపారు దల,కొనుగోలు వ్యవస్థలు నమ్మదగినవిగా ఉన్న ప్పుడు రైతులు త్వరగా స్పందిస్తారు కాబట్టి తెలం గాణ మంచి స్థితిలో ఉందన్నారు. వైవిధ్యీక రణ ను నీటి వినియోగం, ముడిసరుకుల ఖర్చులు, మార్కెట్ స్థిరత్వంతో సమతుల్యం చేసుకోవడం చాలా కీలకమని ఆయన హెచ్చరించారు. నారు మొక్కలు, విస్తరణ సేవలు, హామీతో కూడిన అమ్మకాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుంటే, తెలంగాణ చూపిన మార్గం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవగలదని

# అయోధ్య విరాళాల దుర్వినియోగంపై విచారణ చేయాలి

## బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ డిమాండ్



బుధవారం హైదరాబాద్‌లో మాట్లాడుతున్న బసవరాజు శ్రీనివాస్, నందిగామ లక్ష్మీనారాయణ, ఎం.వి శాస్త్రీ తదితరులు

**హైదరాబాద్,జూలై 15,ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్ లోని శ్రీరామ జన్మభూమి అయోధ్య ట్రస్టులో విరాళాల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షి ంచాలని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రిని డిమాండ్ చేసింది.

ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బాస్ ఛైర్మన్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్, కార్యదర్శి నందిగామ లక్ష్మీ ్మనారాయణ మాట్లా డారు. దేశవ్యాప్తంగా రామభక్తులు అందజేసిన విరాళాలలో లెక్క చూపకుండా వాడుకుంటు న్నారని వార్తలు రావడం విచారకర మన్నారు. తిరుపతి తిరుమల దేవస్థా నంలో ఏవిధంగానైతే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేసి నిర్వహణ చేస్తున్నారో ఆ విధంగానే అయోధ్య రామాల యంలో ట్రస్ట్ బోర్డ్‌ను ఏర్పాటు చేసి నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎం.విశాస్త్రీ, గోపికృష్ణ , కైలాష్, వై శ్రీనివాస్, జనగామ నాగరాజు

# రూ.2,500 కోట్ల రుణ సమీకరణ

## ఈ ఆర్థికంలో రూ.31,400 కోట్లకు చేరిన రుణం

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.2,500 కోట్ల మేర రుణాన్ని సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ వేలంలో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టడం ద్వారా ఈ రుణాన్ని సమీకరించింది. ఈ మొత్తంలో 7.70 శాతం వార్షిక వడ్డీకి 11 ఏండ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 7.75 శాతం వార్షిక వడ్డీకి 29 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.1,500 కోట్లు తీసుకుంది. దీంతో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలు రూ.31,400 కోట్లకు చేరాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకూ కలిగిన తొలి త్రైమాసికంలో రూ.18,900 కోట్ల రుణ సమీ కరణ చేసింది. అలాగే జూలై నుండి సెప్టెంబర్ వరకూ రెండో త్రైమాసికం(క్యూ2)లో రూ.21,000 కోట్ల రుణం కోసం రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనలు పంపింది. గత 2025-26 వార్షిక బడ్జెట్ అంచనాల్లో రుణ సమీకరణను రూ.54,009 కోట్ల లోపే ప్రతిపాదిం చినా, అంతకు మించి ఒక్క రిజర్వ్ బ్యాంక్ నుంచే రూ.85,840 కోట్లు రుణ సౌకర్యాన్ని పొందింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.80వేల కోట్ల రుణ సమీకరణ చేస్తామని అంచనా బడ్జెట్‌లో ఆర్థిక శాఖ ప్రతిపాదించింది.

# దేశంలోనే తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

## జూన్ నెలలో 6.36 శాతం నమోదు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** మార్కెట్లో మళ్లీ నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. జాతీయ గణాంకాల కార్యాలయం తాజాగా విడుదల చేసిన వినియోగదారు ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం డేటా దీనికి అద్దం పడుతోంది. 2024 ను బేస్ ఇయర్‌గా తీసుకొని ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన కొత్త సిరీస్‌లో ద్రవ్యోల్బణం 4 శాతం దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మే నెలలో 3.93 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నాటికి 4.38 శాతానికి ఎగబాకింది. జూన్ నెలలో నమోదైన ద్రవ్యోల్బణం ఏకంగా 18 నెలల గరిష్ఠ స్థాయి కావడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ద్రవ్యోల్బణం 4.74 శాతంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.92 శాతంగానే ఉంది. రాష్ట్రాల వారీగా చూస్తే దేశంలోనే అత్య ధికంగా తెలంగాణలోనే అత్యధికంగా ద్రవ్యో ల్బణం నమోదు కావడం గమనార్హం. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే నిత్యావసర వస్తువులు, సేవల ధరలు చాలా వేగంగా పెరుగుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 6.36 శాతంగా ఉండగా ధరలు ఇక్కడ చాలా ఎక్కువగా ఉన్నాయని చెప్పొచ్చు. అత్యల్పంగా ద్రవ్యోల్బణం మిజోరంలో (1.63 శాతం) నమోదై ధరలు తక్కువగానే ఉన్నాయి.

# రూ.20,457 కోట్లతో 1600 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు

## ఎన్టీపిసి బోర్డు ఆమోదం

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు థర్మల్ ప్రాజెక్టుల విస్తరణ నిమిత్తం ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. లారా సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు మూడవ దశ (2న800 మెగావాట్లు) కోసం రూ.20,456.70 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలకు బోర్డు ఆమోదించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో దీంతో ఈ ప్రాజెక్టు కింద ఆమోదించబడిన మొత్తం సామర్థ్యం 1600 మెగావాట్లకు చేరుతుంది. రాబోయే రెండు దశాబ్దాలల్లో నిర్మించాలను కుంటున్న 30 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యానికి అవసరమైన ఇంధన సరఫరాను మరింత సురక్షితం చేసుకునేందుకు ఎన్టీపీసీ విదేశీ యూరేనియం గనుల్లో కూడా పెట్టుబడి పెట్టాలని ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించింది.